తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 27.04.2026 | సంపుటి : 12 సంచిక : 277 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్


ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






## ట్రంప్,మంత్రులే లక్ష్యంగా అమెరికా వైట్‌హౌస్‌లో

# కాల్పులు




కాల్పులు జరిపిన నిందితుడు కోల్ టామోస్ అలెన్ పట్టుబడిన దృశ్యం

- ట్రంప్,జేడీవాన్స్ సహా ఇతర మంత్రులకు త్రుటిలో తప్పిన పెనుప్రమాదం
- వారిని సురక్షిత ప్రాంతానికి తరలించిన అధికారులు
- ఘటనను ఖండించిన ప్రపంచ దేశాలు
- నేను భయపడుతూ బతికే రకం కాదు
- ఇరాన్ యుద్ధంలో విజయం సాధించకుండా నన్ను ఏది భయపెట్టలేదు
- ఈ పదవిలో ఉన్న ముప్పుల గురించి తనకు ముందే తెలుసని వ్యాఖ్య

## నివ్వెరపోయిన అమెరికా భద్రతా సిబ్బంది





వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో నిర్వహించిన వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ జరిగిన కాల్పుల ఘటన అనంతరం అమెరికా అధ్యక్షుడు ట్రంప్, అతడి సతీమణి మెలానియా ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌లను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న భద్రతా సిబ్బంది

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికా శ్వేతసౌధం సమీపంలో కాల్పులు కలకలం రేపాయి. వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో నిర్వహించిన వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో ఓ దుండగుడు కాల్పులు జరిపాడు. కాల్పుల ఘటన తర్వాత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన సతీమణి మెలానియాతోపాటు ఉపాధ్యక్షుడు జేడీవాన్స్, రక్షణశాఖ మంత్రి పీట్ హెగ్సెత్, విదేశాంగశాఖ మంత్రి మార్కో రుబియోను అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి అపాయం జరగలేదన్నారు. సీక్రెట్ సర్వీస్, ఇతర భద్రత అధికారులు బ్యాంకెట్ హాల్‌లోకి ప్రవేశించడంతో వందలాది మంది అతిథులు ప్రాణభయంతో టేబుళ్ల కింద దాక్కున్నారు. ఐదు నుంచి ఎనిమిది రౌండ్ల కాల్పుల శబ్దాలు వినిపించినట్లు అక్కడున్నవారు తెలిపారు. బ్యాంకెట్ హాల్ వెలుపల భద్రత కట్టుదిట్టం చేశారు.

**మేమంతా సేఫ్:ట్రంప్**

వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో కాల్పుల ఘటనపై అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు, అధికారులు అద్భుతంగా పనిచేశారని కొనియాడారు. క్షణాల్లోనే ఎంతో వేగంగా, ధైర్యంగా ప్రతిస్పందించినట్లు తెలిపారు. కాల్పులు జరిపిన వ్యక్తిని పట్టుకున్నట్లు వెల్లడించారు. వెంటనే అక్కడి నుంచి తనతో పాటు మెలానియా, జేడీవాన్స్, క్యాబినెట్ సభ్యులందరినీ తరలించినట్లు తెలిపారు. తామంతా సురక్షితంగా ఉన్నామని ట్రంప్ పేర్కొన్నారు. శ్వేత సౌధం మీడియా కరస్పాండెంట్ల డిన్నర్‌లో కాల్పులు జరిపేందుకు హిల్టన్ హోటల్‌లోనే నిందితుడు ఆయుధాన్ని సిద్ధం చేశాడు. ప్రత్యక్ష సాక్షిని ఉటంకిస్తూ అమెరికా మీడియా ఈ విషయాన్ని వెల్లడించింది. ప్రత్యక్ష సాక్షి హెలెన్ మబుస్ అనే వాలంటీర్ మాట్లాడుతూ.. బార్ కార్ట్స్ (శీతల పానీయాలను అందించే ట్రాలీలు) ఉంచే

మిగతా 2లో..



వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో నిర్వహించిన వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ కార్యక్రమంలో ట్రంప్

## ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదు

**ట్రంప్ కార్యక్రమంలో కాల్పుల ఘటనను ఖండించిన మోదీ**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని భారత ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో శ్వేతసౌధ కరస్పాండెంట్ల డిన్నర్‌లో కాల్పులపై ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆ దేశ తొలి మ హిళ మెలానియా ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ దాడి నుంచి సురక్షితంగా బయటపడటం తనకు ఉపశమనం కల్పించిందన్నారు.

మిగతా 2లో..

## నిందితుడు ఉన్నత విద్యావంతుడు



- టెస్ట్ ప్రిపరేషన్ ట్యూటరింగ్ కంపెనీలో టీచర్‌గా విధులు
- ట్రంప్ కార్యక్రమంలో కాల్పుల నిందితుడి నేపథ్యం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొన్న శ్వేత సౌధం కరస్పాండెంట్స్ డిన్నర్‌లో కాల్పులకు పాల్పడిన నిందితుడు ఓ ఉన్నత విద్యావంతుడిగా తేలింది. అతడిని దర్యాప్తు బృందాలు 31 ఏళ్ల కోల్ టామోస్ అలెన్‌గా గుర్తించాయి. కాలిఫోర్నియాలోని లాస్ ఏంజెలెస్ శివార్లలో ఉన్న టోరెన్స్ ప్రాంత వాసిగా గుర్తించారు. అతడి

మిగతా 2లో..





## మూడేళ్ల నిరీక్షణకు తెర

**గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియామకమైన అజారుద్దీన్, కోదండరాం**

**హైదరాబాద్(జనంసాక్షి):** అజారుద్దీన్, కోదండరాంలను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం నియామకమయ్యారు. గత కొన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న మంత్రి అజారుద్దీన్, కోదండరాంల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలకు ఇటీవల లైన్ క్లియర్ అయింది. ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాల ఫైల్‌పై గవర్నర్ సంతకం చేశారు. ఈ నేపథ్యంలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలపై నేడు గెజిట్ నోటిఫికేషన్ వెలువడింది. ఇప్పటికి మూడు సంవత్సరాలుగా గవర్నర్ కోటా

మిగతా 2లో..


## ప్రజాసమస్యలు సత్వరం పరిష్కరించండి

**ప్రజావాణి ఫిర్యాదులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష**

- సేవలను రెవెన్యూ డివిజన్ స్థాయికి విస్తరించాలి
- ఫిర్యాదుల పరిష్కార వేదికను మరింత పకడ్బందీగా అమలు చేయాలి
- ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలి
- ప్రజలకు మరింత చేరువగా ప్రజావాణి సేవలు అందాలి
- ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువు ఉండాలి
- ఆలస్యం జరిగితే అధికారులదే బాధ్యత
- అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** రాష్ట్రంలో ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పకడ్బందీగా అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి విస్తరించాలని సూచించారు. ప్రభుత్వం అధికారం చేపట్టిన మరుసటి రోజే 2023 డిసెంబర్ 8వ తేదీన ప్రజావాణి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మహాత్మా జ్యోతిభా పూలే ప్రజా భవన్?లో ప్రజావాణి విజయవంతంగా అమలవుతోంది. ఇవాళ ఉదయం ఎంసీహెచ్ఆర్డీలో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజావాణిపై మాట్లాడారు. దూర ప్రాంతాల నుంచి ప్రజలు హైదరాబాద్‌కు

మిగతా 2లో..



## వివరాలు చెబితే పథకాలు రావనే అపోహ వద్దు

- గవర్నర్, సీఎం రేవంత్ సహాప్రముఖుల 'సెల్ఫ్ ఎన్యుమరేషన్'
- ఇవాళ్టి నుంచి మే 10 వరకు రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న జనగణన కార్యక్రమం
- తొలిసారి డిజిటల్ రూపంలో జనాభా లెక్కల సేకరణ
- స్వీయ ధృవీకరణలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సూచించిన ముఖ్యమంత్రి

**హైదరాబాద్(జనంసాక్షి):** జనగణనలో భాగంగా రాష్ట్రంలో స్వీయ ధ్రువీకరణ కార్యక్రమం ప్రారంభమైంది. గవర్నర్ శివప్రతాప్ శుక్లా సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు శ్రీకారం చుట్టారు. మే 10 వరకు రాష్ట్రంలో ఈ కార్యక్రమం జరగనుంది. తొలిసారి డిజిటల్ రూపంలో జనాభా లెక్కలు సేకరిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సీఎం రేవంత్ రెడ్డి సహా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలో జనగణన సందడి ప్రారంభమైంది. జనగణన2027 స్వీయ నమోదు కార్యక్రమాన్ని గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రారంభించారు. ఆన్‌లైన్‌లో

మిగతా 2లో..

## మహిళలకు తీపికబురు

- బీసీ మహిళలకు ఫ్రీగా కుట్టు మిషన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం
- ఒక్కో నియోజకవర్గానికి వెయ్యి చొప్పున వంద శాతం సబ్సిడీతో అందజేత
- మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు, ఆసరాగా ఉపయోగపడుతుంది:మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్(జనంసాక్షి):** మహిళలకు స్వయం ఉపాధి కల్పించడంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో ముఖ్యమైన సంక్షేమ పథకానికి శ్రీకారం చుట్టింది. టైలరింగ్ నైపుణ్యం కలిగిన బీసీ మహిళలకు కుట్టు మిషన్లను అందించేందుకు జీవో జారీ చేసింది. పథకం అమలుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్, నియోజకవర్గానికి 1000 కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వంద శాతం సబ్సిడీతో కుట్టు మిషన్లు : వంద శాతం సబ్సిడీతో పంపిణీ చేసే కుట్టు మిషన్ల దరఖాస్తు ప్రక్రియ త్వరలోనే ప్రారంభం అవుతుందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ కలెక్టర్ల ఆధ్వర్యంలో జరగుతుందని వివరించారు. టైలరింగ్ ద్వారా

మిగతా 9లో..

## పూర్తిగా స్వదేశీ టెక్నాలజీతో న్యూక్లియర్ రియాక్టర్



- అణుపరిశోధనల్లో భారత్ మరో ముందడుగు
- జనగణనలో ప్రతీ పౌరుడు పాల్గొనాలి
- సెల్ఫ్ ఎన్యుమరేషన్‌తో సమయం ఆదా
- బ్రెజిల్ జున్ను పోటీల్లో భారత్ విజయాలు భేష్
- మన్ కీ బాత్ 133వ ఎపిసోడ్‌లో ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత్‌లోనే తొలిసారిగా తమిళనాడులోని కల్పకంలో ఉన్న ఫాస్ట్ బ్రీడర్ న్యూక్లియర్ రియాక్టర్ క్రిటికాలిటీ దశకు చేరడం చారిత్రక మైలురాయి అని ప్రధాని మోదీ కొనియాడారు. ఈ ఘన విజయాన్ని సాధించడం ద్వారా భారత అణు శాస్త్రవేత్తలు దేశానికి కీర్తిని సాధించి పెట్టారని ప్రశంసించారు. ఫాస్ట్ బ్రీడర్ న్యూక్లియర్ రియాక్టర్‌ను తొలిసారిగా క్రిటికాలిటీ దశకు చేర్చడంలో భాగమైన శాస్త్రవేత్తలు సహా ప్రతీ ఒక్కరికీ ఆయన అభినందనలు తెలిపారు. దేశ ప్రజల జీవితాలను మెరుగుపర్చేందుకు, సులభతరం చేసేందుకు శాస్త్రవేత్తలు చేస్తున్న ప్రయత్నా లు అభినందనీయమన్నారు. ఆదివారం రోజు మన్ కీ బాత్ 133వ ఎపిసోడ్‌లో ప్రధాని మోదీ ఈవివరాలను వెల్లడించారు.

**పూర్తిగా స్వదేశీ టెక్నాలజీతో రియాక్టర్**

కొన్ని రోజుల క్రితమే (ఏప్రిల్ 6న) కల్పకంలోని న్యూక్లియర్ రియాక్టర్ పూర్తిస్థాయిలో స్వయంగా పని చేయడం మొదలుపెట్టిందని ప్రధాని మోదీ చెప్పారు. ఆ న్యూక్లియర్ రియాక్టర్‌ను పూర్తిగా స్వదేశీ టెక్నాలజీతోనే తయారు చేయడం అనేది పెద్ద విషయమన్నారు. ఇంధన రంగంలో దేశం సాధించిన ఈ విజయం వికసిత భారత్ లక్ష్యానికి కొత్త శక్తిని అందిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 2024 మార్చిలో కల్పకంలో రియాక్టర్ లోడింగ్ దశను

మిగతా 2లో..



## 'ఆ ఏడుగురిపై వేటు వేయండి'

**రాజ్యసభ ఛైర్మన్‌కు 'ఆప్' వినతి**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు ఒకేసారి భాజపాలోకి ఫిరాయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈ ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఈ ఎంపీల చర్యలు పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలోని నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు."ఆ ఏడుగురు ఎంపీలు ఆప్ నుంచి రాజ్యసభలోకి అడుగుపెట్టారు.

మిగతా 9లో..

## మూసీని దుర్గంధం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే

- కంపెనీలను మేం తీసుకొస్తే మీరు రిబ్బన్ కట్‌చేసి గొప్పలు చెబుతున్నారు
- మోసపు హామీలు నమ్మి ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారు
- ఆ పార్టీలో కమల్‌హాసన్‌ను మించిన నటులు ఉన్నారు:కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):** 2023 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే బీఆర్ఎస్ బలం పెరిగిందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. స్కైరూట్ కంపెనీ తాము తెస్తే.. ఈ సీఎం రిబ్బన్ కట్ చేసి గొప్పలు చెబుతున్నారని విమర్శించారు. "మోసపు హామీలు నమ్మి.. ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేశారు. కాంగ్రెస్‌లో కమల్‌హాసన్‌ను మించిన నటులు ఉన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్లు ఏమయ్యాయి? మూసీని దుర్గంధం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే.

మిగతా 2లో..




## బెంగాల్ ప్రజలు ఉగ్రవాదులా?

- ఎన్నికల వేళ భారీగా కేంద్ర బలగాల మోహరింపుపై కేజ్రీవాల్ ఫైర్
- ఎన్నికల సమయంలో కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేశారు
- సీఎం మమతపై దర్యాప్తు సంస్థల నుంచి రాజకీయ ఒత్తిడి ఉందని విమర్శ

## మే 5 తర్వాత చొరబాటుదారులను ఏరివేస్తాం

- కనికరం లేకుండా గూండాల ఆటకట్టిస్తాం
- మమత, కాంగ్రెస్ హయాంలో ఉగ్రవాదులకు బిర్యానీలు తినిపించారు
- బంగాల్ ఎన్నికల ప్రచారంలో అమిత్‌షా హెచ్చరికలు



**కోల్‌కతా(జనంసాక్షి):** బంగాల్ రెండో దశ ఎన్నికల ప్రచారంలో భాగంగా నాడియాలో మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా టీఎంసీ, కాంగ్రెస్ పార్టీలపై విమర్శలు గుప్పించారు. గతంలో బంగాల్‌లో మమతా బెనర్జీ, కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వాలు ఉగ్రవాదుల పట్ల మెతక వైఖరి అవలంబించాయని ఆరోపించారు. కానీ 2014లో మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నుంచి సర్జికల్, ఎయిర్ స్ట్రైక్స్ లాంటి చర్యలతో ఉగ్రదాడులకు నిర్ణయాత్మకమైన సమాధానం

మిగతా 2లో..

## మే 5 తర్వాత చొరబాటుదారులను ఏరివేస్తాం

ఇచ్చిందని అన్నారు. బంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అక్రమ చొరబాటుదారులను గు ర్తించి, వారిని బహిష్కరిస్తామని అమిత్ షా పేర్కొన్నారు."మమతా బెనర్జీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు ఉగ్రవాదులకు బిర్యానీలు తినిపించేవారు. 2014లో మోదీ సర్కార్ అధికారంలోకి వచ్చాక, ఉరీలో దాడి జరిగితే మేము సర్జికల్ స్ట్రైక్ చేశాం. పుల్వామాలో దాడి జరిగితే ఎయిర్ స్ట్రైక్ నిర్వహించాం. పహల్గాంలో దాడి చేసినప్పుడు, నేరుగా పాక్? గడ్డపైకి వెళ్లి ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులను తుదముట్టించాం. ప్రధాని మోదీ ఈ దేశాన్ని ఉగ్రవాదం నుంచి విముక్తి చేశారు.ప్రధాని మోదీ ఈ దేశాన్ని నక్సలిజం నుంచి విముక్తం చేశారు. ఇప్పుడు బంగాల్‌లో బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురండి. మేము చొరబాటుదారులను ఒక్కొక్కరిగా ఏరిపారేస్తాం. చొరబాటుదారుల పేర్లను ఎందుకు తొలగిస్తున్నారని దీదీ అడుగుతున్నారు దీదీ మీ సమయం ముగిసింది. మే 4వ తేదీన బీజేపీ ప్రభుత్వం రానుంది. బీజేపీ ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత, మేము ఓటర్ల జాబితా నుంచి చొరబాడుదారులను తొలగించడమే కాకుండా, బంగాల్ గడ్డ నుంచి వారిని ఏరిపారేస్తాం. నాడియా జిల్లాలోని టెహట్టాలో జరిగిన బహిరంగ సభలో అమిత్ షా, మమతా బెనర్జీ సర్కార్‌పై విమర్శల జల్లు కురిపించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశలోనే ఓటర్లు మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని తుడిచిపెట్టేశారని వ్యాఖ్యానించారు. ఏప్రిల్? 23న జరిగిన మొదటి దశ ఎన్నికల్లోనే బీజేపీ 110 సీట్లను గెలుచుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.బంగాల్ బాధ్యతలు బీజేపీ చేపడితే ఇక్కడ కొనసాగుతున్న గూండా రాజ్యం, సిండికేట్‌రాజ్‌లకు ముగింపు లభిస్తుంది. ఓటు వేసేందుకు బయటకు రావడానికి ఎవరూ భయపడకండి. ఎన్నికల సంఘం తగిన ఏర్పాట్లు చేసింది. మిమ్మల్ని ఓటు వేయకుండా ఆపడం ఎవరి వల్లా కాదు' అని అమిత్ షా ఓటర్లకు పిలుపునిచ్చారు. అయితే ఈ సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరైనప్పటికీ, అకస్మాత్తుగా భారీ వర్షం కురవడంతో, అమిత్ షా తన ప్రసంగాన్ని మధ్యలోనే ముగించాల్సి వచ్చింది.సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరైనప్పటికీ, అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షం కారణంగా ఈ సీనియర్ బీజేపీ నేత తన ప్రసంగాన్ని మధ్యలోనే ముగించాల్సి వచ్చిందిఅంతకు ముందు, అంటే శనివారం టోలీగంజ్‌లో అమిత్ షా భారీ రోడ్ షో నిర్వహించారు. ఆ సందర్భంగా బంగాల్ ఎన్నికల సమయంలో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడానికి ప్రయత్నిస్తే, టీఎంసీ గూండాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అమిత్ షా హెచ్చరించారు. "నేను ఇప్పుడు గూండాలకు హెచ్చరిస్తున్నా. ఏప్రిల్ 29న మీ ఇళ్ల నుంచి బయటకు రావద్దు. లేకపోతే మే 5వ తేదీ తర్వాత మీపై కనికరం ఉండదు. ఏప్రిల్ 29న ఉదయం 7 గంటలకు తల్లులు, సోదరీమణులు, యువకులు అందరూ పోలింగ్ బూత్?లకు చేరుకుని కమలం గుర్తుపై బటన్ నొక్కాలని నేను కోరుతున్నాను" అని అన్నారు.కాగా, ఎన్నికల కమిషన్ గణాంకాల ప్రకారం, గురువారం ముగిసిన మొదటి దశ బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధికంగా 91.78 శాతం ఓటింగ్ నమోదైంది.


### మూసీని దుర్గంధం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే


రూ.3.70 లక్షల కోట్లు అప్పు చేశానని రేవంత్‌రెడ్డి అంగీకరించారు. ఢిల్లీకి మూటలు మోయటం తప్ప.. ఆయన చేసిందేమీ లేదు" అని కేటీఆర్ ఆరోపించారు.

### మూడేళ్ల నిరీక్షణకు తెర

ఎమ్మెల్సీలపై వివాదం కొనసాగుతోంది. అయితే ఈ నెల 30లోగా ఎమ్మెల్సీ కాకపోతే అజారుద్దీన్ మంత్రి పదవి కోల్పోయేవారు.

## ట్రంప్,మంత్రులే లక్ష్యంగా వైట్‌హౌస్‌లో కాల్పులు





గది సమీపంలో భద్రతా పెద్దగా ఏర్పాట్లు లేవని పేర్కొంది. నిందితుడు కోల్ టామోస్ అలెన్ అదే గదిలో ఉన్నట్లు వెల్లడిం చింది. అలెన్ ఓ బ్యాగ్‌ను తీసి పొడవైన గన్‌ను బయ టకు లాగినట్లు మబుస్ వెల్లడించింది. ఆ తర్వాత అత డు హఠాత్తుగా డిన్నర్ జరుగుతున్న బాల్‌రూమ్ వైపు గన్‌ను తీసుకొని పరిగెత్తాడని వెల్లడించింది. ఈ క్రమం లో అన్ని దిశల్లో ఇష్టం వచ్చినట్లు కాల్పులు జరిపాడని పేర్కొంది. సుమారు 10 రౌండ్ల వరకు కాల్చినట్లు తెలిపింది. ఈ క్రమంలో సీక్రెట్ సర్వీస్ .. ఇతర భద్రతా దళాలు అతడిని పట్టుకొనేందుకు పరుగులు పెట్టారు. తాను పూర్తిగా వ్యతిరేక దిశలో పారిపోయినట్లు హెలెన్ మబుస్ వెల్లడించారు. తాను ట్రంప్ కార్యవర్గంలోని నిందితులను లక్ష్యంగా చేసుకొన్నట్లు నిందితుడు అలెన్ అధికారుల వద్ద ఇప్పటికే అంగీకరించినట్లు అమెరికా మీడియా వెల్లడించింది. తాను పాల్గొన్న కార్యక్రమంలో కాల్పులకు.. ఇరాన్ యుద్ధంతో సంబంధం ఉందని తాను భావించడంలేదని.. కానీ, ఏదీ చెప్పడానికి వీల్లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఓ విలేకరి ఆయన్ను అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ విషయాన్ని వెల్లడించారు. తాను ఇరాన్ యుద్ధంలో విజయం సాధించకుండా ఏదీ భయపెట్టలేదని స్పష్టం చేశారు.

**దుండగుడి లక్ష్యం వాళ్లే!**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాల్గొన్న కార్యక్రమంలో ఓ దుండగుడు కాల్పులు జరపడం తీవ్ర ఆందోళనకు గురిచేసిన విషయం తెలిసిందే. అయితే, బాల్‌రూమ్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించిన ఆ దుండగుడు.. అధ్యక్షుడు ట్రంప్ సహా అధికారులను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోందని తాత్కాలిక అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచే వెల్లడించారు.నిందితుడు కాలిఫోర్నియా నుంచి రైలులో తొలుత షికాగో, అక్కడి నుంచి వాషింగ్టన్‌కు వచ్చినట్లు అధికారులు భావిస్తున్నారు. అనంతరం శనివారం రాత్రి వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ డిన్నర్ కార్యక్రమం జరిగే హిల్టన్ హోటల్‌లో బస చేసినట్లు నిర్ధరించారు. కార్యక్రమం మొదలైన కొద్దిసేపటికే ఆ ప్రాంగణంలో కాల్పుల మోత వినిపించింది. నిందితుడు బారికేడ్లను దాటుకొని బాల్‌రూమ్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే కాల్పులు చోటుచేసుకున్నాయి. నిందితుడిని అదుపులోకి తీసుకున్న అధికారులు.. అతడిని లాస్‌ఏంజెలెస్‌లోని టోరెన్స్ ప్రాంతానికి చెందిన కోల్ టామోస్ అలెన్ (31)గా గుర్తించారు.నిందితుడి వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలు, అతడి చేతి రాతలను పరిశీలించిన అధికారులు.. ఆ విందులో పాల్గొన్న అధికారులను లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరిపినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు టాడ్ బ్లాంచే వెల్లడించారు. అధ్యక్షుడినీ లక్ష్యంగా చేసుకున్నట్లు కనిపిస్తోందన్నారు. అతడి వద్ద ఉన్న ఆయుధాలను గడిచిన రెండేళ్ల వ్యవధిలో కొనుగోలు చేసి ఉంటాడని భావిస్తున్నామన్నారు. అయితే, ఎందుకు ఈ కాల్పులకు పాల్పడ్డాడనే విషయంపై స్పష్టత లేదని, దర్యాప్తునకు నిందితుడి సహకరించడం లేదన్నారు. మరిన్ని అభియోగాలు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు అటార్నీ జనరల్ పేర్కొన్నారు.

**కాల్పులు జరిగినా కార్యక్రమం కొనసాగించాలని పట్టుబట్టిన ట్రంప్**

తన అధ్యక్షపదవి ప్రమాదాలతో కూడుకున్నదన్న విషయం స్పష్టంగా తెలుసని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. తాను భయపడుతూ బతికే రకం కాదని ఆయన వెల్లడించారు. మార్కో రూబియో, పీట్ హెగ్సెత్‌లు తనకు ఈ పదవిలో ఉన్న ముప్పులగురించి ముందే చెప్పారన్నారు. శ్వేతసౌధం కరస్పాండెంట్ల కోసం వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన డిన్నర్‌లో ఓ దుండగుడు కాల్పులకు పాల్పడిన అనంతరం ట్రంప్ మాట్లాడారు. ఈ ఘటనలో ఓ సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ గాయపడ్డారని చెప్పారు. వాస్తవానికి కాల్పుల ఘటన అనంతరం తాను హోటల్‌లోనే ఉండి డిన్నర్‌ను కొనసాగిస్తానని ట్రంప్ పట్టుబట్టారు. అందుకు తాను భీకరంగా పోరాడినట్లు అభివర్ణించారు. కానీ, సీక్రెట్ సర్వీస్ బృందాలు ఆ ప్రదేశాన్ని వదిలి వెళ్లిపోవాలని ఆయనకు నచ్చజెప్పాయి.వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో జరిగిన కాల్పులపై ట్రంప్ శ్వేతసౌధంలో మాట్లాడారు. దుండగుడు అనేక ఆయుధాలతో సెక్యూరిటీ చెక్‌పాయింట్‌పైకి దూసుకొచ్చినట్లు తెలిపారు. ఈ కాల్పులు ఘటన వైట్‌హౌస్ బాల్‌రూమ్ ఆవశ్యకతను తెలియజేస్తోందన్నారు. తమకు మునుపెన్నడు లేనటువంటి అసాధారణ భద్రత కావాల్సిన అవసరం ఉందన్నారు. తనపై దాడి ఇది తొలిసారి మాత్రమే కాదన్నారు. మరో 30 రోజుల్లో ఈ డిన్నర్‌మీట్‌ను రీషెడ్యూల్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

అసలేం జరిగింది..

డిన్నర్ వద్ద సీక్రెట్ సర్వీసెస్ బృందం ఏర్పాటు చేసిన సెక్యూరిటీ చెకింగ్ పాయింట్ వద్ద ఓ దుండగుడు షాట్ గన్, పలు కత్తులతో ప్రవేశించేందుకు యత్నించాడు. ఈ సమయంలో కాల్పులు చోటు చేసుకొన్నాయి. ఈ ఘటనలో దుండగుడిని బలగాలు అదుపులోకి తీసుకొన్నాయి.

### ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదు

వారు మరింత సురక్షితంగా ఉండాలని ఆయన ఆకాంక్షిచారు. మరోవైపు పలు ప్రపంచ నేతలు కూడా ఈ దాడిపై తమ స్పందన తెలియజేశారు. హింస దేనికీ మార్గం కాదు. అధ్యక్షుడు ట్రంప్, ఆయన సతీమణి మెలానియా సురక్షితంగా ఉండటంతో సంతోషకరం- మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, మెలానియాపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. శాంతివిలువలను సమర్థించే ప్రజలకు.. హింస ఎప్పటికీ మార్గం కాదు- వెనెజువెలా అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ ఈ దాడి నన్ను దిగ్భ్రాంతికి గురి చేసింది. ట్రంప్ సహా అందరూ సురక్షితంగా ఉన్నట్లు తెలుసుకొని ఊపిరిపీల్చుకొన్నాం.

ఓ సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ గాయపడినట్లు వాషింగ్టన్‌డీసీ పోలీస్ కమిషనర్ జెఫ్రీ డబ్ల్యూ కారోల్ వెల్లడించారు. నిందితుడిని 31 ఏళ్ల కోల్ టామోస్ అలెన్ అనే టీచర్‌గా గుర్తించారు. అతడు కాలిఫోర్నియాలోని టోరెన్స్ ప్రాంతానికి చెందినవాడు. ఇప్పటికే లాఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెంట్స్ అతడి అపార్ట్‌మెంట్‌ను కూడా తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. నిందితుడు వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో గెస్ట్ అని పోలీస్ కమిషనర్ జెఫ్రీ డబ్ల్యూ కారోల్ వెల్లడించారు.

మాటల తూటాలు పేలుతాయన్న కరోలిన్.. చివరకు నిజంగానే! వాషింగ్టన్‌లోని హిల్టన్ హోటల్‌లో నిర్వహించిన వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ డిన్నర్ కార్యక్రమంలో కాల్పులు కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు కొన్ని గంటల ముందు ఓ మీడియా సంస్థతో వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ మాట్లాడుతూ చేసిన సరదా వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. అధ్యక్షుడు ట్రంప్ చేసే ప్రసంగాన్ని ఉద్దేశిస్తూ.. ఈ రాత్రి కొన్ని తూటాలు పేలనున్నాయంటూ వ్యాఖ్యానించారు. చివరకు నిజంగానే అక్కడ కాల్పులు జరగడంతో ఆమె వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి."ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రానున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తనదైన శైలిలో ప్రసంగిస్తారు. చాలా ఫన్నీగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. సమావేశ మందిరంలో మాటల తూటాలు పేలుతాయి. చూస్తూనే ఉండండి. నేనూ ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా" అని కరోలిన్ లీవిట్ పేర్కొన్నారు. పదునైన రాజకీయ పదజాలంతో ట్రంప్ ప్రసంగం ఉంటుందనే ఉద్దేశంతో ఆమె ఇలా సరదాగా చెప్పారు. కానీ, కొన్ని గంటల్లోనే ఆ ప్రాంగణంలోకి ప్రవేశించిన ఓ సాయుధ దుండగడు కాల్పులు జరిపి హంగామా సృష్టించడం గమనార్హం.

### నిందితుడు ఉన్నత విద్యావంతుడు

లింక్డ్ఇన్ ప్రొఫైల్ ప్రకారం కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి 2017లో మెకానికల్ ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తి చేశాడు.2017లో కాల్టెక్‌లో అతడు విద్యార్థిగా ఉన్నప్పుడే వీల్‌ఛైర్స్‌కు ఎమర్జెన్సీ బ్రేక్‌ను ప్రయోగాత్మకంగా రూపొందించాడు. ఈ అంశం గురించి స్థానిక పత్రికలో కథనం కూడా వెలువడింది. ఆ తర్వాత కాలిఫోర్నియా స్టేట్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ పూర్తిశాడు. 2018లో ఓ వీడియోగేమ్‌ను కూడా తయారు చేసి ట్రేడ్‌మార్క్ కోసం రిజిస్టర్ చేసుకొన్నాడు. ఇటీవల 'ఫస్టలా' పేరిట మరో గేమ్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు లింక్డిఇన్‌లో వెల్లడించాడు. 2014లో జెట్ ప్రొపెల్షన్ ల్యాబ్‌లో నాసా నిర్వహించిన ఫెలోషిప్ ప్రోగ్రామ్‌లో కూడా పాల్గొన్నాడు. ప్రస్తుతం టెస్ట్ ప్రిపరేషన్ ట్యూటరింగ్ కంపెనీ సీ2 ఎడ్యూకేషన్‌లో టీచర్‌గా పనిచేస్తున్నట్లు ప్రొఫైల్‌లో ఉంది. డిసెంబర్ 2024లో టీచర్ ఆఫ్ ది మంత్‌గా కూడా ఎంపికయ్యాడు. ఇక రాజకీయ నేపథ్యం చూస్తే.. డెమోక్రటిక్ పార్టీకి సానుభూతిపరుడిగా తెలుస్తోంది.

**హిల్టన్ హోటల్‌లోనే కేఏ పాల్:** శ్వేతసౌధం కరస్పాండెంట్ల కోసం వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో ట్రంప్ ఏర్పాటు చేసిన డిన్నర్‌లో ఓ దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. ఈ దాడి జరిగిన సమయంలో తాను అదే హోటల్‌లో ఉన్నట్లు ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ వెల్లడించారు. ఈ మేరకు ఆ హోటల్ నుంచి వీడియో విడుదల చేశారు. తాను ఎప్పుడు అమెరికాకు వెళ్లినా హిల్టన్‌లోనే బస చేస్తానని అన్నారు. కట్టుదిట్టమైన భద్రత ఉండే ఆ హోటల్‌లో జరుగుతున్న అధ్యక్షుడి కార్యక్రమంలో కాల్పులు చోటుచేసుకోవడం భద్రతా వైఫల్యమేనన్నారు. ప్రపంచంలో యుద్ధాలు ఎక్కువవ్వడం వల్ల శాంతి కరవైందని పేర్కొన్నారు.

## బెంగాల్ ప్రజలు ఉగ్రవాదులా?'

- ఎన్నికల వేళ భారీగా కేంద్ర బలగాల మోహరింపుపై కేజ్రీవాల్ ఫైర్
- ఎన్నికల సమయంలో కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేశారు
- మమతపై దర్యాప్తు సంస్థల నుంచి రాజకీయ ఒత్తిడి ఉందని విమర్శ

కోల్‌కతా(జనంసాక్షి):బంగాల్‌లో ఎన్నికల వేళ భారీగా కేంద్ర బలగాలను మోహరించడాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రశ్నించారు. ఇది రాష్ట్ర ప్రజలను అవమానించడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల సమయంలో కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేశారని అరవింద్ కేజ్రీవాల్? ఆరోపించారు. బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి రాజకీయ ఒత్తిడి ఉందని ఆరోపించారు. బల్లిగంజ్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న టీఎంసీ నాయకుడు శోభన్‌దేబ్ చటోపాధ్యాయకు మద్దతుగా ప్రచారం చేస్తూ ఈ మేరకు వ్యాఖ్యానించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తనను ఒక అబద్ధపు కేసులో ఇరికించిందని చెప్పారు. అలాగే ఓటర్ల జాబితాలలో అవకతవకలు జరిగాయని కూడా ఆయన ఆరోపించారు."దేశం నలుమూలల నుంచి సైన్యాన్ని ఇక్కడికి పిలిపించారు. దీని అవసరం ఏమిటి? బంగాల్ ప్రజలు ఉగ్రవాదులా? ఇది బంగాల్ ప్రజలను అవమానించడమే. బంగాల్‌లో 3.5 లక్షల మంది సైనిక సిబ్బందిని మోహరించారు. వాళ్లు దేనికి భయపడుతున్నారు? ఏడాది క్రితం వారు నన్ను ఒక తప్పుడు కేసులో జైలులో పెట్టారు. ఇటీవలె దీనిపై తీర్పు వచ్చింది. కేజ్రీవాల్‌పై ఉన్న ఆరోపణలన్నీ అవాస్తవమని కోర్టు చెప్పింది. కేజ్రీవాల్ నిర్దోషి, పూర్తిగా నిజాయితీపరుడు అని పేర్కొంది. ఓటర్ల జాబితాలో వారు నకిలీ ఓటర్లను సృష్టించారు. అన్ని రాష్ట్రాల నుంచి వేలాది మంది నకిలీ ఓటర్లను ఇక్కడ బంగాల్‌లో ఓటు వేయించడానికి తీసుకువస్తున్నారు. మోదీ ఇలా ఎన్నికల్లో గెలవాలనుకుంటున్నారు. ప్రధాని మోదీకి ముగ్గురు స్నేహితులు ఉన్నారు. ఈడీ, సీబీఐ, జ్ఞానేష్ కుమార్. ప్రతి ఒక్కరూ ఆమె వెంట పడుతున్నారు. ఈడీ, సీబీఐ, కేంద్ర బలగాలు, మోదీ, బీజేపీ ముఖ్యమంత్రులు ఇంటింటికీ తిరుగుతున్నారు. ప్రతి ఒక్కరూ ఒకే మహిళ వెంట పడుతున్నారు. అయినా ఆమె గెలుస్తుంది. కాళీమాత ఆశీస్సులు ఉండటం వల్లే ఆమె గెలుస్తుంది. మేము ఆమెతో ఉన్నాము." అని అన్నారు.

## పూర్తిగా స్వదేశీ టెక్నాలజీతో న్యూక్లియర్ రియాక్టర్

నేరుగా వీక్షించే గొప్ప అవకాశం తనకు లభించిందని మోదీ తెలిపారు. భారతదేశ పౌర అణు ఇంధన కార్యక్రమం సాధిస్తున్న విజయాల కారణంగా దేశ పారిశ్రామిక, ఇంధన, ఆరోగ్య రంగాల వికాసానికి ఊతం లభిస్తోందని పేర్కొన్నారు. దీనివల్ల రైతులు, ఆధునిక ఆవిష్కర్తలకూ చేదోడు లభిస్తోందన్నారు. భారతదేశ వికాసంతో సైన్సుకు బలమైన సంబంధం ఉందని మోదీ చెప్పారు. ఈ విజన్‌తోనే భారత శాస్త్రవేత్తలు అంతరిక్ష కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. వారి చొరవల ఫలితంగా అంతరిక్ష కార్యక్రమం సైతం భారతదేశ నిర్మాణానికి గణనీయంగా దోహదపడుతోందని తెలిపారు.

పవన విద్యుత్ రంగంలో ప్రధాన మైలురాయి

పవన విద్యుత్ అనేది భారతదేశ అభివృద్ధి ప్రస్థానంలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కంటికి కనిపించని ఈ పవన శక్తే భారత్‌ను మున్ముందుకు నడిపిస్తోందని తెలిపారు. పవన విద్యుత్ రంగంలో భారత్ ఇటీవలే ఒక ప్రధాన మైలురాయిని సాధించిందని, దేశ పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 56 గిగావాట్లు దాటిందన్నారు. కేవలం గత ఏడాది వ్యవధిలోనే దేశ పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం మరో 6 గిగావాట్లు పెరిగిందని మోదీ చెప్పారు. పర్యావరణ పరిరక్షణ కోసమే కాకుండా, భారత వికాసం, భవిష్యత్తు అవసరాల కోసం సౌర, పవన విద్యుత్‌లు చాలా అవసరమన్నారు. వాటిని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరు కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు.

జనగణనలో ప్రతీ పౌరుడు పాల్గొనాలి

"ప్రస్తుతం దేశంలో జరుగుతున్న జన గణన-2027 అనేది కేవలం ప్రభుత్వం పని కాదు. అది దేశ పౌరులందరి బాధ్యత. అందరూ చొరవ చూపి ఇందులో భాగస్వాములు కావాలి. జనగణనలో ప్రజలు అందించే సమాచారాన్ని చాలా సురక్షితంగా, విశ్వసనీయంగా దాచి పెడతారు. అందరూ పాల్గొని జనగణనను విజయవంతం చేయాలి. భారత్‌లో జరుగుతున్న జనగణన కార్యక్రమం ప్రపంచంలోనే అతిపెద్దది. పూర్తిగా డిజిటల్‌గానే దేశ ప్రజల సమాచారాన్ని ఎన్యుమరేటర్లు నమోదు చేస్తారు. ప్రజలు అందించే సమాచారాన్ని ఎన్యుమరేటర్లు అక్కడికక్కడే ప్రత్యేక మొబైల్ యాప్‌లో నిక్షిప్తం చేస్తారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు కూడా ఈసారి అవకాశాన్ని ఇచ్చారు. ప్రజలు తమకు తామే వివరాలను సెన్సస్ పోర్టల్‌లో నమోదు చేయొచ్చు. క్షేత్రస్థాయి ఎన్యుమరేషన్ మొదలుకావడానికి ముందు, 15 రోజుల పాటు ప్రజలు సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవచ్చు. ఈ ప్రక్రియను పూర్తి చేసే వారికి మొబైల్ లేదా ఈమెయిల్ ద్వారా ఒక ప్రత్యేక ఐడీని పంపిస్తారు. ఇళ్లకు ఎన్యుమరేటర్లు వచ్చినప్పుడు, ఈ ఐడీని చూపిస్తే సరిపోతుంది. దీనివల్ల సమయం ఆదా అవుతుంది. ఇప్పటివరకు పలు రాష్ట్రాల్లో 1.2 కోట్ల కుటుంబాలు గృహ గణనకు సమాచారాన్ని అందించాయి" అని ప్రధాని మోదీ తెలిపారు.

ఒక వెదురు ఉత్పత్తిని కొనండి

"భారతదేశంలో వెదురు రంగంలో ఎంతోమంది పనిచేస్తున్నారు. కళాత్మక వెదురు ఉత్పత్తుల తయారీకి వాళ్లంతా శ్రమిస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ఈ రంగంపై ఎక్కువగా ఆధారపడ్డారు. వారిని ప్రోత్సహించేందుకు మీరంతా కనీసం ఒక వెదురు ఉత్పత్తిని కొనండి. దీన్ని మీరు ఎవరికైనా గిఫ్టుగా ఇచ్చుకోవచ్చు. వెదురు ఉత్పత్తుల సేల్స్ పెరిగితే ఈ రంగంలో పనిచేస్తున్న వారి ఆత్మస్థైర్యం పెరుగుతుంది" అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

బ్రెజిల్ జున్ను పోటీల్లో భారత్ విజయాలు భేష్

బ్రెజిల్‌లో జరిగిన అంతర్జాతీయ జున్ను పోటీల్లో రెండు భారతీయ బ్రాండ్‌లు విజయాలను సాధించడాన్ని ప్రధాని మోదీ కొనియాడారు. ఈ విజయం భారతదేశ డైరీ రంగానికి చాలా ముఖ్యమైందని చెప్పారు. ఇప్పుడు భారతదేశ రుచి యావత్ ప్రపంచంలోని ప్లేట్లలోకి చేరుతోందన్నారు. భారతదేశ సంప్రదాయ జున్ను ఫ్లేవర్లు ప్రస్తుతం కొత్తరూపుతో ప్రపంచం మొత్తం వ్యాపిస్తున్నాయని ఆయన తెలిపారు.

చిలీలో భారతీయుడి బౌద్ధ ప్రచారం

"త్వరలోనే జరగనున్న బుద్ధ పూర్ణిమ సందర్భంగా దేశ ప్రజలకు నేను ముందస్తు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మే నెల ఈ శుభప్రదమైన పండుగతోనే ప్రారంభమవుతోంది. గౌతమ బుద్ధుడి బోధనలు ఏ కాల పరిస్థితుల్లోనైనా మానవ జీవితాలకు వర్తిస్తాయి. ఒత్తిడులు, పోరాటాలు, సవాళ్లతో కూడిన ఈ కాలంలో బుద్ధుడి సందేశం మానవత్వానికి సరైన దిశను చూపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో బుద్ధుడి బోధనలు అందరికీ ఎంతో ముఖ్యమైనవిగా మారాయి. శాంతి అనేది మనతోనే ఆరంభం అవుతుందని బుద్ధుడు చెప్పారు. మనిషి తనపై తాను గెలవడమే గొప్ప విజయమని ఆయన బోధించారు. భారత్‌లోని లడఖ్‌లో జన్మించిన ద్రుబ్‌పోన్ ఓట్జెర్ రిన్‌పోచె ఇప్పుడు చిలీ దేశంలో బుద్ధుడి బోధనలను వ్యాప్తి చేస్తున్నారు. ఓట్జెర్ చొరవతో చిలీలోని కోచిగువాజ్ లోయలో బౌద్ధ స్థూపాన్ని నిర్మించారు. అక్కడ ప్రజలకు మెడిటేషన్‌ను నేర్పిస్తున్నారు. కర్ణాటకలోని 100కుపైగా ఎకరాల్లోని అడవుల్లో కర్మ అనే బౌద్ధ ఆశ్రమం ఉంది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## ప్రజాసమస్యలు సత్వరం పరిష్కరించండి

జిల్లా కేంద్రానికి వచ్చే బదులు ప్రజావాణి సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో అధికారులను ఆదేశించారు. వెంటనే రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి ప్రారంభించాలని స్పష్టం చేశారు. తరువాత దశలో మండల స్థాయికి ప్రజావాణిని విస్తరించాలని సూచించారు. ప్రజా వాణిలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని స్థాయిల్లో అధికారులకు పూర్తి అధికారాలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజలు ఇచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేయాలని, సంబంధిత విభాగాలకు పంపించాలని, పరిష్కార పురోగతిని అర్జీదారునికి తెలియజేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువులు ఉండాలని, ఆలస్యం జరగకూడదని చెప్పారు. ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం అభివృద్ధి చేయాలని ఆదేశించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రియల్ టైమ్ మానిటరింగ్ ఉండాలని సూచించారు. ప్రతి స్థాయిలో ప్రజావాణికి ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలోనూ, ప్రతి శాఖలో ప్రత్యేక ప్రజావాణి విభాగాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఒకస్థాయిలో పరిష్కారం కాకపోతే, పైస్థాయి అధికారికి అర్జీ అందేలా ఆటో ఎస్కలేషన్ వ్యవస్థను అమలు చేయాలని చెప్పారు. అవసరమైతే అప్పీల్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. డ్యాష్‌బోర్డ్ ద్వారా పరిష్కార పురోగతి తెలుసుకునే వీలుండాలని, ఎక్కడైనా ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులను బాధ్యులను చేయాలన్నారు. ప్రజా వాణి సేవలను వికేంద్రీకరించటంతో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో పెండింగ్ అర్జీల సంఖ్య తగ్గుతుందని, కింది స్థాయిలోనే కొన్ని పరిష్కరించే వీలుంటుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు నమ్మకంగా ఉండేలా ప్రజావాణి సేవలు అందించాలని సూచించారు.ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు, సత్వర పరిష్కారానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజావాణి అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అనతి కాలంలోనే దీనికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. తమ సమస్యలను పరిష్కరించాలని సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు తరలి వచ్చి, అధికారులకు తమ సమస్యలను విన్నవించుకుంటుంటారు. ప్రజావాణి పనితీరుపై ప్రతి మూడు నెలలకు ప్రజావాణి పనితీరుపై ప్రతి మూడు నెలలకుఒకసారి ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కొద్ది రోజుల క్రితం తెలిపారు. ఫిర్యాదుదారు తన సమస్య పరిష్కారం ఎంతవరకు వచ్చిందనే విషయాన్ని తెలుసుకునేందుకు ఏ రకమైన వ్యవస్థ ప్రజావాణిలో ఉన్నదనే అంశంపై ఆయన ఆరా తీశారు. ప్రజావాణి సేవలను మరింత విస్తృతం చేసేందుకు చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించడం శుభపరిణామం.

## వివరాలు చెబితే పథకాలు రావనే అపోహ వద్దు

తన వివరాలు నమోదు చేసి, అధికారికంగా మొదలుపెట్టారు. రాష్ట్రం ఏర్పడ్డాక మొదటి జనగణన కావడం వల్ల ప్రాముఖ్యతను సంతరించుకుందని గవర్నర్ అన్నారు. రాష్ట్ర పురోగతికి కచ్చితమైన సమాచార సేకరణ చాలా కీలకమన్నారు. ఇది భారతదేశపు మొట్టమొదటి పూర్తి డిజిటల్ జనాభా గణన అవుతుందని గవర్నర్ శివప్రతాప్ శుక్లా చెప్పారు.స్వీయ ధ్రువీకరణలో రాష్ట్ర ప్రజలందరూ భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్ వివరాలను అధికారులు సీఎంకు వివరించగా, ఆన్?లైన్ పోర్టల్ ద్వారా కుటుంబ వివరాలు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జనగణన డైరెక్టర్ భారతి హోళికెరి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, జాయింట్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ ప్రియాంక, ఐ అండ్ పీఆర్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జనగణన ప్రజల లెక్కలే కాదు, దేశానికి సంబంధించిన భవిష్యత్ ప్రణాళికల కోసం దోహదం చేస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 2027లో జనగణనలో మొదటిసారి కులగణన జరుగుతుందన్న ఆయన, అందరూ పాల్గొనాలని సూచించారు. వివరాలు చెబితే సంక్షేమ పథకాలు తొలగిస్తారనే భయం వద్దని సూచించారు. స్వీయ ధ్రువీకరణలో ప్రజలందరూ పాల్గొనాలని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. అధికారుల సమక్షంలో సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకున్న ఛైర్మన్, వారి కుటుంబ వివరాలు అందించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ జనగణనలో పాల్గొనాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తెలిపారు. జనగణనలో భాగంగా హైదరాబాద్ రామ్‌నగర్‌లోని ఆయన నివాసానికి వచ్చిన జనగణన సిబ్బందికి తమ పూర్తి వివరాలను అందించారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్‌లో ప్రజలందరూ పాల్గొనాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. జీహెచ్?ఎంసీ అధికారుల సమక్షంలో స్వీయ ధ్రువీకరణ చేసుకున్న మంత్రి, అపోహలకు పోకుండా జనగణనలో అందరూ పాల్గొనాలని కోరారు. "దేశవ్యాప్తంగా జాతీయ జనగణన ప్రారంభమైంది. ఈ కార్యక్రమం తెలంగాణలో ప్రారంభమవుతున్న సందర్భంగా రాష్ట్రంలోని ప్రతి పౌరుడు సెల్ఫ్? ఎమ్యునరేషన్ చేయడం ద్వారా తమ కుటుంబ వివరాలను దేశ జనాభా లెక్కల్లో చూపించాలని కోరుతున్నాం. జనగణనలో తెలంగాణను దేశంలోనే పారదర్శకంగా నిర్వహించిన రాష్ట్రంగా నిలిచేలా ప్రతి పౌరుడూ దీనిని చేయాలని కోరుతున్నాను" అని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

స్వీయ గణన నమోదుపై అవగాహన

కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జనగణన-2027లో కులగణన చేపడుతున్నా, అందులో బీసీల సంఖ్యను గుర్తించే అవకాశం లేదని, అందుకు మరో కాలమ్‌ను చేర్చాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ కాలమ్ తర్వాత బీసీల కోసం 34వ కాలమ్ చేర్చాలని పేర్కొన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహబూబ్‌నగర్‌లో "హ్యాపీ సండే" కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. జనాభా గణన కార్యక్రమాన్ని ప్రారంభించారు. యాప్ ద్వారా గణన వివరాలను నమోదు చేశారు. ప్రజలు స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే సౌకర్యం కల్పించడం ద్వారా పారదర్శకత ఉంటుందని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి తెలిపారు. తాను కూడా జనగణన పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు. స్వీయ గణనలో ప్రతి ఒక్కరు పాల్గొనేలా అవగాహన కల్పించాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి యువతకు పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి స్వీయ గణన నమోదుపై అవగాహన వీడియోను కలెక్టర్ ప్రదర్శించారు.

## మీ టైం పూర్తయ్యింది.. మా టైం మొదలైంది

**'ఎక్స్'లో టీఆర్ఎస్ అధినేత్రి కవిత ఆసక్తికర పోస్టు**

హైదరాబాద్(జనంసాక్షి): పార్టీ ఆవిర్భావం తర్వాత టీఆర్ఎస్ అధినేత్రి కవిత 'ఎక్స్'లో ఆసక్తికర పోస్టు చేశారు. 'మీ టైం పూర్తయ్యింది.. మా టైం మొదలైంది.. టీఆర్ఎస్' అంటూ పోస్టు పెట్టారు. శనివారం మునీరాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన సభలో తన పార్టీ పేరును తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)గా కవిత ప్రకటించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్, బీఆర్ఎస్ లక్ష్యంగా కవిత విమర్శలు గుప్పించారు.

## రష్యాలో కీలక ఎరువుల ప్లాంట్‌పై ఉక్రెయిన్ దాడి

బీజింగ్(జనంసాక్షి):వాయవ్య రష్యాలో కీలకమైన ఎరువుల ప్లాంట్ 'ఫోస్ అగ్రో'పై ఉక్రెయిన్ డ్రోన్‌తో దాడి చేసింది. ఏప్రిల్ నెలలో ఈ ప్లాంట్‌పై జరిగిన రెండో దాడి ఇది. రష్యా కీలక ఎగుమతి కేంద్రాలపై ఇటీవల కాలంలో ఉక్రెయిన్ దాడులు తీవ్రమయ్యాయి. ఈ ప్లాంట్‌లోని సల్ఫ్యూరిక్ యాసిడ్ పంప్ చేసే హై ప్రెజర్ పైప్‌లైన్లను ఈ డ్రోన్లు ధ్వంసం చేశాయి. ఈ విషయాన్ని వోలోగ్డా గవర్నర్ జార్జి ఫిలిమోనోవ్ ధ్రువీకరించారు. కాకపోతే ఎటువంటి మంటలు లేదా లీకేజీకి ఈ దాడి కారణం కాలేదని వెల్లడించారు. పైప్‌లైన్‌కు వెంటనే మరమ్మతులు నిర్వహించినట్లు తెలిపారు. దీంతో ప్రమాదకర గ్యాస్‌లు కూడా ఏమీ లీక్ కాలేదని చెప్పారు. 'ఫోస్ అగ్రో' ప్రతినిధి మాత్రం ఈ దాడిపై స్పందించేందుకు నిరాకరించారు. ప్రస్తుతం ఇరాన్ యుద్ధం తీవ్ర స్థాయిలో ఉండటంతో నైట్రోజన్ ఫర్టిలైజర్స్ ధరలు గణనీయంగా పెరిగాయి. దీంతోపాటు రష్యా, చైనా దేశాలు వీటి ఎగుమతులపై ఆంక్షలు విధించాయి. రష్యా నుంచి ఫాస్ఫరస్ ఆధారిత ఎరువులను భారత్‌కు ఎగుమతి చేసే కంపెనీల్లో ఇది కూడా ఉంది.



# హాజరు కోసం చెట్టెక్కాల్సిందే

## ఉపాధి హామీ కూలీలకు వింత కష్టాలు

**తాండూర్, ఏప్రిల్ 26( జనం సాక్షి) :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం తాండూర్ పంచాయతీ పరిధిలోని మల్లన్న గుట్ట వద్ద ఉపాధి హామీ కూలీలకు వింత కష్టాలు వచ్చి పడ్డాయి. ముఖ గుర్తింపు (ఫేషియల్ అటెండెన్స్) కోసం సిగ్నల్ అందక కూలీలు చెట్లు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. నెట్వర్క్ సమస్యతో హాజరు నమోదు కావడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్ రాజేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో కూలీల పొట్ట కొట్టకుండా, ఉన్నతాధికారులు నెట్వర్క్ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

# తెలంగాణ అంటేనే కేసీఆర్.. కేసీఆర్ అంటేనే తెలంగాణ

- క్యాతనపల్లి అభివృద్ధికి మంత్రి సహకరించాలి
- బెదిరింపులు అక్రమ కేసులు మానాలి
- ఆర్కేపి పిఎస్‌లో సంతకానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్



**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 26(జనంసాక్షి):** తెలంగాణ అంటేనే కేసీఆర్, కేసీఆర్ అంటేనే తెలంగాణ అనే పదం రాష్ట్ర ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయిందని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎన్నిక నేపథ్యంలో అరెస్టై షరతులతో కూడిన బెయిల్ లో భాగంగా ఆర్కెపి పోలీస్ స్టేషన్ లో ఆదివారం హాజరై సంతకం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజాపాలన అంటూ గొప్పలు చెప్పుకోవడం తప్ప రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. సింగరేణి కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తూ డిపెండెంట్ ఉద్యోగాలను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. రాష్ట్ర మంత్రి వివేక్ చెన్నూరు నియోజక వర్గంలో నిరుద్యోగులకు ఇస్తానన్న 45 వేల ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటను వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేసేలా మంత్రి చొరవ చూపాలన్నారు . బెదిరింపులు అక్రమ కేసులు మాని క్యాతనపల్లి అభివృద్ధికి సహకరించాలని కోరారు. మున్సిపాలిటీలో పాలకవర్గం కొలువు దీరిందని 22 వార్డులలో ఉన్న సమస్యలను చైర్మన్, వైస్ చైర్మన్ ఇతర కౌన్సిలర్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని, అభివృద్ధికి ఒకరికొకరు సహకరించుకోవాలని సూచించారు. అనంతరం కొత్తగా ఏర్పడిన టిఆర్ఎస్ పార్టీపై ప్రశ్నించగా తెలంగాణాలో కొత్త పార్టీలు పుట్టుకొచ్చి మట్టికలిసి పోయిన పార్టీలతో పోల్చడం గమనార్హం. అయన వెంట మున్సిపల్ చైర్మెన్ గోడిసేల సంధ్యారాణి, కౌన్సిలర్లు బొమ్మ భూమయ్య గౌడ్, కృపానందం, బబ్బేర స్వర్ణలత, పట్టణ అధ్యక్షుడు కంబగోని సుదర్శన్ గౌడ్, నాయకులు మూల రాజిరెడ్డి, మేడిపల్లి సంపత్, సూరిబాబు మల్లయ్య ఉన్నారు.

# ఆర్టీసీ విలీనం పట్ల హర్షం

## సీఎం, మంత్రుల ఫోటోలకు పాలాభిషేకం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ఆధ్వర్యంలో ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్ ల చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాలాభిషేకం చేశారు. తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల దశాబ్దాల కలను నెరవేరుస్తూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, 11శాతం పీఆర్సీ ప్రకటించడంతో పాటు అన్ని డిమాండ్లను నెరవేర్చిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌక్ వద్ద, డిపో వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆర్టీసీ కార్మికులతో కలిసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మిక సోదరులకు ఇది చారిత్రకమైన రోజు అని.. మాయ మాటలు చెప్పి మోసం చేసిన గత పాలకుల కళ్లు తెరిపించిన రోజు అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం, మంత్రుల కృషితో ఆర్టీసీ డిమాండ్లు సాకారమయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కార్మికుల పక్షానే ఉంటుందని అన్నారు. జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలు విని, పరిష్కరించారని అన్నారు. ముఖ్యమంత్రికి, మంత్రివర్గ సభ్యులకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ పక్షాన, జిల్లా ఆర్టీసీ కార్మికుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా లీడర్లు రాజిరెడ్డి, భువన సుందర్, రాజయ్య, సమ్మయ్య, స్వప్న రెడ్డి, లక్ష్మి, వెంకీ యాదవ్, మధు వంశీ, దొడ్డి కిష్టయ్య, పంతగాని సమ్మయ్య, అన్నపురెడ్డి మహేష్ రెడ్డి, దాసరి శ్రీహరి, వెన్నెల రవీందర్, ప్రేమ్ కుమార్, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీను, కౌన్సిలర్లు రాధా, శారద, కురిమిళ్ళ శీను, బొడ్డు అశోక్, పృధ్వీరాజ్, మేకల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌ను అవమానించిన కాంగ్రెస్

## కేంద్ర మంత్రి బండి సంజయ్

### హైదరాబాద్ సోమాజీగూడ అంబేద్కర్ జయంతి ఉత్సవాల సదస్సు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి తెలివి లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. జీడీపీ ఆధారంగా అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలను పెంచాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రతిపాదనను రాహుల్ గాంధీ అంగీకరించడమే ఇందుకు నిదర్శనమన్నారు. రాహుల్ గాంధీ స్థానంలోకి రావాలని తాపత్రయ పడుతున్న రేవంత్ రెడ్డి ఆ కుట్రలో భాగంగా ఇలాంటి ప్రతిపాదనలు తీసుకొస్తున్నారని తెలిపారు. జీడీపీ ఆధారంగా సీట్లు పెంపు అర్ధరహితమని, రేవంత్ రెడ్డి పిచ్చి ప్రతిపాదనలను చూసి కాంగ్రెస్ నేతలే తిట్టుకుంటున్నారని అన్నారు. హైదరాబాద్‌లోని సోమాజీగూడ జయ గార్డెన్స్‌లో అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు లంకల దీపక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బండి సంజయ్ తోపాటు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, బంగారు శ్రుతి, రాథోడ్ తదితరులు హజరయ్యారు. అంబేద్కర్ ను కాంగ్రెస్ అడుగడుగునా అవమానించిందని, అంబే ద్కర్ లా మినిస్టర్ గా ఉన్నా సరైన గౌరవం ఇవ్వకుండా నెహ్రూ ప్రభుత్వం 370 ఆర్టికల్ తీసుకొచ్చారని, కాంగ్రెస్ ము మ్మాటికీ మహిళా ద్రోహి అని, పార్లమెంట్ సాక్షిగా ఇండీ కూటమి పేరుతో బిల్లును అడ్డుకుని మహిళలకు తీరని నష్టం చేశారు. కుటుంబ వారసత్వ పార్టీల మహిళలకే పదవు లు కావాలని కాంగ్రెస్ కూటమి భావి స్తోంది. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కూడా ఇచ్చేందుకు వెనుకాడని పార్టీ బీజేపీ. జీడీపీ ఆధారంగా సీట్ల పెంపు ప్రతిపాదన అర్ధరహితం.రేవంత్ ప్రతిపాదన వల్ల హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనే 70 శాతం సీట్లు చేయాలి. కొడంగల్ అసెంబ్లీ స్థానమే ఉండదు. ములుగు, కొమరం భీం జిల్లాలకు ఒక్క సీటు వచ్చే అవకాశం లేదు. రాహుల్ గాంధీ స్థానాన్ని ఆక్రమించాలని రేవంత్ రెడ్డి ప్లాన్ చేస్తున్నారు. రాహుల్ గాంధీకి తెలివి లేదు. అందుకే రేవంత్ రెడ్డి ట్రాప్ లో పడుతున్నారు. డీలిమిటేషన్ బిల్లును అడ్డుకోవడంతో రాహుల్, రేవంత్ లను కాంగ్రెస్ నేతలే తిడుతున్నారు.



# ఎం.దానకిషోర్ బాధ్యతల స్వీకరణ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఎం.దాన కిషోర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కూడా అదనపు భాధ్యతలలో దాన కిషోర్ కొనసాగుతున్నారు.

# గోపాలరావుకు 'జూలూరు' నివాళులు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ వ్యవస్థాపకుల్లో ఒకరైన గోపాల రావుకు సాహిత్యకాడమీ పూర్వ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ నివాళులర్పించారు. తొలి హైదరాబాద్ పుస్తక ప్రదర్శనకు సమన్వయకర్తగా వ్యవహరించన గోపాలరావు గురువారం నాడు మృతి చెందారు. వారి భౌతిక దేహాన్ని ఆదివారం ఆర్‌టిసి క్రాస్ రోడ్స్‌లోని తన స్వగృహంలో తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు జూలూరు గౌరీశంకర్, తెలంగాణ బుక్‌ట్రస్ట్ వ్యవస్థాపకులు కోయ చంద్రమోహన్, సీనియర్ జర్నలిస్ట్ కొండూరు వీరయ్య కవులు, రచయితలు సందర్శించి సంతాపాన్ని తెలియజేసారు. వారి కుటుంబానికి ప్రగాడ సానుభూతిని వ్యక్తం చేసారు. గోపాల్ రావు అంతిమ యాత్ర ఆర్టీసీ క్రాస్ రోడ్డు నుండి భన్సి లాల్ పేట్ వరకు జరిగింది. అంత్యక్రియలు బన్సీలాల్ పేట్ స్మశాన వాటికలో ముగిసాయి.

# కులాలకు జనాభా నిష్పత్తి ప్రకారం వాటా దక్కాలె

## బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఏకతాటిపైకి వచ్చి పోరాడాలె

### బీసీ, ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** కులాలకు జనాభా నిష్పత్తి ప్రకారం వాటా దక్కాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీ లు ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్, ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహారాజ్ పిలుపునిచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ లో గల బాలాజీ కన్వెన్షన్ హాల్ లో ఆదివారం బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ బుచ్చయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కులాలు లెక్కపెట్టి విడుదల చేసినంత మాత్రాన సరిపోదని, కులాన్ని లెక్కించే పరమార్థం ఈ దేశ సంపదని భూమిని, రాజ్యాన్ని ఆయా కులాల జనాభా నిష్పత్తి ప్రకారం పంచడం కోసం, ఇలా కులాలను లెక్క పెట్టే దానికి అర్థమని, అదే భారత రాజ్యాంగ గణతంత్ర స్ఫూర్తికి నిదర్శనమని అన్నారు. రేవంత్ రెడ్డి కులాల అందరికీ సంపద సమ పంపిణీ చేయకుండా, మొత్తం భూమిని, రాజ్యాన్ని సంపదని కేవలం ఒకే ఒక్క రెడ్డి కులానికే అప్ప చెబుతున్నాడని విమర్శించారు. ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే, మంత్రులు పదవుల్ని అగ్రవర్ణాలకే పట్టం కడుతున్నారని, అదే మార్గంలో బీఆర్ఎస్, బిజెపి నడుస్తుందని తెలిపారు. దీన్ని మార్చాలని, అన్నింటిపై ప్రజలకు హక్కు రావాలని, అందుకోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ జాక్ తెలంగాణలో నిరంతరం యుద్ధం చేస్తుందని, అంతిమంగా తెలంగాణలో 90శాతం ఉన్న బిసి, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాధికారం సాధించడానికి మా పోరాటం ముందుకెళ్తుందని,10శాతం ఉన్న అగ్రవర్ణాలను రాజ్యం నుండి వెళ్లగొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ నాదం కుమారస్వామి, బిసి, ఎస్సీ, ఎస్టీ జాక్ రాష్ట్ర అధ్యక్షులు రాఘవేంద్ర, ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర సమ్మయ్య, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు రాదండి దేవేందర్, నాయకులు దుగ్యాల స్వామి, చంద్రగిరి శంకర్, సత్యనారాయణ, పొదిల సాయిబాబా, మేకల సుమన్, కొత్తూరు రవీందర్, చిట్యాల శ్రీనివాస్, అశోక్, రమేష్, రవి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా వాసవీ మాత జయంతి వేడుకలు

- ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఆర్య వైశ్యులకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్య వైశ్యుల ఆరాధ్య దేవత శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులు సర్వలోకాలకు కలగాలని కోరారు. ప్రజలందరికీ సుఖశాంతులు, ఐశ్వర్యాలు చేకూరాలని అన్నారు. వాసవి మాత జయంతి సందర్భంగా సికింద్రాబాద్ ఐవీఎఫ్, మియాపూర్, ప్రగతి నగర్, గాజులరామారం, నర్సాపూర్, మగ్దూమ్‌నగర్ (హెచ్ఎంటీ), బచ్చుపల్లి, రాంపల్లి ప్రాంతాల్లో నిర్వహించిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాల్లో ఆయన హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ప్రతి ప్రాంతంలో భక్తులు భారీ సంఖ్యలో హాజరై భక్తి పరవశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త గారు మాట్లాడుతూ ఎన్నో యేండ్ల ఆకాంక్ష ఆర్య వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అలాగే నేడు వాసవి మాత జయంతి నీ అధికారికంగా చేయడం తో 25 లక్షల మంది ఆర్య వైశ్యుల తరుపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ రోజు అధికారిక పండుగ చేసుకోవడం సంతోషం అని ఆయన అన్నారు. వాసవి మాత త్యాగం, అహింసా సిద్ధాంతం నేటి సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం, పరస్పర గౌరవం పెంపొందించడానికి అమ్మవారి బోధనలు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. యువత కూడా ఇలాంటి ఆధ్యాత్మిక మరియు సాంప్రదాయ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. అలాగే, ప్రతి ప్రాంతంలో నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. భక్తులకు అన్నదానం, ప్రసాదాల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించగా, మహిళలు, యువకులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమాల్లో పబ్బ చంద్రశేఖర్, కట్ట రవికుమార్, కటకం శ్రీనివాస్, బెల్దే రవికుమార్, ఐవీఎఫ్ సికింద్రాబాద్ అధ్యక్షులు నవీన్, ఆర్య వైశ్య సంఘం నాయకులు, వాసవి సేవా సంఘ సభ్యులు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

# చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



**లక్ష్మణ చందా, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** మండలంలోని బాబాపూర్ గ్రామ చెరువులో చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై శ్రావణి తెలిపారు. ఆమె తెలిపిన కథనం ప్రకారం రాజమండ్రి కి చెందిన వలస కూలి గోవింద్ అనే వ్యక్తి మృతి చెందారు. ప్రతి సంవత్సరం రాజమండ్రి కి చెందిన కొందరు చేపల వేట జాలర్లు తెలంగాణకు వలస వచ్చి వేసవికాలంలో సీజన్లో చేపలు పడుతూ ఉంటారు. అలాగే ఆదివారం రోజున లక్ష్మణ్ చందా మండలంలో గల బాబాపూర్ పెద్ద చెరువులో రాజమండ్రి కి చెందిన వలస కూలీలు జాలర్లు సుమారు 15 మంది బృందంతో చెరువులో దిగి చేపలు పట్టచుండగా మధ్యాహ్నం అందాజా మూడున్నర గంటలకు నందిపల్లి గోవింద్ వయస్సు సుమారు 34 సంవత్సరాలు అనే వ్యక్తి కాలుకు వల చుట్టుకొని ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయినాడు. మృతునికి ఇద్దరు పిల్లలు కలరు మృతుని యొక్క మేనమామ త్రినాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు లక్ష్మణ్ చందా మండల ఎస్సై శ్రావణి తెలిపారు.



# నిర్మల్ కలెక్టరేట్‌లో ఘనంగా వాసవి మాత జయంతి వేడుకలు

**నిర్మల్ బ్యూరో, ఏప్రిల్26 (జనంసాక్షి) :** కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఆదివారం వాసవి మాత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ముందుగా ఆయన పలువురు అధికారులు, సంఘాల నాయకులతో కలిసి వాసవి మాత చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ జయంతి వేడుకలలో డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా వాసవి మాత జయంతి శోభాయాత్ర

- హాజరైన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** వాసవి మాత జయంతి సందర్భంగా వరంగల్‌లో నిర్వహించిన శోభాయాత్ర ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తో పాటు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ శోభాయాత్రలో ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య కొబ్బరి కాయ కొట్టి శోభాయాత్రను ప్రారంభించారు. శోభా యాత్రలో భాగంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వాసవి మాతకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కుల పెద్దలు, నాయకులు, మహిళలు, అధికారులు పాల్గొన్నారు.

# ఏఐ ఆధారిత గ్రంథాలయాల్లో మెటాడేటాతో ఉపయోగాలు

డిజిటల్ యుగంలో ప్రపంచవ్యాప్తంగా సమాచారం అపారంగా పెరుగుతోంది. ప్రతి రోజూ వేల సంఖ్యలో పరిశోధన పత్రాలు, థీసిస్‌లు, డిసర్టేషన్లు, నివేదికలు, డేటా ఫైళ్లు, ప్రభుత్వ జీవోలు, అధికారిక పత్రాలు, శాస్త్రీయ వ్యాసాలు, ఆన్‌లైన్ పుస్తకాలు విడుదలవుతున్నాయి. విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలు, గ్రంథాలయాలు, ప్రభుత్వ విభాగాలు, ప్రైవేట్ సంస్థలు నిరంతరం కొత్త జ్ఞానాన్ని సృష్టిస్తున్నాయి. అయితే ఈ జ్ఞానం సాధారణ గ్రంథాలయ వినియోగదారులకు, విద్యార్థులకు, రీసెర్చ్ స్కాలర్లకు, అధ్యాపకులకు అందుబాటులో ఉన్నప్పటికీ దాన్ని సులభంగా కనుగొనలేక పోతే దాని అసలు విలువ తగ్గిపోతుంది. ఒక విద్యార్థి తన పరిశోధనకు అవసరమైన పత్రం కనుగొనలేకపోతే, ఒక శాస్త్రవేత్త ఇప్పటికే జరిగిన పరిశోధనను మళ్లీ చేయవలసి వస్తే, ఒక విధాన నిర్ణేత సరైన డేటాను సమయానికి పొందలేకపోతే సమాజానికి నష్టం జరుగుతుంది. ఈ సమస్యకు పరిష్కారంగా మెటాడేటా, శోధన వ్యవస్థలు, ప్రాప్యత సాంకేతికతలు కీలకంగా మారాయి. ఇప్పుడు వీటిని మరింత తెలివిగా, వేగంగా, సమర్థంగా మార్చేది కృత్రిమ మేధస్సు (ఏఐ).

మెటాడేటా అంటే సాధారణంగా "డేటా గురించిన సమాచారం (డేటా)" అని చెప్పవచ్చు. ఒక పత్రం గురించి వివరాలను సూచించే సమాచారం మెటాడేటా. ఉదాహరణకు పత్రం పేరు, రచయిత పేరు, ప్రచురణ సంవత్సరం, విశ్వవిద్యాలయం పేరు, పరిశోధన విభాగం, మార్గదర్శకుడు, ముఖ్యమైన కీలక పదాలు, భాష, పేజీల సంఖ్య, సారాంశం, హక్కుల వివరాలు, ఫైల్ ఫార్మాట్, డీఓఐ వంటి అంశాలు అన్నీ మెటాడేటాలో భాగంగా ఉంటాయి. ఒక గ్రంథాలయంలో పుస్తకాన్ని వెతకడానికి కేటలాగ్ ఎలా అవసరమో, డిజిటల్ ప్రపంచంలో జ్ఞానాన్ని వెతకడానికి మెటాడేటా అంతే అవసరం. సరైన మెటాడేటా లేకుంటే లక్షల ఫైళ్లు ఉన్నా అవి కేవలం ఉపయోగించ లేని నిల్వలుగా(స్టోర్) గా మారిపోతాయి.

గతంలో మెటాడేటా నమోదు పూర్తిగా మానవ ఆధారిత ప్రక్రియగా ఉండేది. లైబ్రేరియన్లు, డేటా ఎంట్రీ సిబ్బంది లేదా నిర్వాహకులు ఒక్కో పత్రాన్ని చూసి దాని వివరాలను నమోదు చేయాల్సి వచ్చేది. ఇది శ్రమతో కూడిన, విసుగు కలిగించే పని. అధిక సమయం పట్టే పని. ముఖ్యంగా పెద్ద విశ్వవిద్యాలయాల్లో ప్రతి సంవత్సరం వేలాది థీసిస్‌లు సమర్పించబడుతున్నప్పుడు ఈ పని మరింత క్లిష్టంగా మారేది. కొన్నిసార్లు పేర్లలో స్పెల్లింగ్ పొరపాట్లు జరిగేవి. రచయిత పేర్లు ఒక చోట పూర్తి రూపంలో, మరొక చోట సంక్షిప్త రూపంలో నమోదు కావడం వల్ల ఒకే వ్యక్తి రచనలు విడివిడిగా కనిపించేవి. కీలక పదాలు సరిపోకపోవడం వల్ల కూడా మంచి పత్రాలు శోధనలో కనబడకపోయేవి. ఒక వేళ పొరపాటున అంశం తప్పు విభాగంలో వర్గీకరించబడితే యూజర్‌కు సరైన ఫలితాలు రావు.

అయితే,ఈ నేపథ్యంలో ఇప్పుడు ఏఐ ఆధారిత మెటాడేటా వ్యవస్థలు గొప్ప మార్పును తీసుకొచ్చాయి. ఇప్పుడు కంప్యూటర్ వ్యవస్థలు పత్రాన్ని చదివి అందులోని ప్రధాన సమాచారాన్ని స్వయంచాలకంగా వాటికి అవే గుర్తించగలుగుతున్నాయి. పీడీఎఫ్ పత్రంలో మొదటి పేజీ చూసి శీర్షికను గుర్తించడం, రచయిత పేర్లను వేరు చేయడం, విశ్వవిద్యాలయం లేదా సంస్థ పేరును గుర్తించడం, సారాంశాన్ని తీసుకోవడం, సూచనల జాబితాను గుర్తించడం వంటి పనులను ఏఐ సమర్థవంతంగా, వేగంగా చేయగలదు. స్కాన్ చేసిన పాత పత్రాలకు ఓసీఆర్ సాంకేతికతను ఉపయోగించి చిత్ర రూపంలోని అక్షరాలను టెక్స్ట్‌గా కూడా మార్చవచ్చు. దీని వల్ల పాత గ్రంథాలయ సంపద కూడా శోధనలోకి వస్తుంది.

కీలక పదాల ఎంపికలో ఏఐ పాత్ర మరింత విలువైనది. చాలా మంది రచయితలు తమ పత్రాలకు కొద్దిపాటి పదాలు మాత్రమే ఇస్తారు. కానీ పరిశోధనలో ఉన్న భావాలు చాలా విస్తృతంగా ఉండవచ్చు. ఉదాహరణకు "వ్యవసాయ నీటి నిర్వహణ" అనే



థీసిస్‌లో నీటి కొరత, వాతావరణ మార్పు, సూక్ష్మ సాగు పద్ధతులు, గ్రామీణ ఆర్థికాభివృద్ధి, భూగర్భజల వినియోగం, పంట ఉత్పాదకత వంటి అనేక ఉపాంశాలు (సబ్- హెడ్డింగ్స్) ఉండవచ్చు. ఏఐ పత్రంలోని పూర్తి విషయాన్ని విశ్లేషించి ఈ భావాలను గుర్తించి అదనపు కీలక పదాలను జోడించగలదు. దీనివల్ల ఆ పత్రం మరింత మందికి కనిపించే అవకాశం పెరుగుతుంది.

శోధన (సెర్చింగ్) రంగంలో ఏఐ తీసుకొచ్చిన మార్పు అత్యంత విప్లవాత్మకమైనది. పాత తరహా శోధనలో యూజర్ టైప్ చేసిన పదం ఏ పత్రంలో ఉందో అదే చూపించబడేది. ఇది కీవర్డ్ ఆధారిత శోధన. కానీ యూజర్ వాడిన పదాలు, పత్రంలో వాడిన పదాలు భిన్నంగా ఉంటే మంచి సమాచారం దొరకదు. ఇప్పుడు ఏఐ భావం ఆధారంగా శోధన చేస్తోంది. ఉదాహరణకు "పంటలపై వాతావరణ ప్రభావం" అని వెతికితే "క్లైమేట్ చేంజ్ అండ్ అగ్రికల్చర్", "రెయిన్‌ఫాల్ వెరియబిలిటీ", "ఫుడ్ సెక్యూరిటీ అండర్ డ్రాట్ కండిషన్స్", "క్రాప్ యీల్డ్ మోడలింగ్" వంటి వేరే శీర్షికలతో ఉన్న పత్రాలను కూడా చూపగలదు. ఎందుకంటే ఏఐ పదాలను మాత్రమే కాదు, వాటి అర్థ సంబంధాలను కూడా అర్థం చేసుకుంటుంది.

భాషా అడ్డంకులను తగ్గించడంలో కూడా ఏఐ కీలక పాత్ర పోషిస్తోంది. ప్రపంచ జ్ఞానంలో చాలా భాగం ఇంగ్లీష్‌లో ఉండగా, అనేక ప్రాంతీయ భాషల్లో కూడా విలువైన పరిశోధన ఉంది. ఒక తెలుగు విద్యార్థి తెలుగులో శోధించి ఇంగ్లీష్ పత్రాలను కనుగొనగలగడం, ఒక హిందీ పరిశోధకుడు మరాఠీ లేదా తమిళ పత్రాల సారాంశాన్ని చదవగలగడం, ఒక విదేశీ పరిశోధకుడు తెలుగు విశ్వవిద్యాలయ థీసిస్‌ను అర్థం చేసుకోవడం ఇప్పుడు సాధ్యమవుతోంది. అనువాద ఆధారిత శోధన, బహుభాషా... భాషా నమూనాలు, ఆటోమేటిక్ సారాంశ వ్యవస్థలు ఈ మార్పుకు కారణం. భారతదేశం వంటి బహుభాషా దేశంలో ఇది అత్యంత అవసరం.

ప్రాప్యత అనే అంశం కూడా సమానంగా ముఖ్యమైనది. సమాచారం ఉన్నా అందరికీ అందుబాటులో లేకపోతే అది అసంపూర్ణ జ్ఞాన వ్యవస్థగా మిగులుతుంది. దృష్టి లోపం ఉన్న విద్యార్థులు స్క్రీన్ రీడర్ల ద్వారా పత్రాలను వినగలగాలి. చదవడంలో ఇబ్బంది ఉన్నవారికి సరళీకృత సారాంశాలు అందాలి. చెవిటివారికి వీడియోల్లో సబ్‌టైటిల్స్ ఉండాలి. కదలికలో ఇబ్బంది ఉన్నవారు వాయిస్ కమాండ్‌లతో శోధించగలగాలి. ఏఐ ఆధారిత టెక్స్ట్ టు స్పీచ్, స్పీచ్ టు టెక్స్ట్, ఆటో క్యాప్షన్, స్మార్ట్ రీడింగ్ టూల్స్ ఈ దిశగా పెద్ద సహాయం చేస్తున్నాయి.

సిఫార్సు వ్యవస్థలు డిజిటల్ గ్రంథాలయాలను మరింత తెలివైనవిగా మారుస్తున్నాయి. ఒక విద్యార్థి "గ్రామీణ విద్య" పై పత్రం చదివితే, దానికి సంబంధించిన ఇతర థీసిస్‌లు, ప్రభుత్వ నివేదికలు, అంతర్జాతీయ పరిశోధనలు, డేటాసెట్‌లు, గణాంక పట్టికలు ఏఐ సూచించగలదు. ఒక శాస్త్రవేత్త కొత్త వ్యాసం ప్రచురిస్తే అదే రంగంలోని ఇతర పరిశోధకులకు సూచించవచ్చు. దీని వల్ల జ్ఞాన విస్తరణ వేగవంతమవుతుంది. యూజర్ వెతికేది మాత్రమే కాదు, యూజర్‌కు ఉపయోగపడేదీ ముందుగానే సూచించే వ్యవస్థగా డిజిటల్ లైబ్రరీ మారుతుంది.

భవిష్యత్తులో ఏఐ ఆధారిత మెటాడేటా కేవలం నమోదు సమాచారంగా మిగలదు. అది జ్ఞాన మ్యాప్‌గా రూపాంతరం చెందుతుంది. ఏ పరిశోధన ఏ రంగానికి సంబంధించినది? ఎవరు ఎవరిని ఉదహరించారు? ఏ విశ్వవిద్యాలయం ఏ అంశంలో బలంగా ఉంది? ఏ రంగాల్లో పరిశోధన పెరుగుతోంది? ఏ అంశాలు నిర్లక్ష్యం చెయ్యబడ్డాయి? ఏ ప్రాంతాల్లో డేటా కొరత ఎంత ఉంది? వంటి ప్రశ్నలకు సమాధానాలు అందించగలదు. విధాన నిర్ణేతలు దీనిని ఆధారంగా తీసుకుని నిధులు కేటాయించవచ్చు. విశ్వవిద్యాలయాలు తమ పరిశోధన దిశను నిర్ణయించవచ్చు.

అయితే ఈ ప్రయోజనాలతో పాటు అనేక ఇతర సవాళ్లు కూడా ఉన్నాయి. ఏఐ తప్పులేనిది కాదు. ఒక పత్రంలోని రచయిత పేరును తప్పుగా చదివితే అతనికి సరైన గుర్తింపు దక్కకపోవచ్చు. ఒక మహిళా రచయిత పేరు పురుషుడిగా నమోదు కావచ్చు. ఒక అంశాన్ని తప్పుగా వర్గీకరిస్తే అది సరైన శోధన ఫలితాల్లో కనిపించకపోవచ్చు. అందువల్ల మానవ ధృవీకరణ వ్యవస్థలు కూడా అత్యవసరం. "ఏఐ ప్లస్ మానవ సమీక్ష" విధానం రెండింటి కలయిక అత్యంత సమర్థమైనది.

పాక్షికత మరో ప్రధాన సమస్య. ప్రపంచంలోని పెద్ద భాషలు, ప్రసిద్ధ జర్నల్‌లు, ధనిక దేశాల ప్రచురణలు ఎక్కువ డేటాగా ఏఐకి అందుబాటులో ఉంటాయి. ఫలితంగా చిన్న భాషలు, ప్రాంతీయ విశ్వవిద్యాలయాలు, స్థానిక పరిశోధన వెనుకబడే ప్రమాదం ఉంది. ఉదాహరణకు గ్రామీణ భారతదేశంపై విలువైన పరిశోధన కన్నా విదేశీ పెద్ద జర్నల్ వ్యాసాలకు ఎక్కువ ప్రాధాన్యం దక్కవచ్చు. కాబట్టి సమానత్వం దృష్టితో శిక్షణ డేటా, అల్గారిథమ్ రూపకల్పన జరగాలి.

గోప్యత కూడా అత్యంత కీలకం. యూజర్లు ఏమి వెతుకుతున్నారు? ఏ పత్రాలు చదువుతున్నారు? ఎంతసేపు చదువుతున్నారు? ఏ అంశాలపై ఆసక్తి చూపుతున్నారు? అనే సమాచారం సేకరించబడితే దాన్ని ఎలా ఉపయోగించాలి? ఎవరితో పంచుకోవాలి? అనే ప్రశ్నలు కూడా వస్తాయి. పరిశోధన స్వేచ్ఛను దెబ్బతీయకుండా, వ్యక్తిగత గోప్యతను కాపాడుతూ డేటా విధానాలు ఉండాలి. యూజర్ సమ్మతి, పారదర్శకత, భద్రతా ప్రమాణాలు తప్పనిసరి.

భారతదేశం వంటి దేశాలకు ఈ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయి. వేలాది విశ్వవిద్యాలయాలు, లక్షల థీసిస్‌లు, అనేక భాషలు, విస్తారమైన సామాజిక సమస్యలు, వ్యవసాయం నుండి అంతరిక్షం వరకు విభిన్న పరిశోధన రంగాలు ఉన్నందున ఏఐ ఆధారిత జ్ఞాన వ్యవస్థలు అభివృద్ధి చేస్తే ప్రపంచానికి ఆదర్శంగా నిలవవచ్చు. తెలుగు, తమిళం, కన్నడ, మరాఠీ, బెంగాలీ వంటి భాషల్లో ఉన్న పరిశోధనను ప్రపంచానికి అందించవచ్చు.

మొత్తానికి ఏఐ ఆధారిత మెటాడేటా, శోధన మరియు ప్రాప్యత వ్యవస్థలు డిజిటల్ పరిశోధన ప్రపంచానికి కొత్త దిశను చూపుతున్నాయి. సమాచారం నిల్వలో ఉండటం ఒక్కటే సరిపోదు. అది సరైన వ్యక్తికి, సరైన సమయంలో, సరైన రూపంలో చేరాలి. భాషా గోడలు తొలగాలి. దివ్యాంగులకు అందుబాటులో ఉండాలి. ప్రాంతీయ జ్ఞానం కూడా ప్రపంచ వేదికపై నిలవాలి. ఈ లక్ష్యాలను సాధించడంలో ఏఐ ఒక శక్తివంతమైన సాధనం. అయితే న్యాయం, నాణ్యత, పారదర్శకత, గోప్యత అనే విలువలతో వాడినప్పుడే అది నిజమైన ప్రజా జ్ఞాన వ్యవస్థగా మారుతుంది.




డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

## లావా కిక లేటేమ్లేదు..

నువ్ మోసగాడవే
లోక కంటకుడవు
నోటికూడు గూడూ
లాగేసిన లంగవు
సంక్షేమమూ
సుపరిపాలన
సుస్థిరతలంటు
నూకలు జల్లి
పసందు రాగం
ఉచ్చులు అల్లి
వొయ్యారపు
వొలలు విసిరి
తడిగుడ్డలతో
గొంతులుగోయ
పార్లమెంటూ
అసెంబ్లీలనే
పొదల మాటున
నేర్పుగ నక్కిన
శికారి పిట్టల
వేటగాడివి...
ఊర్లకు ఊర్లనే
విస్థాపన జేస్తూ
సర్జ్ పూల్లంటూ
సెజ్జులు అంటూ..
కోసులు కోసులు
కాల్వలు దీస్తూ
పచ్చని బతుకుల్ల
శోకాల్ లేపుతూ
ప్రయాణ సౌలతు
భారత మాలలు
బృహత్ డ్యాములూ
అనుసంధానాలూ
నదులది నామము
రియలేస్టేట్ ద్రోహం
కొంపలు గూల్చుతు
సుందరీకరణమూ ..
పల్లే పట్నం
ఫరకేమంటూ
బతికుండంగనే
జనాన్నంతా
గోసలు బెట్టీ
గోడాడించీ
బొందల తోసే
హంతకుడవు..
కోర్టూ న్యాయం
కళ్ళను గప్పి
ఓటూ నోటూ
మైకం ఆటల
జూదం దాగే
నాటక మాడి
ప్రజాస్వామ్యపు
పైట చాటున
కోరలు దాచుక
నక్కిన నక్కవు
మా పానాలకు
మోపై తోపై
దాపురించిన
దగుల్బాజీ
పాలకుడా
వో బేహారీ..
ఈశాన్య దక్షిణ
మధ్య భారతం
పశ్చిమాసియా
ప్రపంచ జ్వాలై
కమ్ముకు వొస్తది
కాలం ఆగదు
లెక్కలు దీసి
మక్కె లిరుస్తది
దూరం ఎంతో
లేనే లేదు
తప్పదు ఖాయం
జన ఆగ్రహము
భూమి బద్దలై
ఎగిసేనింక
తరాల దోపిడి
నిలువున మాడి
బూడిద సత్యం..
కళ్ళను తెరుచుక
కాచుక చూడు
లావా కిక
లేటేమ్లేదు...

డా. ఇక్బాల్ పాషా
9440775732

# ఉద్యోగాల కల్పనలో ఏఐ పాత్ర




ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ప్రస్తుతం విరివిగా వినిపిస్తున్న సాంకేతికత. రోజురోజుకు కొత్త పుంతలు తొక్కుతున్నది టెక్నాలజీ రంగం. దీనిలో భాగంగానే పుట్టుకువచ్చిందే ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్. అదే కృత్రిమ మేధ. వ్యాపార, వాణిజ్య, సేవా రంగాల్లో ఈ కృత్రిమ మేధస్సు చాలా ఉపయోగపడుతుంది.కృత్రిమ మేధస్సు అంటే యంత్రాలు, ముఖ్యంగా కంప్యూటర్ వ్యవస్థల ద్వారా మానవ మేధస్సులో జరిగే ప్రక్రియలను అనుకరించడం.డేటా సేకరణ, డేటా ఎంట్రీ, కస్టమర్ ఫోకస్డ్ బిజినెస్, ఇ-మెయిల్ ప్రతిస్పందనలు,సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, ఇన్వాయిస్ జనరేషన్ వంటి యాంత్రికంగా పునరావృతం చేసే రొటీన్ పనులను ఆటోమేషన్ చేసి పనిలో విసుగుదలను తగ్గించి మనిషి మరింత సృజనాత్మకంగా చేసుకోవాల్సిన పనులకు సమయం కల్పిస్తుంది.అనేక మంది మార్కెట్ పరిశోధన విశ్లేషకులు ఎఐ సమాజంలో అనేక సానుకూల మార్పులను తీసుకువచ్చే సామర్థ్యాన్ని కలిగి ఉందని, వాటిలో మెరుగైన ఉత్పాదకత, మెరుగైన ఆరోగ్య సంరక్షణ మరియు విద్యకు ప్రాప్యత పెరగడం వంటివి ఉన్నాయని అంటున్నారు.కానీ మనం ఇప్పుడే దానికి అనుగుణంగా మారాలి.రోబోలు, సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు,స్మార్ట్ అసిస్టెంట్లు,హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్,ఆటోమేటెడ్ ఫైనాన్షియల్ ఇన్వెస్ట్‌మెంట్,వర్చువల్ ట్రావెల్ బుకింగ్ ఏజెంట్,సోషల్ మీడియా మానిటరింగ్,మార్కెటింగ్ చాట్ బోట్స్ వంటి రూపాలలో కృత్రిమ మేధస్సు ఇప్పటికే మన నిత్య జీవితంలోకి ప్రవేశించింది.అది సాంకేతిక అభివృద్ధిలో గుణాత్మకమైన,పరిమాణాత్మకమైన పెద్ద మార్పును సూచిస్తుంది. మరి కొందరు, ఎక్కువగా మానవీయంగా పునరావృతమయ్యే మానవ పని రకాల ఉద్యోగాలలో పనిచేసే వారు, ఎ ఐ మరియు రోబోటిక్స్ ఒక విధ్వంసక శక్తి అని మరియు ఉద్యోగాల భవిష్యత్తు విషయానికి వస్తే అది ఉద్యోగాలను తగ్గించడానికి మాత్రమే ఉపయోగపడుతుందని చెబుతారు.కానీ రోబోలు మరియు ఎఐ టెక్నాలజీలు చాలా కొత్త వృత్తులను సృష్టించగలవు మరియు సంక్లిష్ట సమస్యలను పరిష్కరించడంలో సహాయపడతాయి.మన దైనందిన జీవితాలను సులభతరం చేస్తాయి మరియు మరింత సౌకర్యవంతంగా చేస్తాయి కానీ ఎ ఐ ప్రతికూల శక్తిగా కాకుండా సానుకూల శక్తిగా ఉండటం వైపు మొగ్గు చూపుతోంది.ఉద్యోగాలు మరియు ఆర్థిక వ్యవస్థను ఎ ఐ ప్రభావితం చేస్తుంది.మెకిన్సే గ్లోబల్ ఇన్స్టిట్యూట్ ప్రకారం,ప్రపంచ సగటు స్థాయిలో దత్తత, శోషణ మరియు ఎఐలో పురోగతి వారి అనుకరణ ద్వారా సూచించబడినట్లుగా,భవిష్యత్తులో మరియు 2030 నాటికి దాదాపు 13 ట్రిలియన్ డాలర్ల అదనపు ప్రపంచ ఆర్థిక కార్యకలాపాలను అందించడానికి తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. నేటితో పోలిస్తే దాదాపు 16% అధిక సంచిత జీడీపీ ని అందిస్తుంది.ఇది సంవత్సరానికి 1.2% అదనపు జీడీపీ వృద్ధికి సమానం.ఒకవేళ అమలు చేయబడితే,ఈ ప్రభావం చరిత్ర అంతటా ఇతర సాధారణ-ప్రయోజన సాంకేతికతలతో బాగా సరిపోతుంది.ఇది ప్రధానంగా ఆటోమేషన్ ద్వారా శ్రమను భర్తీ చేయడం మరియు ఉత్పత్తులు మరియు సేవలలో పెరిగిన ఆవిష్కరణల నుండి వస్తుంది.2030 నాటికి, సగటు అనుకరణ ప్రకారం 70% కంపెనీలు ఎ ఐ విప్లవాన్ని స్వీకరించి కనీసం ఒక రకమైన ఎ ఐ సాంకేతికతను అవలంబిస్తాయని,కానీ సగం కంటే తక్కువ కంపెనీలు ఐదు వర్గాలను పూర్తిగా గ్రహించాయని అదే నివేదిక పేర్కొంది.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలలో మనం అభివృద్ధి చేయబోయే అత్యంత విఘాతం కలిగించే సాంకేతిక పరిజ్ఞానాలలో ఎ ఐ ఒకటిగా ఉండే అవకాశం ఉందని ఫోర్బ్స్ పేర్కొంది.కృత్రిమ మేధస్సు సమాజాన్ని మరియు భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది.ఎ ఐ యొక్క భవిష్యత్తు మన జీవితాలను చాలా వరకు సరళీకృతం చేయడానికి సహాయపడే అంతులేని అవకాశాలను మరియు అనువర్తనాలను తీసుకువస్తుందని ఫోర్బ్స్ చెబుతోంది.ఇది మానవాళి యొక్క భవిష్యత్తు మరియు విధిని సానుకూలంగా రూపొందించడంలో సహాయపడుతుంది.అయితే బెర్నార్డ్ మార్ ఢ కో మన సమాజంపై కృత్రిమ మేధస్సు యొక్క పరివర్తనాత్మక ప్రభావం వల్ల అన్ని రకాల ఉద్యోగాలు మరియు పరిశ్రమలపై విస్తృత శ్రేణి ఆర్థిక, చట్టపరమైన,రాజకీయ మరియు నియంత్రణ ప్రభావాలను చూపుతుందని చెబుతోంది.మెరుగైన ఉత్పాదకత,మెరుగైన ఆరోగ్య సంరక్షణ మరియు విద్యకు ప్రాప్యతను పెంచడం వంటి అనేక సానుకూల మార్పులను ఎ ఐ ప్రస్తుతం మరియు భవిష్యత్తులో తీసుకురాగల సామర్థ్యాన్ని కలిగి ఉందని ఈ విషయం తెలిసిన ఇతరులు అంటున్నారు.ఎ ఐ ఆధారిత సాంకేతికతలు సంక్లిష్ట సమస్యలను పరిష్కరించడంలో సహాయపడతాయి.మన దైనందిన జీవితాలను సులభతరం చేస్తాయి మరియు మరింత సౌకర్యవంతంగా చేస్తాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉద్యోగ మార్కెట్‌ను మారుస్తోంది.కొత్త రకాల ఉద్యోగాలను సృష్టిస్తోంది.సాధారణ పనులను ఆటోమేట్ చేస్తోంది.2030 నాటికి 20-50 మిలియన్ల కొత్త ఉద్యోగాలు వస్తాయని అంచనా వేయగా ఎఐ ఆరోగ్య సంరక్షణ,ఔషధాలు మరియు ఇతర పరిశ్రమలలో ఉద్యోగాలను సృష్టిస్తోంది. శ్రామిక శక్తిపై ఎఐ ప్రభావం బహుముఖంగా ఉంటుంది.ఇందులో పునరావృతమయ్యే నిత్యకృత్యాల పనుల ఆటోమేషన్,మారుతున్న నైపుణ్య అవసరాలు మరియు ఉద్యోగ స్థానభ్రంశం ఉంటాయి.ఇది ఉద్యోగులకు ప్రయోజనకరంగా ఉంటుంది ఎందుకంటే ఇది మరింత సంక్లిష్టమైన మరియు సృజనాత్మక పనిపై దృష్టి పెట్టడానికి వారిని స్వేచ్ఛగా చేస్తుంది. అయితే ఇది ఉద్యోగ స్థానభ్రంశం మరియు కొన్ని రకాల ఉద్యోగాల డిమాండ్‌లో మార్పుల గురించి ఆందోళనలను కూడా సృష్టిస్తుంది.మెకిన్సే కంపెనీ నివేదిక ప్రకారం 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఎ ఐ 20-50 మిలియన్ల కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుందని అంచనా.వరల్డ్ ఎకనామిక్ ఫోరం నివేదిక ప్రకారం 2025 నాటికి, ఎ ఐ ప్రపంచవ్యాప్తంగా 75 మిలియన్ల ఉద్యోగాలను స్థానభ్రంశం చేస్తుంది కానీ 133 మిలియన్ల కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుంది.దీని అర్థం ప్రపంచవ్యాప్తంగా 58 మిలియన్ల ఉద్యోగాలు పెరుగుతాయి.అయితే కొన్ని పరిశ్రమలలో ఇప్పటికీ గణనీయమైన ఉద్యోగ స్థానభ్రంశం ఉంటుంది.కృత్రిమ మేధస్సు ఉద్యోగాలను తొలగిస్తుందని మరియు నిరుద్యోగాన్ని పెంచుతుందని తరచుగా భావించబడుతుంది.ఇంటర్నెట్ దాని ప్రారంభ దశలో ఉన్నప్పుడు కూడా ఇదే భావించబడింది, కానీ ఇంటర్నెట్ చాలా కొత్త ద్వారాలను తెరిచింది మరియు ఆ సమయంలో ఎవరూ ఊహించని కొత్త పని అవకాశాలను వ్యక్తులకు అందించింది.కృత్రిమ మేధస్సు పురోగతితో అదే విషయం సాధ్యమేనని మనం చెప్పగలం.బిగ్ డేటా,ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్,క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, డేటా విశ్లేషణ, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి మరియు సోషల్ మీడియాలో స్పెషలైజేషన్ వంటి మిలియన్ల ఉపాధి అవకాశాలతో కొత్త పరిశ్రమ ఉద్భవిస్తుంది.ప్రస్తుత పరిస్థితిలో ఉత్తమ ఫలితాలను పొందడానికి మానవునితో కూడిన హైబ్రిడ్ బృందంతో పాటు కృత్రిమ మేధస్సు అవసరమని తేల్చవచ్చు.ముందున్నదంతా ఏఐ యుగమే.దీంతో ఇప్పటికే చాలా టెక్నాలజీ, ఫార్మా, కార్లు, ఇన్సూరెన్స్ ఏజెన్సీ, మొబైల్ కంపెనీలు ఏఐని విరివిగా ఉపయోగిస్తున్నాయి.అడిగినదానికి సమాధానం చెప్పే రోబోలు, కంప్యూటర్ అప్లికేషన్లు, మనుషుల తీరును బట్టి వాటంతట అవే మెయిల్స్, మెసేజ్‌లలో ముఖ్యమైనవాటిని గుర్తించి నోటిఫికేషన్లుగా చూపే యాప్స్ ఇలా ప్రతి విషయంలో ఏఐ కీలకంగా మారింది.

-ప్రస్తుతం నిత్యావసర వస్తువుగా మారిన సెల్‌ఫోన్లలో కూడా ఏఐ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. యాపిల్ సిరి, అమెజాన్ అలెక్సా, గూగుల్ అసిస్టెంట్ వంటి వర్చువల్ అసిస్టెంట్లతోపాటు చాలా రకాల యాప్స్ ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, మెషీన్ లెర్నింగ్ టెక్నాలజీతో రూపొందించినవే. క్లౌడ్ కంప్యూటింగ్ సర్వీసులిచ్చే కంపెనీలు మెషీన్ లెర్నింగ్ సామర్థ్యంపైనే దృష్టి పెడుతున్నాయి.ఇవే కాక కంప్యూటర్ సైంటిస్ట్, కంప్యూటర్ ఇంజినీర్, గేమ్ ప్రోగ్రామర్స్, డెవలపర్స్ అండ్ అల్గారిథమ్ స్పెషలిస్ట్, రిసర్చ్ సైంటిస్ట్ అండ్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్, ఏఐ రిసర్చర్స్, సర్జికల్ టెక్నీషియన్స్ వంటి వివిధ హోదాల్లో కెరీర్‌ను ప్రారంభించవచ్చు.ఏఐ కోర్సులు చేసినవారికి ప్రభుత్వ, ప్రైవేట్, విద్యాసంస్థలు, మిలిటరీ, రోబోటిక్స్, స్పేస్, మార్కెటింగ్, హెల్త్‌కేర్ రంగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి.యాపిల్, ఫేస్‌బుక్, ఐబీఎం, యాక్సెంచర్, అమెజాన్, ఫ్రాక్టల్ అనలిక్స్, ఇంటెల్, శాప్ ల్యాబ్స్, సొసైటీ జనరాలి, మైక్రోసాఫ్ట్, అడోబ్, అటోస్, ఎన్‌విడియా, టెక్ మహీంద్రా వంటి తదితర సంస్థలు ఏఐ చేసినవారిని రిక్రూట్ చేసుకుంటున్నాయి. ఇలా చాల రకాల ఉద్యోగ, ఉపాధి కల్పనలో ఏఐ పాత్ర కీలకంగా మారింది.



డాక్టర్ మోటె చిరంజీవి
సామాజికవేత్త, విశ్లేషకులు
సెల్ : 9949194327

# కన్నవీ-విన్నవీ




డాక్టర్ శంకరమంచి
శ్యాంప్రసాద్
99 891 48 305

జగమెరిగిన బ్రాహ్మణునికి జందెమేలా అన్నట్లు పత్రికారంగ భీష్ములుగా ప్రసిద్ధి పొందిన గండూరి కృష్ణ గారిని గురించి ప్రత్యేకంగా పరిచయం చేయవలసిన అవసరం లేదు. ఆయనే జర్నలిస్టు జి.కృష్ణగా సుప్రసిద్ధులు. ఆయన మాట తీరుగానే ఆయన రాత కూడా సూటిగా ఉండేది. అవసరమైనప్పుడు సంబంధీకులకు చురకలు అంటించేవాడు. తేదీ 20.10.1924 న జన్మించిన కృష్ణ హైదరాబాదులోనే విద్యాభ్యాసాన్ని కొనసాగించి అనంతర కాలంలో డిగ్రీ మాత్రం ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి పూర్తి చేశారు. మీజాన్ పత్రికలో పత్రికా రచయితగా చేరిన కృష్ణ 19.10.1982న ఉద్యోగ విరమణ చేసేవరకు వివిధ పత్రికలలో తమ బాధ్యతలను నిర్వహించారు. ఇటు తెలుగు అటు ఇంగ్లీషులోనూ సవ్యసాచిత్వం గల కృష్ణ ఎన్నో చారిత్రక సాంస్కృతిక అంశాలను తన కాలంలో నమోదు చేశారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఆయన ఆంధ్రభూమి ఆంధ్ర ప్రభ పత్రికలలో తనదైన శైలిలో కాలమ్స్ నిర్వహించారు. అవన్నీ ఎన్నో విషయాలను నమోదు పరిచాయి. ముఖ్యంగా ఆంధ్ర భూమిలో రాసిన కన్నవీ విన్నవి శీర్షిక నా వెలువరించిన వ్యాసాలలో కొన్నింటిని వయోధిక పాత్రికేయ సంఘం పక్షాన సీనియర్ పాత్రికేయులు టి.ఉ దయ వర్లు సంకలనంగా తెచ్చారు. ఈ సంస్థ పక్షాన తిరుమల రామచంద్ర, వి హనుమంతరావు, జి.ఎస్ వరదాచారి, మొదలైన వారి రచనలను కూడా వెలుగులోకి తెచ్చారు. అందులో భాగంగానే జి కృష్ణ గారు రాసిన 168 పుటల గ్రంధాన్ని వెలువరించారు.

ఈ సందర్భంగా టి. ఉదయవర్లు, కృష్ణ గారి వ్యక్తిత్వాన్ని గురించి చెబుతూ ఆయన"అసాధారణ ధారణ శక్తి గల సాదాసీదా పత్రిక రచయిత, సరదా మనిషి, స్నేహశీలి, భాషాభిమాని, దేశభక్తుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, అక్షరాలా నిస్వార్థ జీవి" అని కొనియాడారు. ఈ గ్రంథంలోని విషయాలను గురించి చదివినప్పుడు ఆయా రంగాలలో ప్రముఖ పాత్ర వహించిన మేధావుల గురించి పండితుల గురించి రచయితల గురించి దేశభక్తుల గురించి అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్టుగా వివరించారు. గుండె రావు హర్కారే-కృష్ణమూర్తి గారి మధ్య తగాదా వచ్చినా పరస్పరం వారి మధ్య సౌహార్ధం ఉండేదని గుర్తు చేస్తూ కృష్ణ గారు"ఈరోజుల్లో మర్యాదలు చాలా మట్టుకు డబ్బు, అధికారం పైననే ఆధారపడుతున్నాయన్నారు"

ఈ మాటలు నాడే కాదు నేటికీ వర్తిస్తాయి. పరిస్థితులలో ఏమాత్రం మార్పు లేదు. మాటేటి రామప్ప గారు గొప్ప పండితులు, అధికారులు. జ్యోతిష్య శాస్త్రం పై ఆయన దాదాపు 800 గ్రంథాలను సేకరించాడని పేర్కొన్నారు. అలాగే పల్లా దుర్గయ్య గారి గురించి రాస్తూ ఆయనది "శాంతాకారం"అన్నారు. అప్పటి విద్యా శాఖ డైరెక్టర్ అలీ అక్బర్ రోజు తమ కార్యాలయానికి దరఖాస్తు పత్రం కోసం వచ్చి వెళుతున్న దుర్గయ్య గారిని గమనించి తనే దరఖాస్తు రాయించి సిటీ కాలేజీలో తెలుగు విభాగం లేకపోయినా రోజు అక్కడికి వెళ్లి సంతకం పెట్టమని చెబుతూ తర్వాతి కాలంలో అక్కడ ఆ విభాగాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పడం ఉన్నత పదవులలో ఉన్నవారు అహంకారంతో కాకుండా ఔదార్యంతో వ్యవహరించాలని ఈ సంఘటన మనకు గుర్తు చేస్తుంది. మంచితనానికి మతం రంగు పూయవలసిన అవసరం లేదు. అందుకు ఇది ఒక ఉదాహరణ అని చెప్పవచ్చు. కావ్యకంఠ గణపతి ముని సంప్రదాయజ్ఞుడైన ఆధునిక భావజాలం కలవాడని ఆంగ్లేయులు శారద చట్టాన్ని తెచ్చినప్పుడు దాన్ని సమర్థించాడని సాంఘికంగా అందరూ సమానమేనని స్త్రీ విద్యను సమర్థించాడని చెప్పారు. అలాగే "డిగ్రీలు లేని పాండిత్యంబు రాని పాడు కాలాన పుట్టిన" మల్లంపల్లి వారికి చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు తమ దేశాభిమాని పత్రికలో పనిచేయడానికి 12 రూపాయలను అడ్వాన్సుగా ఇస్తే తనకు ఆ జీతం సరిపోతుందని రెండు నెలలపాటు దానినే సర్దుకుంటానని ఆయన చెప్పిన మాటలు ఆయన నీతి నిజాయితీలకు నిదర్శనం. దుర్భర పేదరికం అనుభవించినా శర్మ గారు తన శాసన పరిశోధనను ఆపలేదని తెలిపారు. తెలంగాణలో సాంస్కృతిక పునరుద్జీవనానికి కారకులైన సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, ఎన్.కె.రావుగా ప్రసిద్ధులైన నాగులపల్లి కోదండ రామారావు మొదలైన వారు ప్రజా జీవితంలో విలువలకు కట్టుబడిన వ్యక్తులుగా వారిని ఋషి త్రయంగా అభివర్ణించారు. వరంగల్ జిల్లా తాటికాయల గ్రామానికి చెందిన సహజ కవి పొట్లపల్లి రామారావు చుక్కలు, ఆత్మ వేదన వంటి కవితా సంపుటులనే కాకుండా జైలు కథలు రాశాడు. ఆయన రాసిన "చుక్కలు"కు తుమ్మపూడి సంజీవ్ దేవ్ చక్కని పీఠిక రాశారు. 1936లో వరంగల్లులో జరిగిన ప్రథమ సత్యాగ్రహంలో పాల్గొన్న ముగ్గురిలో పొట్లపల్లి రామారావు ఒకరిని వారి కవితా శక్తితో పాటు దేశభక్తిని ప్రశంసించారు. కృష్ణ గారు ఆయన గురించి రాస్తూ"కరగడమే తడవుగా కదలి యంత కాగలడు" అని కీర్తించారు. మిత్రులు భూపాల్ పొట్లపల్లి రామారావు జీవితం సాహిత్యం పై పరిశోధన చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ముఖ్యంగా ఆ రోజుల్లో వరంగల్ కు వెళితే కాళోజీ రామేశ్వరరావు గారి ఆతిథ్యం గార్లపాటి రాఘవరెడ్డి గారి పాండిత్యం ఈ రెండు అక్కడ కలుస్తాయని చెప్పారు. ముఖ్యంగా విశ్వనాథ రాఘవ రెడ్డి గారి పద్యాలను విని పులకించాడట. తెలంగాణలో ఇలాంటి కవులు ఎంతోమంది అజ్ఞాతంగానే ఉండిపోయారు. ఈనాడు పరిశోధకులు వారి సాహిత్యాన్ని, ప్రతిభను వెలికి తీయాల్సిన అవసరం ఉన్నది. అడివి బాపిరాజు గారి గురించి రాస్తూ"ఆయనకు సంగీతం వచ్చు. బొమ్మలు వేసేవాడు. నవలలు, కథలు, గేయాలు రాసేవాడు. దేశభక్తుడు అంటూ ఆయన బహుముఖ ప్రతిభను ప్రశంసించారు. కూలీ నాలి చేసుకునే స్త్రీలు పనిలో ఉన్నప్పుడు ఇంట్లో తమ పిల్లల ఆలనా పాలనా గురించి ఆలోచిస్తూ ఉంటారని అందువల్ల అలాంటి వారికి వారు పని చేసే చోటులోనే పిల్లల సంరక్షణ బాధ్యతను ఏర్పాటు చేయాలని చెప్పడం కృష్ణ గారి సామాజిక స్పృహకు వారి నిశిత పరిశీలనకు ఒక నిదర్శనంగా చెప్పవచ్చు. తెలంగాణలో శాసనాల శాస్త్రిగా పేరు పొందిన భిన్నూరి నరసింహ శాస్త్రి వలిగొండ సమీపంలోని నేటి తుమ్మల గూడెం గ్రామమే నాటి విష్ణు రాజధాని అయిన ఇంద్రపాల నగరం అని నిరూపించారు. నల్లగొండ, అదిలాబాద్, పాలమూరు జిల్లాల సర్వస్వాలను ఆంధ్రప్రదేశ్ చరిత్ర, వివిధ వర్గాల విజ్ఞాన సర్వస్వాలను ఆయన వెలువరించారు. నన్నయ ఆదికవి కాదని తనకు లభించిన చారిత్రక శాసన ఆధారంగా నన్నెచోడుడే తొలికవి అని ప్రతిపాదించిన బి.ఎన్ శాస్త్రి గారు తర్వాతి కాలంలో పరీక్షకులు వచ్చి అదొక్కటి మార్చమని చెప్పినా తన పరిశోధన శాస్త్రీయమైనదని సత్యాన్ని మరుగుపరచజాలనని చెబుతూ వారి ప్రతిపాదనను తిరస్కరించడం అది ఆయన ఆత్మాభిమానానికి పట్టుదలకు ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా చెప్పవచ్చు. మూసి పత్రికను స్థాపించి భాషా సాహిత్య రంగాలకు ఆయన చేసిన సేవ అపూర్వమైనది. అది నేటికీ కొనసాగడం విశేషం. పాఠకులలో ఆసక్తిని రేకెత్తించడానికి ఆంధ్ర పత్రికలో ఆనాడు కన్యాశుల్కం నాటకం పై జరిగిన చర్చ ఎంతో విజ్ఞాన దాయకమైనదని కానీ ఈనాడు ఆ ప్రాధాన్యం పోయి రాజకీయ ప్రాధాన్యం పెరిగిందని వ్యాఖ్యానించారు. కృష్ణ గారు ఈ వ్యాసాలను రాస్తున్నప్పుడు అక్కడక్కడ ఆయన చేసిన వ్యాఖ్యలు, వ్యంగ్యోక్తులు పాఠకులలో ఉత్కంఠను రేకెత్తిస్తాయి. అందుకు ఉదాహరణగా"నిరాడంబర జీవనం వల్ల, స్వాతిశయం లేని ప్రవర్తన వల్ల అందరికీ ఆత్మీయుడు అయ్యే అవకాశం ఉందని ఒకచోట, ప్రభుత్వానికి ఆశ్రితులు ఉంటారు లేకపోతే సృష్టించుకుంటారని మరోచోట, వ్యాపారం చేసుకునే వారికి ఆదర్శం అంటే గిట్టుబాటు కాదని మరోచోట, మనదేశంలో ఏ రాజకీయ పార్టీకి చదువుకున్న వాళ్ళు అనవసరం" అంటూ చేసిన విమర్శ సందర్భోచితంగా ఉంటూ సామాన్యులను సైతం ఆలోచింపజేస్తాయి. సుదీర్ఘ కాలం పాటు ఆయన పాత్రికేయ వృత్తిలో ఉన్నాడు కనుక విలేకరుని గురించి రాస్తూ"విలేకరి అనేవాడు ఏమి రాసినా సాధారణ ప్రజానీకానికి అర్థం కావాలనేది లక్ష్యంగా ఉండాలని" ప్రబోధించారు. అందుకు తగినట్లుగానే ఆయన ఈ రచన చేసినట్లు కూడా తెలుస్తుంది. పత్రికా రంగానికి ఆయన చేసిన ఎనలేని సేవలను గుర్తించి వెంకటేశ్వర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ను ప్రదానం చేయగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జీవన సాఫల్య పురస్కారాన్ని అందించింది. చివరకు ఆయన 6.4.2001 న దివంగతులయ్యారు. కృష్ణ గారు లేకపోయినా విషయ నిర్భరమై వస్తు వైవిధ్యం గల రచనలున్నాయి. అలా వెలువడిన అనుభవ సంపుటి ఈ "కన్నవీ - విన్నవీ". అందరూ తప్పక చదివి తీరవలసిన పుస్తకం ఇది.

# తెలంగాణ యువతకు జపాన్‌లో ఆతిథ్య రంగం ఉద్యోగావకాశాలు



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 26 (జనంసాక్షి) :** ప్రధానమంత్రి విద్యాలక్ష్మి పథకంలో భాగంగా శిక్షణ పొందుతున్న యువతకు జపాన్ లోని ఆతిథ్య రంగంలో ఉద్యోగ అవకాశాలు విరివిగా లభించనున్నాయని వింగిగ్ అకాడమీ సిఈఓ సింగిరెడ్డి రవినాథ్ రెడ్డి తెలియజేశారు. ఈ మేరకు జపాన్ ఇండియా కోఆపరేషన్ సంస్థ చైర్మన్ కెన్ జీ ఒకోమురా తదితరులతో కలిసి ఆయన ఆదివారం ఒప్పందం చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ యువతకు ప్రధానమంత్రి విద్యాలక్ష్మి పథకం సహకారంతో వివిధ రంగాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఉత్తమ ప్రతిభను కనబరిచే యువతకు జపాన్ లో అద్భుతమైన భవిష్యత్తు ఉందన్నారు. ఈ మేరకు ఒక అవగాహన కుదిరి హైదరాబాద్ లోని వింగిగ్ అకాడమీ, జపాన్ లోని జపాన్ – ఇండియా కో ఆపరేషన్ సంస్థతో ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. చేసుకుంది. ఇందులో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్, వింగిగ్ అకాడమీ కార్యాలయంలో జపాన్ – ఇండియా కో ఆపరేషన్ సంస్థ చైర్మన్ కేంజి ఒకోముర, వైస్ చైర్మన్ జూన్ ఓయబులతో కుదిరిన అవగాహన వల్ల వింగిగ్ అకాడమీ సిఈవో మరియు మేనేజింగ్ డైరెక్టర్ సింగిరెడ్డి లక్ష్మి రవినాథ్ రెడ్డి ప్రత్యక్షంగా హాజరై ఆతిథ్య రంగంలో డిగ్రీ పూర్తి చేసిన వారికీ జపాన్ లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఫైళ్ల మీద సంతకాలు చేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా కేంజి ఒకోముర మాట్లాడుతూ మానవ వనరుల కొరత కారణంగా జపాన్ ప్రభుత్వం 1.23 మిలియన్ల మంది విదేశీ కార్మికులను తమ దేశానికి రప్పించి ఉపాధి రంగంలో అద్భుత అవకాశాలను కల్పించడం జరుగుతుందని, ఎందుకోసం తమ వద్ద నిర్దిష్టమైన ప్రాణాలిక ఉందని ఆయన తెలిపారు. భారతీయులు ఎంతో నిజాయితీ కలిగిన వ్యక్తులని, వారికి దేశం పట్ల సాంప్రదాయాల పట్ల చాలా నిర్దిష్టమైన అభిప్రాయం ఉంటుందని, దానిని గమనంలో పెట్టుకొని మొదటి ప్రాధాన్యతగా ఆతిథ్య రంగంలో భారతీయ శ్రామికులకు అవకాశం కల్పించడానికి తమ సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. జపాన్ కు ప్రతి సంవత్సరం సుమారు 5 లక్షల ఉద్యోగాల అవసరం ఏర్పడిందని, జపాన్ లో భారతీయులకు మంచిపేరు ఉందిని, అక్కడి చట్టాలను గౌరవిస్తూ కష్టపడి పనిచేస్తారని నమ్మకం ఉందని, ఇతర దేశాలలో పోల్చితే జపాన్ లో కార్మిక చట్టాలు చాలా కఠినంగా కార్మికులకు అండగా ఉంటాయని కేంజీ ఒకోముర అన్నారు. తప్పనిసరిగా జపనీస్ భాష ను నేర్చుకొని ఆతిథ్య రంగంలో డిగ్రీ సాధించిన వారికి, లేదా జపనీస్ భాషను ఒక ఆప్షన్ గా ఎంచుకొని ఆన్లైన్ లో డిగ్రీ చేస్తున్నవారికి జపాన్ లోని ప్రముఖ హోటళ్లనుంచి కండిషనల్ ఆఫర్ లెటర్ తో ఉద్యోగం కల్పిస్తామని ఆయన భరోసాని వ్యక్తం చేశారు. తెలంగాణ యువతకు జపాన్ ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి హైదరాబాద్ వింగిగ్ అకాడమీ తో ఒప్పందం చేసుకున్నామని, తెలంగాణ రాష్ట్ర యువత సిద్ధమై, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన అవసరాన్ని కేంజి ఒకోముర ప్రస్తావించారు. ఇంటర్ పూర్తి ఆయిన వెంటనే 18 నుంచి 26 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు ఒక్క రూపాయి ఫీజు చెల్లించే అవసరం లేకుండా పిఎం విద్యాలక్ష్మి పథకం(ఎడ్యుకేషన్ లోన్) ద్వారా పూర్తి ఫీజు చెల్లిశీపు సౌకర్యం కల్పిస్తున్నామని, మూడున్నర సంవత్సరాల తర్వాత వాయిదా పద్ధతిలో లోన్ చెల్లించే వెసులుబాటు ఉంటుందని వింగిగ్ అకాడమీ సిఈవో రవినాథ్ రెడ్డి వివరించారు. ఆతిథ్య రంగంలో ఇంటర్నేషనల్ హోటల్ మేనేజ్ మెంట్ ద్వారా ప్రస్తుతం ఫుడ్ అండ్ బెవరేజెస్, హాస్పిటాలిటీ డిగ్రీ కోర్స్ అందిస్తున్నామని, ఈ మూడేళ్ళ కోర్సులో చేరిన విద్యార్థులకు మొదటి మూడు నెలలు అకాడమీలో జపాన్ ప్రతినిధులచే జపనీస్ లాంగ్వేజ్ శిక్షణ అందించి, అనంతరం ఆన్లైన్ లో విద్య అందించడంతోపాటు ప్రాక్టికల్ ట్రైనింగ్ లో భాగంగా ప్రతి నెల 8 వేల నుంచి 15 వేల రూపాయల స్టయిఫండ్ ను అందించి, హైదరాబాద్, విజయవాడ, బెంగుళూరు, వైజాగ్ తదితర ప్రాంతాలలో ప్రముఖ హోటళ్ల లలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఇది పూర్తిగా డిగ్రీతో సమానమైన కోర్సు అని, ఉత్తర్ ప్రదేశ్ లోని మంగళయతన్ యూనివర్సిటీ అనుబంధంతో వింగిగ్ అకాడమీలో శిక్షణ అందిస్తున్నామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. జపాన్ లాంగ్వేజ్ పై పట్టు సాధించిన వెంటనే డిగ్రీ సాధించిన లేక ఆన్లైన్ లో డిగ్రీ చేస్తున్న వారికీ ప్రతి నెల 1.2 లక్షల రూపాయల నుండినుంచి 2 లక్షల వేతనంలో జపాన్ ఉద్యోగ అవకాశాలు కలిస్తామని వెల్లడించారు. ఇప్పటికే అనేకమంది విద్యార్థులను జపాన్ పంపించిన అనుభవం వింగిగ్ ఉందని, నార్మల్ డిగ్రీలు చదివి కాలయాపన చేయకుండా వింగిగ్ అందించే డిగ్రీ కోర్సులతో కేవలం మూడు నెలల్లోనే వేతనం ప్రారంభం అవుతుందని తెలిపారు. తెలంగాణ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జైకో ప్రతినిధులు యమవుకో, తానబే, హీరోనాక, ఒగవా తదితరులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు వింగిగ్ అకాడమీ, ఎక్తా టవర్స్, వైట్ ఫీల్డ్స్, హైటెక్ సిటీ(కొండాపూర్), హైదరాబాద్, ఫోన్ నం. 8977524480 మరియు trainings@wingigglobal.com, www.wingigglobal.com లో సంప్రదించాలని వారు కోరారు.

## దళారులకు అమ్మి మోసపోవద్దు



**చిన్నంబావి, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** చిన్నంబావి మండల కేంద్రంలో మార్క్ ఫెడ్ శాఖ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటను చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు అని ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల లోనే పంటను అమ్ముకోవాలని క్వింటాల్ కు 2400/– లు ధర ను ప్రభుత్వం నిర్ణయించింది అని మంత్రి జూపల్లి, తెలిపారు. రైతుల అభివృద్ధి యే ప్రభుత్వ లక్ష్యం అని ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను చూసి ప్రతి పక్షాలు ఓర్వ లేకనే ప్రభుత్వం పై అసత్య ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు కలగ కుండా ఎలాంటి అవకతవకలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లితో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త కళ్యాణ్ రావు, కృష్ణ ప్రసాద్ యాదవ్, బీచుపల్లి యాదవ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ నరసింహా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, ఉపాధ్యక్షులు సుధాకర్ నాయుడు, వివిధ గ్రామాల సర్పంచులు భాస్కర్ యాదవ్, వడ్డేమాన్ బిచ్చన్న, కవిత ప్రభంజన్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మండల యువ నాయకులు కిరణ్ కుమార్ గౌడ్, సతీష్ యాదవ్, సీఈవో నాగరాజు, మార్క్ ఫెడ్ వివిధ శాఖల అధికారులు, వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## స్వీయ జనగణనకు ప్రజలే ముందుకు రావాలి

- కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 26 (జనంసాక్షి) :** జనాభా గణనలో భాగంగా నిర్వహిస్తున్న స్వీయ గణన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొనాలని మేడ్చల్––మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ప్రజలను కోరారు. ఆదివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు ప్రజలు తమ గృహ వివరాలను తామే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. స్వీయ గణన ప్రక్రియలో కుటుంబ పెద్ద పేరు, మొబైల్ నంబర్ నమోదు చేసి ఓటీపీ ద్వారా ధృవీకరణ పూర్తి చేయాలి. అనంతరం భాషను ఎంచుకుని జిల్లా, గ్రామం లేదా పట్టణం, పిన్ కోడ్ వివరాలు నమోదు చేయాలి. మొబైల్‌లో లొకేషన్ ఆన్ చేసి, మ్యాప్‌లో ఇంటి స్థానం గుర్తించి, ఇళ్ల వివరాలకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని తెలిపారు. మొత్తం ప్రక్రియ సుమారు 15 నిమిషాల్లో పూర్తవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జనాభా గణన ద్వారా ప్రభుత్వ పథకాలు, వనరుల కేటాయింపు, భవిష్యత్ ప్రణాళికలు, పాఠశాలలు, ఆసుపత్రులు, రహదారులు వంటి అభివృద్ధి కార్యక్రమాలకు ఖచ్చితమైన గణాంకాలు లభిస్తాయని కలెక్టర్ వివరించారు. ప్రజలు అందించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంటుందని, ఎలాంటి వ్యక్తిగత వివరాలు బహిర్గతం చేయబడవని స్పష్టం చేశారు. జిల్లాలో ఈ కార్యక్రమం కోసం సిబ్బందిని నియమించి, వారికి రెండు దఫాలుగా శిక్షణ పూర్తి చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ప్రింట్, ఎలక్ట్రానిక్ మరియు సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం జరుగుతుందని, మరింత అవగాహన కల్పించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని చెప్పారు. ప్రతి కుటుంబం తప్పనిసరిగా స్వీయ గణనలో పాల్గొని, దేశ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కలెక్టర్ మను చౌదరి విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణలో సెన్సస్ - 2027 స్వీయ గణనకు శ్రీకారం

- స్వీయ గణన పూర్తి చేసిన గవర్నర్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**ఖైరతాబాద్, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సెన్సస్––2027 కార్యక్రమంలో భాగంగా స్వీయ గణన సౌకర్యాన్ని తెలంగాణలో ఆదివారం ఘనంగా ప్రారంభించారు. రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా స్వయంగా తన గణన పూర్తి చేసి కార్యక్ర మాన్ని అధికారికంగా ప్రారంభించారు. సాంకేతికత ఆధారంగా చేపడుతున్న ఈ స్వీయ గణన విధా నం ద్వారా ప్రజలు తమ కుటుంబ సభ్యుల వివ రాలు, విద్య, ఉపాధి, నివాస పరిస్థితులు వంటి కీలక సమాచారాన్ని సులభంగా నమోదు చేసుకు నే వీలుంటుందని అధికారులు తెలిపారు. ఈ విధా నం వల్ల గణాంకాల సేకరణలో వేగం పెరగడంతో పాటు ఖచ్చితత్వం కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. గవర్నర్ మాట్లాడుతూ.. దేశ అభి వృద్ధి ప్రణాళికలు, సంక్షేమ పథకాల అమలు కోసం సరైన గణాంకాలు ఎంతో అవసరమని, అందుకు ప్రతి పౌరుడు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి స్వీయ గణనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాల వరకు ప్రతి కుటుంబం తప్పనిసరిగా తమ వివరాలను నమో దు చేసుకోవాలని సూచించారు. ఇదే రోజు మధ్యా హ్నం కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కూడా తన స్వీయ గణనను పూర్తి చేసి ప్రజలకు ఆదర్శం గా నిలిచారు. ప్రజలు డిజిటల్ విధానాన్ని వినియో గించుకుని సులభంగా గణనలో పాల్గొనాలని ఆ యన సూచించారు. ఈ కార్యక్రమంలో సెన్సస్ ఆప రేషన్స్ డైరెక్టర్ భారతి హోలికేరి, ఆర్. వి. కర్ణన్ పాల్గొని స్వీయ గణన విధానంపై అధికారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. అవసరమైన చోట హెల్ప్‌డెస్క్‌లు, సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు సాంకేతిక సహాయం అందించనున్న ట్లు తెలిపారు. జిహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్. వి. కర్ణన్ మాట్లాడుతూ .. నగర ప్రజలు స్వీయ గణన లో చురుకుగా పాల్గొనడం ద్వారా నగరాభివృద్ధి ప్రణాళికలు మరింత సమర్థవంతంగా రూపొందిం చడానికి సహకరిస్తుందని చెప్పారు. పౌర సేవలు, మౌలిక వసతుల ప్రణాళికలు, ఆరోగ్యం, విద్య వం టి రంగాలలో ఖచ్చితమైన డేటా కీలకమని ఆయ న పేర్కొన్నారు. సెన్సస్––2027లో భాగంగా ఆధు నిక డిజిటల్ సదుపాయాలు, మొబైల్ యాప్‌లు, ఆన్‌లైన్ పోర్టల్‌లను వినియోగించడం ద్వారా గణ న ప్రక్రియను వేగవంతం చేయనున్నారు. అవసర మైతే ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి సహాయం అందించనున్నట్లు అధికారులు తెలిపారు. దేశ భవిష్యత్తు అభివృద్ధి దిశను నిర్ణయించే ఈ మహ త్తర కార్యక్రమంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, తమ కుటుంబ వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి దేశ నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించాలని అధికారులు పిలుపునిచ్చారు.

# విద్యతోనే ఏదైనా సాధ్యం

- జహీరాబాద్ లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం
- రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి

**న్యాల్‌కల్, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** విద్యతోనే ఏదైనా సాధించవచ్చని.. విద్యకు తోడు క్రమశిక్షణ, సాధించాలనే పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకట్ స్వామి అన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, రామతీర్థం గ్రామంలో తాజాగా డాక్టర్ భీమ్ రావ్ అంబేద్కర్ నూతన విగ్రహాన్ని ఎంపీ సురేష్ కుమార్ షట్కార్, మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, తదితరులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం సభాధ్యక్షుడు నరసింహులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సభనుద్దేశించి మంత్రి ప్రసంగిస్తూ.. వివక్ష, అంటరానితనాన్ని దూరం చేసేది కేవలం విద్య మాత్రమే అన్నారు. బడుగు, బలహీన వర్గాలు, మహిళల విద్యాభివృద్ధి కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన కృషి వర్ణనాతితమన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో యువత ఉద్యోగ, ఉపాధి సాధించి మెరుగైన సమాజం కోసం తమ వంతుగా కృషి చేయాలని సూచించారు. మహిళలకు సముచిత గౌరవం, ప్రత్యేక రిజర్వేషన్ల కోసం అంబేద్కర్ కృషి వర్ణనాతీతమన్నారు. ప్రత్యేక రిజర్వేషన్లతో ఐఏఎస్, ఐపీఎస్ లు గా విధులు నిర్వహించిన అనంతరం.. విశ్రాంతి పొందిన ఐపీఎస్, ఐఏఎస్ లు తమ వంతుగా కృషి చేయాలని కోరారు.

### జహీరాబాద్ కాంగ్రెస్‌లో గ్రూపులను పక్కన పెట్టండి

జహీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి బలమైన ఓటు బ్యాంక్ ఉన్న నియోజకవర్గమని, కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న గ్రూపులను పక్కన పెడితే జహీరాబాద్ లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. రామతీర్థం – హద్నూర్ రోడ్డును బీటిగా మార్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రోడ్డు పనులు పూర్తి చేసిన అనంతరం నేరుగా రామతీర్థం గ్రామానికి వచ్చి ప్రారంభిస్తానని ప్రకటించారు.

దేశంలో దాదాపు 140 కోట్ల ప్రజానీకం కులాలు, మతాలు, వర్గ విభేదాలు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో జీవనం



సాగిస్తున్నారంటే అది కేవలం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రూప కల్పన చేసిన రాజ్యాంగం మాత్రమే. జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి తో కలిసి రామతీర్థం – హద్నూర్ రోడ్డును మెరుగు పరిచేందుకు కృషి చేయునట్లు తెలిపారు. ఎంపీ నిధులతో గ్రామంలో త్వరలోనే వీధి దీపాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, పార్టీ ముఖ్య నేతలు గిరిధర్ రెడ్డి మమ్మద్ తన్వీర్, జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ యూనుస్, టిపిటిఎఫ్ అశోక్ కుమార్, మండల పార్టీ శ్రేణులు శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, సిద్ధి లింగయ్య స్వామి, కిరణ్ కుమార్ గౌడ్, చంద్రప్ప, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సంఘం ప్రముఖులు నర్సింలు, చంద్రయ్య, వైద్యనాథ్, దశరథ్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వాసవిమాత జయంతి



**చేవెళ్ల, ఏప్రిల్ 26 (జనంసాక్షి) :** చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో శ్రీ లక్ష్మి వేంకటేశ్వర దేవాలయంలో చేవెళ్ల మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవిమాత జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలే యాదయ్య, మున్సిపాలిటీ చేర్ పర్సన్ దేవర సమతా వెంకటరెడ్డి చేవెళ్ల గ్రామ మాజీ సర్పంచ్ కౌన్సిలర్ బండారి శైలజా ఆగిరెడ్డి, ముడిమ్యాల మాజీ సొసైటీ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంకటేశం గుప్తా దామరగిద్ద మాజీ సర్పంచ్ మధుసూధన్ గుప్తా, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పెంటయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు రాములు, కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్, ముడిమ్యాల మాజీ సర్పంచ్ ప్రభాకర్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు రమేష్, కుంచం రవి, వెంకటేశం గుప్తా, సతీష్, తాటిశెట్టి ఆనంద్, విజయ్, టేకులపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు



**హత్నూర, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** ఆరులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు లబ్ధి అందేలా కృషి చేస్తామని నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి కౌడిపల్లి మండలం దేవులపల్లి, హత్నూర్ మండలం రెడ్డి ఖానాపూర్, చందాపూర్ గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు హాజరై లబ్ధిదారులకు శు భాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలోని పలు వివాహాలకు హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించారు. పంబండ గ్రామంలో గర్భిణీ స్త్రీలకు న్యూట్రిషన్ కిట్లను నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి పంపిణీ చేశారు. పంబండ, ఉసిరికపల్లి, హంసన్‌పల్లి, వెంకటాపూర్, దేవులపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు హాజరై లబ్ధిదారులకు శు భాకాంక్షలు తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఇంటికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి మాత

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్




**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న వాసవి మాత జయంతి ఉత్సవాలను మెదక్ కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఆదివారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వాసవి మాత జయంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, మండల ఆర్యవైశ్య సంఘం నాయకుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించి వాసవి మాత చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ, జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వైశాఖ శుక్ల పక్ష దశమి నాడు వాసవి మాతా జయంతి ఉత్సవాలను రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన సందర్భంగా వాసవి మాత జయంతిని జరుపుకోవడం సంతోషదాయకమని పేర్కొన్నారు. ఆర్యవైశ్యుల కులదేవతగా వాసవి మాతకు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, ఆర్యవైశ్య సంఘం నాయకులు చంద్రపాల్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పల్లెర్ల రవీందర్, ప్రధాన కార్యదర్శి బుక్క అశోక్, కోషధికారి మరుమల్ల అశోక్ ఆర్యవైశ్య సంఘం ఉత్సవ కమిటీ చైర్మన్ రాయ కంటి నాగరాజు, ఆర్యవైశ్య సంఘం మేడం బాలకృష్ణ, రాగి అశోక్, పట్టణ కార్యదర్శి బచ్చు పార్థివనాథ్, ఉప్పల శ్రీకాంత్, కోవురి శ్రీనివాస్, షిర్నా రాజేశ్వర్, ఆర్యవైశ్య సంఘం నాయకులు చంద్రపాల్, వుట్కూరి వీరేశం, కౌన్సిలర్ శివరామకృష్ణ , కొండా శ్రీనివాస్, పురం వెంకట నారాయణ కొమ్మ వెంకటేష్, బజ్జూరి బిక్షపతి, మురళి, పొగాకు రామకృష్ణ వనజ, సుష్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీ కార్యాలయంలో ఘనంగా వాసవి మాత జయంతి



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతి సంవత్సరం వైశాఖ శుక్ల పక్ష దశమి రోజున వాసవి మాత జయంతి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహిం చాలని నిర్ణయించిన నేప థ్యంలో శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆర్ఐ విజయ్ భాస్కర్ ఆధ్వర్యం లో వాసవి మాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో అధికారులు, సిబ్బంది పాల్గొని వాసవి మాత చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆమె బోధనలు స్ఫూర్తిదాయక జీవన విధానాన్ని స్మరించుకు న్నారు. ఈ సందర్భంగా ఆర్ఐ విజయభాస్కర్ మాట్లాడు తూవాసవి మాత అహింసా సిద్ధాంతం, సామరస్యభావం, సమాజంలో సమానత్వం వంటి మహోన్నత విలువల ను ప్రబోధించిన మహనీయు రాలని తెలిపారు. ఆమె చూపిన మార్గం సమాజానికి ఆదర్శమని, ప్రతి ఒక్కరూ ఆమె బోధనలను తమ దైనందిన జీవితంలో ఆచరిం చాలని సూచించారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృ త్వం నెలకొల్పడంలో వాసవి మాత ఆలోచనలు ఎంతో ప్రాముఖ్యత కలిగినవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్ఎస్ఐలు శివశంకర్, శిరీష, ఆర్మ్డు రిజర్వ్ పోలీ స్ సిబ్బంది పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
27 ఏప్రిల్ 2026

# స్వీయ గణనను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

- **జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**




**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 26 (జనంసాక్షి) :** జన గణన ప్రక్రియలో భాగంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, జిల్లా ఎస్పి డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, స్వీయ నమోదు చేసుకున్నారు. జన గణనలో ఎవరికి వారు స్వయంగా వివరాలు నమోదు చేసుకునేలా అందుబాటులోకి తెచ్చిన ఆన్‌లైన్ వెబ్ సైట్ https://se.census.gov.in ద్వారా తన వివరాలను నమోదు చేసుకున్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలో జనగణన 2027 కార్యక్రమానికి సంబంధించి స్వీయ గణన ప్రక్రియను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మరియు జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు తమ గణన వివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని కలెక్టర్ తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్, ఎస్పీలు తమ వ్యక్తిగత గణన వివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా నూతన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ జనగణన వంటి కీలక ప్రక్రియలో ప్రతి పౌరుడు బాధ్యతగా పాల్గొనాలని, ఖచ్చితమైన సమాచారం అందించడం ద్వారా ప్రభుత్వానికి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడంలో సహకరించాలని పిలుపునిచ్చారు. జన గణన ప్రక్రియను సులభంగా, సమగ్రంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం డిజిటల్ స్వీయ గణన (డిజిటల్ సెల్ఫ్ -ఎన్యూమరేషన్) విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. ఆన్లైన్ ద్వారా ప్రజలు తమ వ్యక్తిగత, కుటుంబ వివరాలను వెబ్ పోర్టల్ లో కానీ, మొబైల్ యాప్ ద్వారా స్వయంగా నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించారని కలెక్టర్ తెలిపారు. ఈ స్వీయ గణన కార్యక్రమం నేటి ఆదివారం నుండి మే 10వ తేదీ వరకు కొనసాగుతుందని కలెక్టర్ చెప్పారు. ఈ కాలంలో జిల్లాలోని ప్రతి కుటుంబం తమ వివరాలను సమగ్రంగా నమోదు చేసుకోవాల్సిందిగా అధికారులు సూచించారు. ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న వారు స్వయంగా వివరాలు నమోదు చేసుకోవచ్చని, అవసరమైన వారికి గ్రామ, వార్డు స్థాయిలో సహాయం అందుబాటులో ఉంటుందని, జిల్లాలో ఎవరూ ఈ అవకాశాన్ని వదులుకోకుండా ముందుకు వచ్చి పాల్గొనాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ప్రత్యేకంగా కోరారు. జనగణన ప్రక్రియలో సాంకేతికతను వినియోగించి సమగ్రతను పెంచడం, ప్రతి పౌరుడి వివరాలు జన గణనలో చేరేలా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన డిజిటల్ స్వీయ గణన ప్రక్రియను జిల్లాలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఖచ్చితమైన జనగణన డేటా ఆధారంగా భవిష్యత్తులో సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, వనరుల పంపిణీ వంటి అంశాలు మరింత సమర్థవంతంగా అమలు చేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ ప్రతి పౌరుడి వివరాలు జన గణనలో చేరేలా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన డిజిటల్ స్వీయ గణన ప్రక్రియను జిల్లాలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు తమ వివరాలను నిజాయితీగా నమోదు చేయాలని సూచించారు. వ్యక్తిగత సమాచారం భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని, ప్రజల సహకారం అత్యంత అవసరమని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మరియు జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ స్వీయ గణనను పూర్తి చేసుకున్నట్లు సూచించే అవగాహన గోడపత్రికను ఆదివారం ఆవిష్కరించారు. ఈ గోడపత్రిక ద్వారా స్వీయ గణన ప్రక్రియ పూర్తి చేసిన కుటుంబాలు తమ ఇళ్ల వద్ద అతికించుకునే విధంగా రూపొందించారు. దీని ద్వారా ఇతరులకు కూడా ఈ కార్యక్రమంపై అవగాహన కలుగుతుందని, ఇంకా నమోదు చేయని వారు ప్రోత్సాహం పొందుతారని వారు తెలిపారు.

## అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ

- **ఎమ్మెల్యే మేఘా రెడ్డి సహకారంతో జర్నలిస్టులకు న్యాయం**
- **టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షులు మాధవ రావు**



**వనపర్తి, ఏప్రిల్ 26 (జనంసాక్షి) :** వనపర్తి ఎమ్మెల్యే తూడీ మేఘా రెడ్డి, సహకారంతో వనపర్తి జిల్లాలోని అర్హులైన జర్నలిస్టులకు అక్రిటేషన్ కార్డుల విషయంలో న్యాయం జరుగుతుందని, టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షులు. డీ. మాధవ రావు పేర్కొన్నారు. ఆదివారం నాడు పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామంలో ఎమ్మెల్యే పిఆర్ఓ, గోపాల్ అన్నకుమారుని,వివాహ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మేఘా రెడ్డి, వివాహ కార్యక్రమంలో పాల్గొన్న జర్నలిస్టులతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వనపర్తి జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు అక్రిటేషన్ కార్డులు వచ్చేలా చూడాలని యూనియన్ జిల్లా అధ్యక్షులు మాధవ రావు ఎమ్మెల్యే.మేఘా రెడ్డి ని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఆయన అర్హులైన జర్నలిస్టులకు అక్రిటేషన్ కార్డులు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు మాధవరావు తెలిపారు.

## అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్లు



**వీపనగండ్ల, ఏప్రిల్ 27 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల పరిధిలోని కల్వరాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు,తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కుమారుడు జూపల్లి అరుణ్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా తడకల కవిత,అలివేల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి అర్హత పత్రాలు అందజేశారు. కల్వరాల గ్రామంలో మొత్తం 25 మంది అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైనట్లు తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో కొల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాలు చాలా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతాయని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా గ్రంథాలయ చైర్మన్ లంకల గోవర్ధన్, జిల్లా పర్యాటక అధికారి కల్వరాల నరసింహ,గ్రామ సర్పంచ్ బండారు రాముడు,ఉపసర్పంచ్ తడకల రంగమ్మ, మండల హౌసింగ్ ఏఈ,గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజు,గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

- **లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు..**
- **పలువురికి గాయాలు**



**ఇటిక్యాల, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** 44వ నెంబర్ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున లారీని బస్సు ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలైన సంఘటన జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం మునగాల శివారులో చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్ఐ రవి రాథోడ్ తెలిపిన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పీలేరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ ట్రావెల్స్ బస్సు ముందుగా వెళ తున్న లారీని ఓవర్టేక్ చేయబోయి బస్సు బ్రేక్ ఫెయిల్ కావడంతో బస్సు కంట్రోల్ తప్పి లారీని వెనుక నుంచి ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిపారు. ఈ ప్రమాద సమయంలో బస్సులు 35 ప్రయాణికులు ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను బస్సులో నుంచి బయటకు తీశారు. ఈ ప్రమాదంలో సాయి శ్రీజ, అంజలి తో పాటుగా ఫాయిజా, హైజా ఇద్దరు చిన్న పిల్లలకు, ఆరు మందికి తీవ్ర గాయాలు కాగా ఒకరికి కాలు విరిగిందన్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ క్యాబిన్ భాగం పూర్తిగా దెబ్బ తిన్నది. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందన్నారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అతివేగమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని బాధితులు, పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసే దర్యాప్తు చేస్తున్నట్లు ఇటిక్యాల ఎస్ఐ రవి రాథోడ్ తెలిపారు.

## జీనియస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సప్తరంగ్ 2026

- **ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శనలు**



**సదాశివపేట, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** జీనియస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సప్తరంగ్-2026 వార్షికోత్సవం స్థానిక బసవ సేవా సదన్‌లో అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి కొండాపూర్ మండల విద్యాధికారి డా. సి. దశరథ్, మర్పల్లి మండల విద్యాధికారి అశోక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడుతూ, జీనియస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అకాడమిక్ పరంగా విశిష్ట ప్రతిభ కనబరుస్తూ, నాణ్యమైన విద్యను అందిస్తున్నదని ప్రశంసించారు. పాఠశాల విద్యతో పాటు సహపాఠ్య కార్యక్రమాలపై కూడా సమగ్ర శిక్షణ అందిస్తున్నదని పేర్కొన్నారు. అశోక్ మాట్లాడుతూ, ఐఐటీ-జేఈఈ, నీట్ పరీక్షల కోసం ఫౌండేషన్ కోర్సులు అందించడం అభినందనీయమని అన్నారు. అలాగే, పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ విద్య అందించడం, రాష్ట్ర స్థాయి ఎక్సలెన్స్ అవార్డులు సాధించడం విశేషమని కొనియాడారు. కార్యక్రమంలో అతిథులు అపెక్స్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని నిర్వహించి పట్టాలు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకోగా, వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ముద్ద శశికళ నాగనాథ్, వైస్ చైర్మన్ కూచి శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ పోల వెంకటేశం, కరస్పాండెంట్ రఘువర్ధన్ రెడ్డి, డైరెక్టర్ అమరేందర్ రెడ్డి, ప్రిన్సిపల్ ప్రీతి, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు

- **టీజీఐసీ కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ప్రత్యేక పూజలు**



**సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** వాసవి కన్యక పరమేశ్వరి శాంతిని పురస్కరించుకొని సంగారెడ్డి పట్టణంలో ఘనంగా వాసవి కన్యకా పరమేశ్వరి వేడుకలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా అమ్మవారికి పట్టు సమర్పించి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి మహా సంస్థాన్ చైర్మన్ తోపాజి అనంత కిషన్ , ఆదివారం ప్రభుత్వ అతిథి గృహం వద్ద జెండా ఊపి బైక్ ర్యాలీ ప్రారంభించారు. కొత్త బస్టాండ్ కలెక్టరేట్ మీదుగా పాత బస్టాండ్ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. జై వాసవి జై జై వాసవి.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు అనంతరం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు, లలిత సహస్ర పారాయణం చదివారు. అనంతరం అమ్మవారి పల్లకి సేవా కార్యక్రమాన్ని జరిపించారు. కలెక్టరేట్‌లో వాసవి జయంతి రాష్ట్ర ప్రభుత్వం వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని అధికారికంగా ప్రకటించడంతో కలెక్టర్ కార్యాలయంలో జయంతి వేడుకలు నిర్వహించారు. వాసవి మాత చిత్రపటానికి పూలమాలవేసి ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్ కార్యాలయం సూపరింటెండ్ విజయలక్ష్మి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొంపల్లి విద్యాసాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పూర్ణచందర్, కార్యదర్శి నామా భాస్కర్, వాసవి మహా సంస్థాన్ కోశాధికారి జూలకంటి మల్లేశం, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ పుల్లూరి ప్రకాష్, చందా శ్రీధర్ ఇరుకుల ప్రదీప్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మ్యాడం రాధా కిషన్, జూలకంటి బుచ్చిలింగం పాల్గొన్నారు.

## ఆకునూరులో క్షుద్రపూజల కలకలం

- **మంత్రాల పేరుతో అర్ధరాత్రి హల్ చల్**
- **రైతును చూసి పరుగులు తీసిన దుండగులు**



**చేర్యాల, ఏప్రిల్ 26 (జనంసాక్షి) :** సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో క్షుద్ర పూజలు కలకలం లేపుతున్నాయి. గ్రామంలోని 1,2వ వార్డు పరిధిలో బతుకమ్మ ఆడే ప్రధాన చౌరస్తా వద్ద గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి క్షుద్ర పూజలు నిర్వహించారు. పసుపు, పిండి, పువ్వులు బొగ్గులు పెట్టి పూజలు చేశారు. ఓ రైతు అర్ధరాత్రి వ్యవసాయ పొలం వద్ద కరెంటు మోటార్ పెట్టి ఇంటికి వస్తుండగా అతన్ని చూసి పరుగులు తీశారు. ప్రజలు రాత్రి వేళల్లో బయటకు వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. స్థానిక పోలీస్ శాఖ అధికారులు గ్రామంపై దృష్టి పెట్టి రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించి దుండగులను పట్టుకుని శిక్షించాలని, కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



**పెద్దశంకరంపేట, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** వాసవి మాత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ నిర్ణయం తీసుకున్న తెలంగాణా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆర్య వైశ్య సంఘము ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య సంఘం భవనంలో వాసవి మాత జయంతి సందర్భంగా వాసవి మాత చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వాసవి మాత జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడం ఎంతో ఆనందదాయకమన్నారు. ఈ నిర్ణయం సమాజంలోని అన్ని వర్గాలకు సంతోషాన్ని కలిగించేలా ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ చార్య అభినందనీయమన్నారు.. సీఎం రేవంత్ రెడ్డితో పాటు నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డికి ఆర్యవైశ్య సంఘం పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కందుకూరు రవీందర్, గౌరవ అధ్యక్షులు దాదిగారి గంగాధర్, సభ్యులు గడ్డమ్ మల్లన్న, దాచ సంగమేశ్వర్ రాఘవులు, పబ్బ శ్రీనివాస్, రవీందర్ రఘు, సంగమేశ్వర్, నందు, రమేష్, అమర్, నరేష్ తదితరులున్నారు.

## స్కాలర్స్ కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే




**వనపర్తి బ్యూరో, ఏప్రిల్ 26 (జనంసాక్షి) :** వనపర్తి పట్టణంలోని స్కాలర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి విద్యార్థులను శాలువతో సత్కరించి అభినందించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో స్కాలర్ కళాశాల విద్యార్థులు ద్వితీయ సంవత్సర బైపీసీ లో బి.మహాలక్ష్మి, ఆలీషా జి, సుస్మిత, భార్గవి, ఎంపీసీ లో కే.నర్మదా, కే.శిరీష, కే. లలిత, ప్రథమ సంవత్సరం బైపీసీలో డి పల్లవి, అప్సిన్, బి. అక్షయ లక్ష్మి, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఏ. బన్నీ రాష్ట్రస్థాయి మార్కులు సాధించారు. ఈ ఫలితాలను సాధించిన విద్యార్థులను మరియు వీరిని ప్రోత్సహించిన అధ్యాపకులను, విద్యార్థుల తల్లిదండ్రులను ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ బి శ్రీనివాస్ గౌడ్ , మున్సిపల్ వైస్ చైర్మన్ మధు గౌడ్, కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మశుద్ధి, పవిత్ర సంకల్పం కోసమే హజ్ యాత్ర

- **హజ్ యాత్రికులను ఘనంగా సన్మానించిన మాజీ మంత్రి**



**వనపర్తి రూరల్, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** మైనారిటీ అధ్యక్షులు జోహెబ్ హుస్సేన్ ఆధ్వర్యములో ఆదివారం జరిగిన హజ్ యాత్రికుల అభినందన సభలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొని హజ్ యాత్రికులను ఘనంగా సన్మానించారు. హజ్ యాత్ర చేస్తున్న ఇంతియాజ్, గూడు.మహమూద్, అజీమ్, అబూ బకర్, అనీస్, సలీం, మతీన్, ఫరూక్, అజీజ్ ఖాన్, మాలిక్ ఖాన్, ఫైజాన్, మహమూద్, అజ్మత్ మరియు కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మశుద్ధి మరియు పవిత్ర జీవిత సంకల్పం కోసమే ముస్లిం సోదరులు హజ్ యాత్ర చేస్తారని అన్నారు. హజ్ యాత్రతో శక్తివంతమైన ఆత్మస్థైర్యం కలిగి లోక కళ్యాణం కోసం కృషి చేస్తారని పవిత్ర లక్ష్యంతో సాగే యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. రాబోవు రోజులలో తెలంగాణలో సుపరిపాలన రావాలని అల్లాను ప్రార్థించాలని ఆకాంక్షించారు. హజ్ యాత్రికులకు సన్మానం, విందు ఏర్పాటు చేసిన జోహెబ్ హుస్సేన్ ను అభినందించారు. ఈ కార్యక్రమములో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్, కౌన్సిలర్.శ్రీకర్ గౌడ్, బండారు.కృష్ణ, సమద్, స్టార్.రహీమ్, యూసుఫ్, డ్యానియల్, హారీఫ్, ఏ.కె.పాషా, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

- **కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహారాజ్**




**పెద్దశంకరంపేట, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహారాజ్ అన్నారు. ఆదివారం పెద్ద శంకరంపేట లోని తిరుమలాపూర్ జ్యోతిర్లింగాల దేవాలయంలో నిర్వహించిన హిందూ సమ్మేళనం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. హిందూ సమ్మేళనం సందర్భంగా పేటలోని రామాలయం నుండి పట్టణ పురవీధుల గుండా యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సంగ్రామ్ మహారాజ్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలు కాపాడేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి అన్నారు. ఆర్ఎస్ఎస్ మెదక్ విభాగ్ సహా కార్యవాహ బి నర్సింలు మాట్లాడుతూ హిందూ సంఘటన ధ్యేయంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కృషి చేస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ ప్రారంభమై 100 సంవత్సరాలు పూర్తయిందని శతాబ్ది ఉత్సవాలలో భాగంగా దేశవ్యాప్తంగా హిందూ సమ్మేళన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలలో యువకులలో దేశభక్తి క్రమశిక్షణ సేవాభావం నిర్మాణం చేసేందుకు ఆర్ఎస్ఎస్ నిరంతరం పాటుపడుతుందన్నారు. ప్రపంచంలో భారతదేశ విశ్వ గురువు స్థానాన్ని సాధించేలా ప్రతి ఒక్కరు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అల్లాదుర్గం తపస్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు గురు చరణం హిందూ సమ్మేళన సమితి అధ్యక్షులు డి నవీన్ కుమార్. ఆర్ఎస్ఎస్ హిందూ సంఘాల బాధ్యులు సీతారామారావు జైహింద్ రెడ్డి వీరప్ప సతీష్ గౌడ్ సర్వేశ్వర్ రవివర్మ అధిక సంఖ్యలో యువకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఫర్టిలైజర్ షాపులు బంద్ పాటించాలి

- రాష్ట్ర ఉపాధ్యక్షులు పొలం సత్యనారాయణరెడ్డి




**వరంగల్ ఈస్ట్, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** ది వరంగల్ డిస్ట్రిక్ట్ ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్,డీలర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శివనగర్‌లోని అసోసియేషన్ భవనంలో జరిగిన సమావేశంలో అల్ ఇండియా, తెలంగాణా రాష్ట్ర అసోసియేషన్ ఇచ్చిన బంద్‌కు మద్దతుగా వరంగల్, హనుమకొండ జిల్లా లోని ఫర్టిలైజర్ షాపులు స్వచ్చందంగా బంద్ పాటించాలని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొలం సత్యనారాయణ రెడ్డి డీలర్లను కోరారు.ఎరువుల సరఫరా విషయంలో పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రెస్ మీట్ జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు పల్లె రాజేందర్ రెడ్డి, గాయపు రాంచంద్రారెడ్డి,జిల్లా కోశాధికారి బి.యన్. రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ లాహోటి,అచ్చ పరమేశ్వర్,కల్చరల్ సెక్రటరీలు దేసు ప్రవీణ్, ముక్కెర యతీష్, జాయింట్ సెక్రెటరీ గోమాత సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

# రైతులకు న్యాయం చేయండి

- మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్



**గూడూరు, ఏప్రిల్ 26 (జనంసాక్షి) :** మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నెట్టేట ముంచిందని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు.ఆదివారం గూడూరు మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సందర్శించినారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ రైతే రాజు, రైతే వెన్నముఖ అన్న భారత దేశానికి రైతులు అరుగాలం ఎంతో కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకు వస్తే 18 రోజులుగా కల్లాల్లోనే, హమాలీలా కొరతతో, కంటాలు పెట్టక,గన్ని సంచులు, సరైన సెంటర్ లు లేక అన్నం పెట్టె రైతులను ఇబ్బందులు గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే,ఎంపీ, అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలని అన్నారు. అమాయక ప్రజలను మోసం చేసి,ధనాన్ని దోచుకుంటున్నారని, తెలంగాణ ప్రజలందరూ మీరు చేసే అన్యాయాలను చూస్తున్నారని, రాబోయే రోజులల్లో ప్రజలే తగిన బుద్ధి చెపుతారని రేవంత్ సర్కార్ ను హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జలగం సంపత్ రావు, వాంకుడోత్ కటార్ సింగ్, చీదురు వెంకన్న,ఎండీ రహీం,భూక్య సురేష్ నాయక్, అరె వీరన్న, బోడ ఎల్లయ్య,నూకల అశోక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన భవేశ్ మిశ్రా



**నిర్మల్ బ్యూరో, ఏప్రిల్26 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్‌గా భవేశ్ మిశ్రా ఆదివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ముందుగా జిల్లాకు చేరుకున్న నూతన కలెక్టర్‌కు పూర్వపు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్‌లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు. ఈకార్యక్రమం లో ఆర్డీవో రత్నకళ్యాణి, జిల్లా అధికారులు జీవరత్నం, డా. రాజేందర్, శ్రీనివాస్, నరసింహ రెడ్డి, దయానంద్, భోజన్న, సుధాకర్, విజయలక్ష్మి, రమణ, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# స్వీయగణన ద్వారా జనగణన వేగవంతం




- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 26(జనంసాక్షి) :** జనగణన-2027లో భాగంగా స్వీయ గణన ప్రక్రియ నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జన గణనను 2 విడతలుగా నిర్వహించడం జరుగుతుందని, మొదటి విడతలో మే 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు ఇండ్ల గణన, 2వ విడతలో జనగణన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. డిజిటల్ సాంకేతికతను ఉపయోగించి నాణ్యమైన, స్పష్టమైన జాబితా రూపొందించడం జరుగుతుందని, ఇందు కొరకు ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు తగు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. స్వీయ గణన కార్యక్రమం నిర్వహణలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రముఖ వ్యక్తులు, గణన అధికారులు, యువత, స్వయం సహాయక సంఘాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు స్వీయ గణన పోర్టల్ అందుబాటులో ఉంటుందని, జిల్లా స్థాయి జనగణన అధికారులు ప్రతిరోజు స్వీయ గణన వివరాలను ధ్రువీకరించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో స్వీయ గణనపై ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు స్వీయ గణన కార్యక్రమ కార్యచరణను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు జనాభా ప్రాతిపదికన చేపట్టడం జరుగుతుందని, ఈ క్రమంలో స్పష్టమైన జాబితా రూపొందించేందుకు జిల్లా ప్రజలు సహకరించాలని తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు ఆన్ లైన్ లో ష్ట్రిజూం://ఎ.ఏవఅంబం.ప్రశీజ.అఅ వెబ్ సైట్ ద్వారా స్వీయ గణన చేసుకోవచ్చని, జనగణలో భాగంగా అధికారులు ఇంటికి వచ్చినప్పుడు స్వీయ గణన ఐ.డి. అందించవచ్చని తెలిపారు. జన గణన కొరకు అధికారులు వచ్చిన సమయంలో ప్రజలు వాస్తవ సమాచారాన్ని అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయ సిబ్బంది, మాస్టర్ ట్రైనర్లు, ఫీల్డ్ ట్రైనర్లు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలు లేక రైతుల ఇబ్బందులు

- పనికర గుట్ట వద్ద మక్కజొన్న కుప్పలు వర్ష భయంతో రైతుల ఆందోళన
- చివరి గింజ వరకు వెంటనే కొనుగోలు చేయాలి
- తెలంగాణ రాష్ట్ర మాజీ పంచాయతీ రాజ్ శాఖ ట్రిబ్యునల్ మెంబర్ గటిక అజయ్ కుమార్ డిమాండ్



**నెక్కొండ, ఏప్రిల్ 26 (జనం సాక్షి):** నెక్కొండ మండలం కేంద్రంలోని పనికర గ్రామానికి చెందిన గుట్ట వద్ద మక్కజొన్న రైతులు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు రోజులు తరబడి పడిగాపులు కాస్తున్నారు. మక్కజొన్న నిల్వ కేంద్రాల వద్ద పరిస్థితిని పరిశీలించేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ శాఖ మాజీ ట్రిబ్యునల్ సభ్యుడు గటిక అజయ్ కుమార్ మాట్లాడుతూ ముందుచూపు లేని రాష్ట్ర ప్రభుత్వం మక్కజొన్న రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు. గోదాముల నిల్వ సామర్థ్యం, ముందస్తు ప్రణాళికలపై స్పష్టత లేకుండా రైతుల వద్ద చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని చెప్పి, ఇప్పుడు చేతులు ఎత్తేసి చూస్తోందని ఆరోపించారు.గత ప్రభుత్వం రైతులకు నష్టం కలగకుండా అలంకానిపేట, దీక్షకుంట్ల, చంద్రుగొండ, ముదిగొండ ప్రాంతాల్లో మరిన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. ప్రస్తుతం నెక్కొండ మార్కెట్‌లో కాంటాలు జరగకపోవడంతో ధాన్యం పేరుకుపోయిందని తెలిపారు.పనికర నుంచి నెక్కొండ రైల్వే స్టేషన్ వరకు, గూడూరు అడ్డరోడ్డు నుంచి సూరిపల్లి వరకు మక్కజొన్నతో నిండిన ట్రాక్టర్లు రోడ్లపై నిలిచిపోయి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ట్రాఫిక్ క్లియర్ చేయాలనే పేరుతో రైతుల ట్రాక్టర్లను బలవంతంగా పనికర గుట్ట పక్కన ఉన్న గుంతల మయం అయిన భూమిలో మక్కజొన్న దింపించడం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వాతావరణ శాఖ 27, 28 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరిస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఒకవేళ భారీ వర్షం పడితే గుట్ట నుంచి వచ్చే వరద నీటితో మక్కజొన్న పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు.ఈ పరిస్థితిని అత్యవసరంగా పరిగణించి పనికర గుట్ట వద్ద ఉన్నమక్కజొన్నను వెంటనే కొనుగోలు చేసి, కాంటాలు జరిపి రైతులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరపున జిల్లా కలెక్టర్ ను,మార్కుపేడ్ అధికారులను డిమాండ్ చేశారు. రైతులకు నష్టం జరిగితే పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని గటిక అజయ్ కుమార్ హెచ్చరించారు.

**కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి : మండల పార్టీ అధ్యక్షులు సంగని సూరయ్య**

నెక్కొండ మండలంలో మక్కజొన్న రైతుల సమస్యలపై మండల పార్టీ అధ్యక్షులు సంగని సూరయ్య తీవ్రంగా హెచ్చరించారు ఈ సందర్భంగా అయన మాట్లాడుతు రైతుల వద్ద ఉన్న మక్కజొన్నను చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు.రైతులకు ఏ విధమైన నష్టం జరిగినా బి ఆర్ ఎస్ పార్టీ తరపున ఊరుకునేది లేదని హెచ్చరించారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో రైతులతో కలిసి ధర్నాలు, రాస్తారోకాలు చేపట్టాల్సి వస్తుందని సంగని సూరయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో మండల ప్రధాన కార్యదర్శి తాటిపల్లి శివకుమార్, మాజీ సర్పంచ్ బొల్లెబోయిన విరస్వామి, మాజీ ఉపసర్పంచ్ దేవానబోయిన విరభద్రం,బక్కి కుమారస్వామి,ఈదునూరి వెంకన్న, దుగ్యల శ్రీనివాస్,చిలుపూరి వెంకన్న, చిలుపూరి ప్రశాంత్,తిప్పని సుభాష్, చెట్టబోయిన అభి,ధనుంజయ్, వీరన్న రైతులు పాల్గొన్నారు.

# జనగణన-2027లో స్వీయ గణనకు నేటి నుండి అవకాశం

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా




**జనగామ ప్రతినిధి,ఏప్రిల్ 26(జనంసాక్షి):** జిల్లాలో జనగణన--2027 కార్యక్రమంలో భాగంగా స్వీయ గణన ప్రక్రియకు నేటి నుండి అవకాశం కల్పించిన్నట్లు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ కుటుంబ వివరాలను స్వయంగా ఆన్లైన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. జనగణన-2027లో భాగంగా ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు నిర్వహించనున్న స్వీయ గణనపై... ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ప్రతినిధులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పీపీటీ) ద్వారా స్వీయ గణన నమోదు ప్రక్రియ పైన మీడియా ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'స్వీయ గణన ప్రక్రియ నేటి నుండి 10 మే 2026 వరకు అందుబాటులో ఉంటుందని... ఈ కాలంలో ప్రజలు తమ ఇంటి వివరాలు, కుటుంబ సభ్యుల సమాచారం, సౌకర్యాలు మొదలైన అంశాలను అధికారిక వెబ్ పోర్టల్ ద్వారా సులభంగా నమోదు చేయవచ్చన్నారు. ఈసారి జనగణనలో మొదటిసారిగా స్వీయ గణనను ప్రవేశపెట్టడం జరిగిందని, ఇది దేశాన్ని డిజిటల్ దిశగా తీసుకెళ్లే ముఖ్యమైన అడుగు అని తెలిపారు. స్వీయ గణన ముఖ్యాంశాలు: స్వీయ గణన ద్వారా కుటుంబాలు తమ వివరాలను స్వయంగా ఆన్లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం కల్పించబడింది. ఈ ప్రక్రియ సురక్షితమైన వెబ్ పోర్టల్ ద్వారా మొబైల్ నంబర్, ఓటీపీ ఆధారంగా జరుగుతుంది. గృహస్థులు తమ నివాస స్థలాన్ని ఎంపిక చేసి డిజిటల్ మ్యాప్‌లో ఖచ్చితంగా గుర్తించాలి. అడిగే ప్రశ్నలు సులభంగా అర్థమయ్యే విధంగా ఉండి, అవసరమైన సహాయం కోసం ఖీూుం మరియు టూల్ టిప్స్ అందుబాటులో ఉంటాయి. వివరాలు పూర్తిగా నమోదు చేసిన తరువాత ప్రత్యేకమైన సెల్ఫ్ ఎన్యమరేషన్ ఐడీ ఎస్ఎంఎస్ లేదా ఈ మెయిల్ ద్వారా అందుతుంది. స్వీయ గణన చేసినప్పటికీ ఎన్యూమరేటర్ గృహ సందర్శన తప్పనిసరి. ఎన్యూమరేటర్ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడీ ను సేకరించి, వివరాలను పరిశీలించి, అవసరమైతే సవరణలు చేసి ఫైనల్‌గా సమర్పిస్తారు. హెచ్ఎల్‌వో యాప్ ద్వారా డేటా ధృవీకరణ జరుగుతుంది. సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐడీ చేయని కుటుంబాల వివరాలను ఎన్యూమరేటర్ స్వయంగా నమోదు చేస్తారు. ప్రజలు పాటించాల్సిన ముఖ్య సూచనలు: మీరు ప్రస్తుతం నివసిస్తున్న ప్రదేశంలోనే మీ వివరాలను నమోదు చేయాలి. లొకేషన్ మ్యాపింగ్‌ను ఖచ్చితంగా చేయాలి. ఒక మొబైల్ నంబర్‌తో ఒకే కుటుంబం నమోదు చేయాలి. ఫైనల్ సబ్మిట్ చేసే ముందు వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలి. తప్పు లొకేషన్ లేదా తప్పు సమాచారం ఇచ్చినట్లయితే డేటా సరిపోలకపోవచ్చు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్.. ఎం. రామరాజు... స్వీయ గణన విధానాన్ని వివరించారు. పోర్టల్‌లో లాగిన్ అయి ఓటీపీ ద్వారా ధృవీకరణ పూర్తి చేసి, నివాస స్థలాన్ని మ్యాప్‌లో సరిగ్గా గుర్తించి, కుటుంబానికి సంబంధించిన అన్ని వివరాలను నమోదు చేయాలని తెలిపారు. సమర్పణ అనంతరం లభించేఎన్యూమరేషన్ ఐడీని భద్రపరచుకోవాలని సూచించారు. ప్రజలు స్వయంగా తమ వివరాలు నమోదు చేయడం ద్వారా ఖచ్చితమైన జనగణన సాధ్యమవుతుందని..... ప్రతి కుటుంబం తప్పకుండా స్వీయ గణనలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమం లో సీపీవో చిన్న కోట్య నాయక్, ప్రింట్ ఎలెక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు ఢీకొని రైతు మృతి



**రేగొండ, ఏప్రిల్ 25 (జనంసాక్షి):** ఆర్టీసీ బస్సు ఢీకొని రైతు మృతి చెందిన ఘటన కొత్తపల్లిగోరి మండల పరిధిలోని పరకాల భూపాలపల్లి ప్రధాన రహదారిపై చలివాగు వద్ద జరిగింది. రేగొండ మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన సుంకరి రవీందర్ (45) ఆదివారం పరకాలలో బంధువుల పెళ్లి ఉండగా ద్విచక్ర వాహనంపై వెళ్ళాడు. పెళ్లికి హాజరై తిరిగి ఇంటికి వస్తుండగా చలివాగు వద్ద భూపాలపల్లి నుండి పరకాలకు వెళ్తున్న బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో రవీందర్ కు తీవ్ర గాయలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రామ, కుమారుడు అజయ్,కూతురు వర్షిణి ఉన్నారు..భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపల్లి గోరీ ఎస్సై సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి తెలిపారు.

**ములుగు జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన భోర్కడే హేమంత్ సహదేవరావు**



**ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 26 (జనంసాక్షి) :** ములుగు జిల్లా నూతన కలెక్టర్‌గా భోర్కడే హేమం త్ సహదేవరావు ఐఏఎస్ జిల్లా కలెక్టరేట్‌లో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుకు ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసి, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రాజ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహించాలి

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య



**స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు రైతుల సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహించాలని మాజీ తొలి ఉపముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య మాట్లాడుతూ తెలం గాణ ఉద్యమ స్పూర్తిని మరువకుండా, ప్రజలు అప్పగించిన ప్రతిపక్ష బాధ్యతను సమర్థంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ రజతోత్సవాల ముగింపు సందర్భంగా మాట్లాడుతూ, దాదాపు 14 సంవత్సరాలపాటు సాగిన ఉద్యమం, అనంతరం 10 సంవత్సరాలపాటు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించిన విషయా లను గుర్తుచేశారు. నేటి నుంచి తెలంగాణ 26వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఉద్యమకారులు, అభిమానులు మరింత చైతన్యం తో ముందుకురావాలని సూచించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు పార్టీ పునర్నిర్మా ణం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నా రు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమ లు చేయకపోతే ఎక్కడికక్కడ నిలదీయాలని, ప్రజా సమస్యలపై పోరాటాలు చేపట్టాలని స్పష్టం చేశారు.నియోజకవర్గంలో రైతుల సమస్యలపై బీఆర్ఎస్ ఎప్పటికప్పుడు పోరాటం చేస్తోందని తెలిపారు. రైతన్న కోసం నిర్వహించిన 'రాజన్న పాదయాత్ర'ను ప్రస్తావిస్తూ, వేలేరు మండల కేంద్రం నుంచి మల్లన్నగండి రిజర్వాయర్ వరకు 29 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టిన ఘటనను గుర్తుచేసుకున్నారు. ఆ రోజు రాత్రి వరకు సాగిన ఆ యాత్ర జీవితంలో మరిచిపోలేని అనుభవమ ని చెప్పారు.తెలంగాణ ఉద్యమ సమయంలో చూపిన ఐక్యతను మరోసారి ప్రదర్శిస్తూ, పార్టీ బలోపేతానికి శ్రేణులు కట్టుబడి పనిచేయాలని రాజయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రస్తుత సర్పంచులు,మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# యశోద గ్రానైట్ కంపెనీలో కార్మికుడు మృతి

- యాజమాన్యంపై కేసు నమోదు

**ఎల్కతుర్తి (జనంసాక్షి) :** ఎల్కతుర్తి మండలంలోని యశోద గ్రానైట్స్, కంపెనీ యజమాన్యంపై కేసు నమోదు చేయాలని కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు ఈ సందర్భంగా మృతువి బంధువు మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ ఘాజీపూర్‌కు చెందిన దేవేంద్ర కుమార్ వైర్ సా కటింగ్ యంత్రం మరమ్మతులు చేస్తుండగా , అది ప్రమాదవశాత్తు అతనిపై పడగా అతని తీవ్ర రక్త గాయాలు అయ్యాయి. అట్టి గాయాలతో అతను మరణించడం జరిగినది. మృతుని బంధువు దేవేందర్ ప్రతాప్ పిఎస్ కి వచ్చి ఈ ప్రమాదం యశోద గ్రానైట్స్ యాజమాన్యం, దుర్గ ఇంజనీరింగ్ వర్క్స్ యాజమాన్యం యొక్క నిర్లక్ష్యం వల్లే జరిగిందని తన పిర్యాదు చేయగా స్థానిక ఎస్సై నర్సింగరావు ఆధ్వర్యంలో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.



# బడిబాటతోనే ఉజ్వల భవిష్యత్తు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వర్ధన్నపేట, ఏప్రిల్ 26 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచి, ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా చేపట్టిన 'బడిబాట' కార్యక్రమం వరంగల్ జిల్లాలో ఉత్సాహంగా సాగుతోంది. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదివారం వర్ధన్నపేట మండలం ఇల్లందు గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద స్వయంగా పాల్గొన్నారు. ఇల్లందు గ్రామంలోని వీధుల్లో పర్యటించిన కలెక్టర్, బడి ఈడు పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరినీ తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచడమే ఈ బడిబాట ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రభుత్వ విద్యాలయాల్లో లభించే ప్రయోజనాలను ఆమె వివరించారు

**విద్యాబోధనతోపాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ**

గురుకులాల్లో నాణ్యమైన భోజన వసతి, వసతి గృహ సౌకర్యం. విద్యార్థులందరికీ ఉచితంగా యూనిఫాంల అందజేశారు. గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఎక్కువ సంఖ్యలో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అద్భుతమైన సదుపాయాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, డిబిసిడిఓ పుష్పలత, మైనారిటీ వెల్ఫేర్ అధికారి రమేష్ మరియు అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

జనంసాక్షి www.janamsakshi.org | సోమవారం 27 ఏప్రిల్ 2026

## స్వీయ గణన పూర్తి చేసిన జిల్లా కలెక్టర్



**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 26 (జనంసాక్షి) :** సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జనగణన 2027లో భాగంగా ఆదివారం స్వీయగణన ప్రక్రియను స్వయంగా పూర్తి చేసి జిల్లా ప్రజలు కూడా స్వీయ గణన చేసుకోవాలని పిలుపునిచ్చారు.ప్రతి కుటుంబం స్వీయ గణనలో పాల్గొనాలని అన్నారు.సరైన,పూర్తి వివరాలు నమోదు చేయాలని పేర్కొన్నారు.అధికారిక వెబ్ సైట్ ద్వారా సులభంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

## చదువు ప్రాధాన్యతపై విద్యార్థులు అవగాహన కలిగించాలి

- **అదనపు కలెక్టర్ నర్సింగరావు**

**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** అక్షరాస్యతలో వెనుకబడ్డ జోగులాంబ గద్వాల జిల్లాలో విద్యార్థులు తమ చుట్టుపక్కల వారికి చదువు ప్రాముఖ్యతను తెలియజేస్తూ అవగాహన కలిగించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గద్వాల పాత బస్టాండ్ నుంచి వివిధ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులతో నిర్వహించిన బడిబాట ర్యాలీని అదనపు కలెక్టర్ నర్సింగరావు ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు బడిబాట కార్యక్రమానికి సంబంధించిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. కృష్ణవేణి చౌరస్తా, రాజీవ్ మార్గం మీదుగా తిరిగి పాత బస్టాండ్ కు చేరుకున్న ర్యాలీ అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడారు. మన జిల్లా అక్షరాస్యతలో వెనుకబడిందని



పేరును మార్చేలా బడి ఈడు పిల్లలు ప్రతి ఒక్కరూ చదువుకునేలా కృషి చేయాల్సి ఉందన్నారు. విద్యార్థులు ఖాళీ సమయాల్లో చదువుకోని పెద్దలకు విద్య నేర్పించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థులు సార్వత్రిక ఎస్ఎస్సి, ఇంటర్, ఇతర ఉన్నత విద్యా కోర్సులు అభ్యసించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందన్నారు. సార్వత్రిక విద్యాసంస్థల్లో చేరే విద్యార్థులు తమ పని తాము చేసుకుంటూనే చదువుకునే వెసులుబాటు ఉందన్నారు. చదువుకుంటే ప్రతి మనిషి ఎవరిపై ఆధారపడకుండా జీవించవచ్చని, జీవితంలో ఎలాంటి సమస్యలు వచ్చినా ఎదుర్కొనే ధైర్య సాహసాలు వస్తాయన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలు, వసతి గృహాల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన సౌకర్యాన్ని కల్పిస్తుందన్నారు. అనంతరం చదువు ప్రాముఖ్యతను వివరిస్తూ అధికారులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ బాషా, ఏఎస్విడబ్ల్యూఓ నాగరాజు, ధరూరు ఎంఈఓ రవీంద్రబాబు, సెక్టోరియల్ అధికారులు మైఖేల్, ప్రసాద్, జ్యోతి, ఇతర అధికారులు, వార్డెన్లు, వివిధ వసతిగృహాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ముస్లింకు హజ్ అవకాశం రావాలి

**దేవరకొండ, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** ప్రతి ముస్లింకు జీవితంలో ఒక్కసారైనా హజ్ కు వెళ్లే అవకాశం రావాలని, హజ్ యాత్ర మనిషిలో మార్పు తీసుకొస్తుందని దేవరకొండ ఖతిబ్ ఏ ఈద్గా ముఫ్తి సయ్యద్ అంజద్ అలీ ఖాస్మి పేర్కొన్నారు. ఈద్గా కమిటీ, మదర్స మిస్బ ఉల్ ఉలుమ్ ఆధ్వర్యంలో పట్టణంలోని మదర్స లో జరిగిన లిహజ్ యాత్రికుల అవగాహన సదస్సులి లో వారు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. హజ్ యాత్ర మనిషిలో మార్పు తీసుకొస్తుందని, ఇస్లాం మతంలోని ఐదు ప్రధాన స్తంభాలలో ఒకటి అన్నారు. శారీరకంగా, ఆర్థికంగా సామర్థ్యం ఉన్న ప్రతి ముస్లిం తమ జీవితంలో ఒక్కసారైనా సౌదీ అరేబియాలోని మక్కా నగరానికి వెళ్లి, కాబాను సందర్శించి చేసే పవిత్ర యాత్ర ఇది. దేవుని (అల్లాహ్) ఆజ్ఞను పాటించడం, పాపాల నుండి విముక్తి పొందడం మరియు ఆధ్యాత్మిక ఉన్నతి కోసం ఈ యాత్ర చేస్తారన్నారు. హజ్ చేసిన వ్యక్తి అప్పుడే పుట్టిన బిడ్డలా పాపరహితుడు అవుతాడని తెలిపారు.హజ్ కు వెళ్తున్న



వారిని కలవడం,వెళ్లి వచ్చిన వారికి స్వాగతమివ్వడం పుణ్యదాయకమని తలుస్తారని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు తెల్లటి వస్త్రాలు (ఇహ్రామ్) ధరించి, జాతి, కుల, పేద-గొప్ప తేడాలు లేకుండా అందరూ ఒక్కటేనని నిరూపిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హజ్ యాత్రకు వెళ్లే వారికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం హజ్ కు వెళ్లే వారికి సన్మానించారు.దేవరకొండ ప్రాంతం సుభిక్షంగా ఉండాలని,భారతదేశ సౌభ్రాతృత్వాలతో, సుఖ సంతోషాలతో, పాడిపంటలతో, మరింత అభివృద్ధి చెందాలని అల్లా తో ప్రార్థించాలని హజ్ యాత్రకు వెళుతున్న భక్తులను కోరారు. అల్లా ఆశీస్సులతో హజ్ యాత్రను దిగ్విజయంగా పూర్తిచేసుకుని క్షేమంగా తిరిగి రావాలని దేవరకొండ యావత్తు ముస్లింలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఈద్గా కమిటీ అధ్యక్షులు సయ్యద్ అజీముద్దీన్, మదర్సా అధ్యక్షులు మహ్మద్ సాదిక్ హుస్సేన్ అలీ, మాజీ వైస్ చైర్మన్ రాహత్ అలీ, సయ్యద్ మాజీద్ మౌలానా, యండి ఇలియాస్ పటేల్, హబీబ్ మౌలానా, అలీమ్ మౌలానా, తౌఫిక్ మౌలానా, ఉమేర్ మౌలానా, షకీల్, ఖాజా మైనొద్దీన్, సయ్యద్ దస్తగిర్, న్యామత్ షా, ఇల్యాస్ బాబా, అఫ్సర్, కమాల్, అబ్రార్ ఖాసీం, ఫయాజోద్దీన్, ఉమేర్, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ పాఠశాల అవార్డు అందుకున్న బోటని బాలాజీ ఓమేగా స్కూల్



**దమ్మపేట, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** దమ్మపేట మండల కేంద్రంలోని బొటని బాలాజీ ఒమేగా స్కూలుకు 2025- 26 విద్యా సంవత్సరానికి యూనిఫైడ్ కౌన్సిల్ చే ఉత్తమ పాఠశాల అవార్డు అందుకున్నది.ఆదివారం రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి యూనిఫైడ్ కౌన్సిల్లో అధిక బంగారు పతకాలు సాధించినందుకు యూనిఫైడ్ కౌన్సిల్ దమ్మపేట బోటనీ బాలాజీ ఒమేగా స్కూల్ ఉత్తమ పాఠశాలగా గుర్తింపు తెచ్చుకున్నది.ఈ అవార్డును యూనిఫైడ్ కౌన్సిల్ ద్వారా బోటనీ బాలాజీ స్కూల్ ప్రిన్సిపల్ అనంతరావు అందుకున్నారు.ఈ శుభ సందర్భంలో స్కూల్ ప్రిన్సిపల్ అనంతరావు మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకై యూనిఫైడ్ కౌన్సిల్ వారు అందిస్తున్న ప్రోత్సాహం అమోఘమైనదని కొనియాడారు.రాబోవు కాలంలో మరిన్ని బంగారు పతకాలు సాధించి బోటనీ బాలాజీ ఒమేగా స్కూలు అగ్రస్థానంలో నిలుపుతామని అన్నారు.ఉపాధ్యాయనీ ఉపాధ్యాయుల సమిష్టి కృషితోనే ఈ విజయం సాధించగలిగామనీ తెలిపారు.

## శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా నారాయణ అమిత్



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 26 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ గా సీనియర్ ఐఏఎస్ అధికారి నారాయణ్ అమిత్ మాలంపాటి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం 542 జీవోను విడుదల చేస్తూ నారాయణ్ అమిత్ కు ఉత్తర్వులను అందజేశారు. అయితే శేరిలింగంపల్లి సర్కిల్ ఉప కమిషనర్ ఇస్లావత్ సేవియా ఈ మేరకు ఆదివారం నూతన జోనల్ కమిషనర్ ను కార్యాలయానికి సాదరంగా ఆహ్వానించి పూల బొకేలు అందించి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నారాయణ్ అమిత్ మాట్లాడుతూ శేరిలింగంపల్లి జోన్ పరిధిలో అభివృద్ధిని వేగవంతంగా చేపట్టేందుకు స్థానిక అధికారులతో కలిసి సమన్వయంగా ముందుకు సాగుతానని, శేరిలింగంపల్లి జోన్ ను మరింత ఉన్నతంగా నిలబెట్టడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన మీడియాకు వివరించారు. ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేసి తనకు సహకరించడం ద్వారా శేర్లింగంపల్లి అభివృద్ధికి బాటలు పరచాల్సిన అవసరాన్ని ఆయన ఎత్తి చూపారు.

## మురుగు కంపు కొడుతున్న వీఎం బంజర్ ఆర్టీసీ బస్టాండ్

- **దుర్గంధం వెదజల్లుతున్న బస్టాండ్ ప్రాంగణం**
- **పట్టించుకోని ఆర్టీసీ యాజమాన్యం**

**పెనుబల్లి, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** మురుగు కంపు కొడుతున్న వీఎం బంజర్ ఆర్టీసీ బస్టాండ్, పెనుబల్లి మండలం వీఎం బంజర్ బస్టాండ్ ఆవరణలో పారని డ్రైనేజీ నుండి, బహిర్గత మూత్ర విసర్జన నుండి నిత్యం దుర్గంధం వెదజల్లుతూ ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తుంది. ఈ మురుగు వాసనకు ప్రయాణికుల ముక్కుపుటాలు పగిలిపోతున్నాయి. బస్టాండ్ ఆవరణలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ పారుదల ఆగిపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయి కుళ్లిపోయి మురుగు కంపు కొడుతుంది. ఈ మురుగువాసనకు ప్రయాణికులు బస్టాండ్ ఆవరణలో ఉండలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రీయ, జాతీయ రహదారుల కూడలికి ఆనుకొని ఉన్న ఈ ఆర్టీసీ బస్టాండ్ కు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఆర్టీసీ బస్సులు అధిక సంఖ్యలో వచ్చి పోతుంటాయి. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఈ బస్టాండ్ ఆవరణ ప్రయాణికులకు మాత్రం అనుకూలంగా లేదు. బస్టాండ్ ప్రాంగణమంతా చెత్తాచెదారం పేరుకుపోయి దర్శనమిస్తుంది. సరిపడినన్ని మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడం వల్ల



ప్రయాణికులు బస్టాండ్ ప్రాంగణంలోనే మూత్ర విసర్జన చేస్తున్నారు. ఈ కంపుకు తోడు బస్టాండ్ లో ఉన్న క్యాంటీన్ లో వ్యర్థ పదార్థాలు డ్రైనేజీ గుండా పూర్తిగా బయటకుపోక పోవడంతో వ్యర్థ పదార్థాలు కుళ్లిపోయి మురుగు వాసన బస్టాండ్ ప్రాంగణమంతా వెదజల్లుతుంది. వేసవిలోనే ఇంత దుర్గంధం వెదజల్లుతుంటే వర్షాకాలం వస్తే ఈ పరిస్థితి మరింత దయనీయంగా, దుర్భరంగా ఉంటుందని స్థానిక ప్రజలు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఈ బస్టాండ్ కాంప్లెక్స్ ల ద్వారా ఆర్టీసీకి ఆదాయం వస్తున్నప్పటికీ ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ యాజమాన్యం కించిత్ కూడా పట్టించుకోవడంలేదని స్థానికులు,ప్రయాణికులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు.

## డ్రగ్స్ నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలు

- **జిల్లా ఎస్పీ కె.నరసింహ**



**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 26 (జనంసాక్షి) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం సూచించిన 5వ అంశం పిల్లల భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలనపై జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖ అధ్వర్యంలో సోమవారం నుండి వారం రోజుల పాటు ప్రజా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె.నరసింహ తెలిపారు. ఈ కార్యక్రమాల నిర్వహణ కోసం సంబంధిత ప్రభుత్వ శాఖలతో సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు.అన్ని గ్రామాలకు పోలీస్ సిబ్బంది వెళ్లి డ్రగ్స్ వల్ల జరుగుతున్న అనర్థాల గురించి, పిల్లల, యువత భవిష్యత్తుపై దుష్ప్రభావం గురించి వివరించడం జరుగుతుందన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారని, మత్తుకు అలవాటు పడి నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు.మన పిల్లలు మన సమాజాన్ని మాదకద్రవ్యాల బారినుండి కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు.గంజాయి సరఫరా, వినియోగంపై నిఘా ఉంచడం జరిగిందని పేర్కొన్నారు.గతంలో గంజాయి కేసుల్లో ఉన్న వారిపై, వినియోగించే వారిపై పోలీసు నిఘా ఉంచామన్నారు.వీరికి కౌన్సిలింగ్ లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.అవగాహన కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, యువత భాగస్వామ్యం కావాలని అన్నారు.మాదకద్రవ్యాల రహిత ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని కోరారు.

## ఇండ్ల గణన చేసే అధికారులకు సహకరించండి

- **ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 26 (జనంసాక్షి) :** ఇండ్ల గణన చేపట్టే అధికారులకు ప్రజలు పూర్తిస్థాయి సహకరించాలని జనాభా గణన 2026-27లో ప్రజలు చురుకుగా పాల్గొనాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రజలకు సూచించారు.ఆదివారం వేములవాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం జనాభా గణన 2026-27 కార్యక్రమన్నీ రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 2011 తర్వాత మళ్లీ 2026లో జనాభా గణన ప్రక్రియ ప్రారంభమైందన్నారు.ఏప్రిల్ 26 నుండి మే10 వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్ ద్వారా ప్రజలు ఆన్‌లైన్‌లో తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే అవకాశం కల్పించబడిందన్నారు. అనంతరం మే 11 నుండి జూన్ 9 వరకు ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి ఇళ్ల గణన మరియు కుటుంబాల వివరాలను సేకరిస్తారన్నారు. మలిదశలో 2027 ఫిబ్రవరి 9 నుండి ఫిబ్రవరి 28 వరకు పూర్తి స్థాయి జనాభా గణన నిర్వహించబడుతుందన్నారు.ఈ గణనలో మొత్తం 33 ప్రశ్నలు ఉంటాయని,ఇందులో వ్యక్తిగత వివరాలు, కుటుంబ సభ్యుల సమాచారం,నివాస పరిస్థితులు, కుల వివరాలు వంటి అంశాలు ఉంటాయన్నారు. ప్రజలు అందించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, ఆర్టీఐ చట్టం కింద కూడా ఈ వివరాలు వెల్లడించబడవని స్పష్టం చేశారు.ప్రతి 800 జనాభాకు లేదా 200 నుండి 250 ఇళ్లకు ఒక ఎన్యుమరేటర్ నియమించబడతారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ



పథకాల అమలు, నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలు వంటి కీలక అంశాల్లో ఈ గణాంకాలు ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు.అదనంగా, కేంద్ర ప్రభుత్వం 33 ప్రశ్నలతో పాటు 34 వ ప్రశ్నగా బీసీల గణనను కూడా చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.ఆయన వెంట జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసచారి, వేములవాడ తాసిల్దార్ జయంత్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ పుల్కం రాజు, ఆర్ఐలు శ్రీనివాస్, శ్రీధర్, మండల విద్యాధికారి సదానందం,అధికారులు పాల్గొన్నారు.

## యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతోనే మెగా జాబ్ మేళా

- **ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

**యాదాద్రి, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** భువనగిరి నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యను తగ్గించి యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ భారీ జాబ్ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చేనెల మే 8, 9, 10 తేదీలలో భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ హైస్కూల్ ప్రాంగణంలో ఈ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుంది. భువనగిరి నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల యువత కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన అన్నారు. ఈ మెగా జాబ్ మేళాలో దేశవ్యాప్తంగా ప్రముఖ కంపెనీలు పలు రంగాల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నాయని, సుమారు 20కి పైగా సంస్థలు పాల్గొని 3,500కి పైగా ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. జాబ్ మేళాలో పాల్గొనేవారు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ ఇంజనీరింగ్ ఇతర టెక్నికల్ అర్హతలు కలిగి ఉండాలని, జీతం 12,000 నుండి 40,000 వరకు (అర్హతలు, నైపుణ్యాల ఆధారంగా) ఉంటుందన్నారు అభ్యర్థులు తమ రిజ్యూమ్, ఆధార్ కార్డ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు మరియు విద్యార్హతల సర్టిఫికెట్లు తీసుకొని హాజరు కావాలని సూచించారు. ముందస్తు నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. భువనగిరి నియోజకవర్గాన్ని ఉపాధి అవకాశాల కేంద్రంగా అభివృద్ధి చేయడం, నిరుద్యోగ యువతకు స్థిరమైన జీవనోపాధి కల్పించడం లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.


# స్వీయ గణనను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

**నిజామాబాద్ సిటీ, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** జన గణన ప్రక్రియలో భాగంగా జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి ఆదివారం కలెక్టరేట్ లోని తన క్యాంపు కార్యాలయంలో స్వీయ నమోదు చేసుకున్నారు. జన గణనలో ఎవరికి వారు స్వయంగా వివరాలు నమోదు చేసుకునేలా అందుబాటులోకి తెచ్చిన ఆన్ లైన్ వెబ్ సైట్ https://se.census.gov.in ద్వారా తన వివరాలను నమోదు చేసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జన గణన ప్రక్రియను సులభంగా, సమగ్రంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం డిజిటల్ స్వీయ గణన (ఐఅస్త్రఖ్ఝశ్రీ నావశ్రీట-జుఅబఎవతీఖ్ఐశీఅ) విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. ఆన్లైన్ ద్వారా ప్రజలు తమ వ్యక్తిగత, కుటుంబ వివరాలను వెబ్ పోర్టల్ లో కానీ , మొబైల్ యాప్ ద్వారా స్వయంగా నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించారని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 26 నుండి మే 10వ తేదీ వరకు స్వీయ నమోదు చేసుకోవచ్చని సూచించారు. జన గణనకు సంబంధించిన సమాచారాన్ని 15 నిమిషాల వ్యవధిలో పూర్తి చేసుకోవచ్చని అన్నారు. వివరాలు నమోదు చేసిన అనంతరం ప్రత్యేకమైన సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడి (రాజు×ఐ) జారీ



చేయబడుతుందని తెలిపారు. ప్రభుత్వంచే నియమించబడిన ఫీల్డ్ ఎన్యుమరేటర్లు మే 11 నుంచి జూన్ 09వ తేదీ మధ్యకాలంలో క్షేత్రస్థాయిలో ఇంటికి వచ్చిన సమయంలో వారికి సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐ.డి నెంబర్ తెలియజేయాలని సూచించారు. ప్రజలు తమ వివరాలను ప్రస్తుతం ఆన్లైన్ పోర్టల్ ద్వారా స్వీయ నమోదు చేసుకుంటే, ధృవీకరణ సమయంలో వారు ఇంట్లో భౌతికంగా ఉండాల్సిన అవసరం ఉండదని, ఆన్‌లైన్‌లో నమోదు చేసిన సమాచారాన్ని సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐ.డి ద్వారా ఎన్యూమరేటర్ పరిశీలించి ధృవీకరిస్తారని అన్నారు. దీనివల్ల ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాల్లో ఉండే వారు, విద్యార్థులు, వలస కార్మికులు, ప్రయాణాల్లో ఉన్న ప్రజలు కూడా జనగణనలో వివరాలు నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించారని కలెక్టర్ తెలిపారు.స్వీయ గణనలో ఖచ్చితమైన చిరునామా, సరైన వివరాలు నమోదు చేయాలని, వీటి ఆధారంగానే ఎన్యూమరేటర్లను నియమించడం జరుగుతుందన్నారు. జనగణన ప్రక్రియలో సాంకేతికతను వినియోగించి సమగ్రతను పెంచడం, ప్రతి పౌరుడి వివరాలు జన గణనలో చేరేలా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన డిజిటల్ స్వీయ గణన ప్రక్రియను జిల్లాలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రతి ఒక్కరి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని భరోసా కల్పించారు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, సమగ్ర అభివృద్ధి సాధించేందుకు ఎంతగానో దోహదపడే జన గణనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని, జిల్లాలో ఈ ప్రక్రియ విజయవంతం అయ్యేందుకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

## అన్నం మెతుకు ఊపిరితిత్తుల్లో ఇరుక్కొని బాలింత మృతి



**బాన్సువాడ, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** బాన్సువాడ పట్టణంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. కాన్పు కోసం వచ్చిన ఓ యువతి పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చిన కొద్దిసేపటికే మృతి చెందింది. ఈ ఘటన స్థానిక మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే, పిట్లం మండలం బండపల్లి గ్రామానికి చెందిన అర్చన (21)ను శుక్రవారం ఉదయం ప్రసవం కోసం ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమెకు సాఫీగా డెలివరీ జరిగి ఆడ శిశువు జన్మించింది. అయితే, అనంతరం అర్చన అకస్మాత్తుగా అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. వైద్యులు చికిత్స అందించేందుకు ప్రయత్నించినప్పటికీ, అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. శిశువు మాత్రం క్షేమంగా ఉందని తెలిపారు. ఈ ఘటనపై ఆసుపత్రి సూపరిండెంట్ విజయభాస్కర్ వివరణ ఇస్తూ, డెలివరీ అనంతరం అర్చనకు అన్నం ఇవ్వగా అది ఊపిరితిత్తుల్లోకి వెళ్లి శ్వాస ఆడక మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

# విపణి



## 2 సెకన్లలోనే 100కి.మీ వేగం

### బీవైడీ నుంచి డెంజా జెడ్..

చైనా విద్యుత్తు కార్ల తయారీ సంస్థ బీవైడీ తన లగ్జరీ సబ్ బ్రాండ్ డెంజా.. మొదటి స్మార్ట్ ఎలక్ట్రిక్ సూపర్ కారును ఆవిష్కరించింది. డెంజా జెడ్‌పేరిట ఈ కారును బీజింగ్ మోటర్ షోలో పరిచయం చేసింది. ఈ విద్యుత్తు కారు కేవలం రెండు సెకన్లలోనే 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోవడం విశేషం. 1000+ బీహెచ్‌పీ పవర్ ఉత్పత్తి చేస్తుందని కంపెనీ వెల్లడించింది.బీవైడీ డెంజా జెడ్ విద్యుత్ కారులో నాలుగు సీట్లు ఉంటాయి. కారు పైకప్పు ఉండదు. సీట్లను కప్పి ఉంచేందుకు ఎలక్ట్రిక్‌తో పనిచేసే ఫోల్డింగ్ టాప్ ఇచ్చారు. ఇందులో బై-స్టీరింగ్ ఇచ్చారు. అంటే స్టీరింగ్‌కు ముందు చక్రాలకు ఎలక్ట్రానిక్ అనుసంధానం ఉంటుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ధర, ఇతర వివరాలను కంపెనీ వెల్లడించలేదు. యూకేలో ఈ ఏడాది జులైలో జరగనున్న గుడ్‌వుడ్ ఫెస్టివల్ స్పీడ్ ఈవెంట్‌లో కారుకు సంబంధించిన మరిన్ని విషయాలను వెల్లడించనున్నట్లు కంపెనీ పేర్కొంది. దీని రేంజ్ 600 కిలోమీటర్లు ఉండొచ్చని తెలుస్తోంది.





# మార్కెట్లు మండుతున్నా ఆరోగ్యంగా ఆసుపత్రుల షేర్లు భద్రం

మదుపర్లను మెప్పిస్తున్న విస్తరణ ప్రణాళికలు భౌగోళిక - రాజకీయ ఉద్రిక్తతల వల్ల స్టాక్ మార్కెట్లలో తీవ్ర ఒడుదొడుకులు నెలకొంటున్నాయి. అయితే ఆరోగ్య సంరక్షణ రంగం (ఆసుపత్రుల) షేర్లలో మాత్రం సానుకూల ధోరణి కనిపిస్తోంది. ఆసుపత్రుల నిర్వహణ సామర్థ్యం మెరుగుపడటం, భారీ విస్తరణ ప్రణాళికలు, ఆరోగ్య సంరక్షణకు ప్రజల్లో పెరుగుతున్న శ్రద్ధ వంటివి ఆసుపత్రుల వృద్ధికి ఊతం ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్టాక్‌మార్కెట్లో నమోదైన ఆసుపత్రుల షేర్లు మదుపరులకు ఆకర్షణీయంగా కనిపించడంతో పాటు పెట్టుబడిదారులకు ఆరోగ్యకర రాబడులు అందిస్తున్నాయి.గత అయిదేళ్లలో హాస్పిటల్ రంగం బలమైన వృద్ధిని సాధించింది. 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి 2024-25 మధ్య ఆసుపత్రుల ఆదాయాలు వార్షికంగా 15.5% పెరిగాయి. వడ్డీ, పన్నులు, తరుగుదలకు ముందు ఆదాయం (ఎబిటా) అంతకంటే వేగంగా 25% వృద్ధి చెందింది. ఆరోగ్య బీమా చెల్లింపులు పెరగడం వల్ల ఆదాయంలో స్థిరత్వం రావడం, ఆసుపత్రుల్లో చేరే రోగుల సంఖ్య అధికం కావడం ఇందుకు ప్రధాన కారణాలు. 2026 మొదటి త్రైమాసికంలో నిఫ్టీ 500 ఈక్వల్ వెయిట్ ఇండెక్స్ 14.4% పతనమైంది. కానీ, 11 సూపర్ స్పెషాలిటీ నమోదిత ఆసుపత్రుల సూచీ 8 శాతమే తగ్గింది. అంటే, మార్కెట్‌కన్నా మెరుగ్గా ఉంది. వీటిలో 8 ఆసుపత్రులు బెంచ్‌మార్క్‌ను అధిగమించాయి. 2025-26 మార్చి త్రైమాసికానికి ఆసుపత్రులు నిలకడైన ఫలితాలను అందిస్తాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఆసుపత్రిలో రోగులు గడిపే సగటు సమయాన్ని తగ్గించడం, డిజిటల్ టెక్నాలజీ వినియోగం ద్వారా సామర్థ్య పెంపు వంటి చర్యలతో లాభాల వృద్ధిపై ఆసుపత్రులు దృష్టి సారించాయి. దేశంలో పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, వ్యాధుల తీవ్రత కారణంగా ఆసుపత్రి సేవలకు విపరీతమైన గిరాకీ వస్తోంది. అందుకు తగ్గట్టు సదుపాయాలు లేవు. ఒక నివేదిక ప్రకారం.. ప్రపంచంలో సగటున 10,000 మందికి 33 పడకలు ఉంటే, మనదేశంలో 2024-25 నాటికి 16 పడకలే ఉన్నాయి. పెరుగుతున్న అవసరాలను అందుకునేందుకు, 3-4 ఏళ్లలో దేశవ్యాప్తంగా 23,000 కొత్త పడకలు



అందుబాటులోకి రానున్నాయి. ఫలితంగా ఈ రంగం 18-20% వార్షిక వృద్ధిని సాధిస్తుందనే అంచనాలున్నాయి.భవిష్యత్తులో ఆరోగ్య పర్యాటకం దేశీయ ఆసుపత్రులకు కీలక వృద్ధి అంశంగా మారుతుందని బ్రోకరేజీ సంస్థలు అంచనా వేస్తున్నాయి. అయితే విస్తరణ పనుల్లో జాప్యం, ఖర్చులు పెరగడం, చికిత్స వ్యయాలపై పరిమితులు, బీమా విధానాల్లో మార్పులు ఆసుపత్రి రంగాన్ని ఇబ్బంది పెట్టే అంశాలని పేర్కొంటున్నాయి. రిటెయిల్ మదుపరులు కనీసం 3-4 ఏళ్ల దృష్టితో ఆసుపత్రుల షేర్లలో క్రమానుగతంగా పెట్టుబడులు పెట్టుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.కార్డియాలజీ, ఆంకాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, ఆర్థోపెడిక్స్‌లో ప్రత్యేక చికిత్సలకు గిరాకీ పెరగడం, ఆసుపత్రుల ఆదాయ వృద్ధికి దోహదం చేస్తోంది. క్రిసిల్ నివేదిక ప్రకారం.. ఆసుపత్రులు విస్తరణ కోసం అప్పు చేయడం కంటే, లాభాల ద్వారా సమకూరిన సొంత నిధులనే వినియోగించడానికి ప్రాధాన్యమిస్తున్నాయి. ఆసుపత్రుల ఆర్థిక పరిస్థితి బలోపేతం కావడాన్ని ఇది సూచిస్తోంది. ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్‌టీ మినహాయించడం వల్ల, పాలసీ తీసుకునే వారు బీమా మొత్తాన్ని పెంచుకునేందుకు ఉపయోగపడుతోంది. ఇదీ ఆసుపత్రులకు కలిసొచ్చే అంశమే.ఆరోగ్య పర్యాటకంలో హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. ఇక్కడి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో.. స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదైన కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్), ఆపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్, రెయిన్ బో చిల్డ్రన్స్ మెడికేర్‌పై బ్రోకరేజీ సంస్థల విశ్లేషణ ఇలా.. కిమ్స్ 2025-26 మార్చి త్రైమాసిక ఆదాయంలో 32.9% వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందన్నది ఒక బ్రోకరేజీ సంస్థ అంచనా. ఈ సంస్థకు చెందిన కొత్త ఆసుపత్రులు 2-3 త్రైమాసికాల్లో నిర్వహణ లాభాల్లోకి వచ్చే ఆస్కారం ఉంది. ప్రస్తుత, రాబోయే ఆర్థిక సంవత్సరాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో కిమ్స్ కొత్తగా 1,150 పడకలు ఏర్పాటు చేయనుంది. రెండేళ్లలో సంస్థ మార్జిన్లు 26.2 శాతానికి పెరుగుతాయని అంచనాలున్నాయి.అపోలో మార్చి త్రైమాసికంలో 17.4% ఆదాయ వృద్ధిని నమోదు చేయొచ్చని బ్రోకరేజీ సంస్థలు చెబుతున్నాయి. 2025 డిసెంబరులో 3% టారిఫ్‌ను పెంచడం కలిసొస్తుందని పేర్కొంటున్నాయి. 2029 మార్చికి కొత్తగా 2,800 పడకలను ఏర్పాటు చేయాలని అపోలో లక్ష్యంగా పెట్టుకుంది.రెయిన్ బో చిల్డ్రన్స్ మెడికేర్ ఏడాది క్రితంతో పోలిస్తే, మార్చి త్రైమాసికంలో 12-16% వృద్ధిని నమోదు చేయొచ్చని బ్రోకరేజీ సంస్థలు పేర్కొంటున్నాయి. పిల్లలు, తల్లుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేకించిన ఈ హాస్పిటల్స్ రాజమహేంద్రవరం, బెంగళూరు, చెన్నైలలో నెలకొల్పిన యూనిట్లు బ్రేక్‌ఈవెన్‌కు చేరతాయన్నది ఆయా సంస్థల అంచనా.యశోదా, మెడికవర్ హాస్పిటల్స్ స్టాక్‌మార్కెట్లో నమోదయ్యేందుకు సన్నాహాలు చేసుకుంటున్నాయి.

## ఏఐ విస్తరణకు 1000 మంది ఫ్రెషర్ల నియామకం

### సేల్స్‌ఫోర్స్ సీఈఓ

కృత్రిమ మేధ రాకతో ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు పోతాయంటూ ఈ మధ్య కాలంలో తరచూ వింటున్నాం. ఇందుకు తగ్గట్టుగానే మైక్రోసాఫ్ట్, మెటా, అమెజాన్, గూగుల్ వంటి పలు టెక్ కంపెనీలు ఏఐలో పెట్టుబడులు పెడుతూ.. వేల సంఖ్యలో ఉద్యోగాల కోతలు చేపడుతున్నాయి. కానీ, వీటికి భిన్నంగా సేల్స్‌ఫోర్స్ (రాజీశ్రీవబటనీతీఇవ) కంపెనీ ఆలోచిస్తోంది. ఏఐ విస్తరణకు వెయ్యి మంది ఫ్రెషర్స్‌ని నియమించుకుంటామని ప్రకటన చేయడం గమనార్హం. ఇందుకు కొత్త గ్రాడ్యుయేట్లు, ఇంటర్న్లు అవసరమని సేల్స్‌ఫోర్స్ కంపెనీ సీఈఓ మార్క్ బేనియాఫ్ ఎక్స్ వేదికగా తెలిపారు."సేల్స్‌ఫోర్స్‌లో ఏజెంట్‌ఫోర్స్, హెడ్‌లెస్ 360 వంటి ఏఐ ఆధారిత ప్రాజెక్టుల కోసం ఫ్రెషర్ల నియామకం చేపడుతున్నాం. ఏఐ నిర్మాణానికి, అభివృద్ధికి యువత అవసరం" అని మార్క్ తెలిపారు. గతేడాదితో పోలిస్తే కొత్త నియమాకాలు 5.6 శాతం పెరిగాయని ఏఐ, క్రిప్టో కరెన్సీ జార్ డేవిడ్ శాక్స్ స్పందించారు.

# ఆర్థిక రంగంలోని అన్ని సంస్థలు సైబర్ భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

ముంబయి: ఆర్థిక రంగంలోని అన్ని సంస్థలు సైబర్ భద్రత విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం కోరారు. ఆంత్రోపిక్ రూపొందించిన క్లాడ్ మిథోస్ ప్లాట్‌ఫామ్ పేరును ప్రస్తావించకుండానే 'కృత్రిమ మేధ (ఏఐ) సాధనాలు సైబర్ దాడులను మరింత వేగవంతంగా, అనుకూలంగా మారుస్తున్నాయి. వ్యవస్థ బలహీనతలను కనుగొని, హానికర సోర్స్-కోడ్ జోక్యం వంటి ఎత్తుగడలతో గుర్తింపును తప్పించుకోగలవ'ని మంత్రి తెలిపారు. మార్కెట్ల నియంత్రణాధికార సంస్థ సెబీ మాత్రమే కాకుండా.. నియంత్రణ బాధ్యతల్లో ఉన్న అన్ని సంస్థలూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని సెబీ 38వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ఆర్థిక మంత్రి సూచించారు. సైబర్ దాడి చేసే సాధనాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నందున, వ్యవస్థలకు రక్షణ కల్పించే సాధనాలు మరింత వేగంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మిథోస్ వల్ల తలెత్తే పరిణామాల గురించి అవగాహన చేసుకోవడంతో పాటు, తమ వ్యవస్థలను పరిరక్షించుకునేందుకు ప్రపంచ వ్యాప్తంగా నియంత్రణ సంస్థలు, విధాన రూపకర్తలు తీవ్ర ప్రయత్నాలు చేపడుతున్న సంగతి విదితమే.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.25 | ₹ 5.27 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,41,200 | ₹ 1,54,040 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,70,000

# అద్భుతాల నిలయం హార్మూజ్ ద్వీపం




### తినాలనిపించే మట్టి.. చూడాలనిపించే రాళ్లు! ద్వీపంలో అద్భుతాలు



హర్మూజ్... అనగానే ఉద్రిక్తమైన జలసంధిగా ఇప్పుడు తెలుసు... కానీ అక్కడో భౌగోళిక అద్భుతం దాగుంది. అదే... హర్మూజ్ ద్వీపం! పర్షియన్- ఒమన్ సింధు శాఖల మధ్య ఉన్న జలసంధిగా హర్మూజ్ అందరికీ తెలిసిందే. ముఖ్యంగా పర్షియా నుంచి మహా సముద్రాల్లోకి దారితీసే ఏకైక సముద్ర మార్గం ఇది. అందుకే ప్రపంచంలోని కీలక సముద్ర మార్గాల్లో ఒకటిగా, వ్యూహాత్మక ప్రదేశంగానూ పేరొందింది. ఆ మార్గంలోనే ఉన్న హర్మూజ్ ద్వీపాన్ని పర్యాటక స్వర్గమనే చెప్పొచ్చు. కళ్లు చెదిరే అందాలతో పాటు... ఎన్నో వింతలకు నెలవిది. ఉప్పు గుహలు, విచిత్ర ఆకారాల రాతి నిర్మాణాలు, తినే మట్టి... ఇలా చాలా ప్రత్యేకతలు ఇక్కడున్నాయి. ద్వీపం విస్తీర్ణం 42 చదరపు కి.మీ. మాత్రమే. అయితేనేం, చలికాలంలో ఇది పర్యాటకులతో సందడిగా ఉంటుంది. వేల సంవత్సరాలుగా జనావాసంతో ఉన్న ఈ ద్వీపాన్ని మార్కోపోలో, ఇబన్ బటూటా వంటి ప్రసిద్ధ యాత్రికులు సందర్శించేవారట. గోవా, గుజరాత్‌ల నుంచి ఇరాన్‌లోని ఖేష్మ్ దీవికి ప్రయాణించే ఓడలకు విడిది కేంద్రంగా ఈ దీవిని ఉపయోగించేవారట. అందుకే ఈ ద్వీపంలో పోర్చుగీసు కోట గోడల శిథిలాలు కనిపిస్తుంటాయి. అన్నిటినీ మించిన విశేషం... గెలాక్‌గా పిలిచే ఎర్రటి మట్టి. ఐరన్ ఆక్సైడ్‌తో నిండిన ఈ మట్టిని స్థానికులు సీఫుడ్, ఊరగాయలు, రొట్టె... ఇలా అన్ని రకాల వంటకాల్లో సుగంధ ద్రవ్యంగా వాడుతుంటారు. కాస్మొటిక్స్, సెరామిక్స్ తయారీకీ ఉపయోగిస్తారు. రంగుల మట్టితో చేసిన కళాఖండాల్ని ఇక్కడి మ్యూజియంలోనూ ప్రదర్శిస్తారు. నిజానికి ఈ దీవిలో ఎటు చూసినా రంగుల విన్యాసమే. ఎరుపు రంగులో మెరిసే బీచ్ నీలిపచ్చ రంగుల సాగరాన్ని తాకుతూ సూర్యోదయ, సూర్యాస్తమయాల్లో అందమైన వర్ణపటాన్ని తలపిస్తుంది. తీరంలో కనిపించే ఆ ఎర్రటి కాంతిని ఆ దారిలో ప్రయాణించే నావికులు ఓ సంకేతంగా భావించేవారట. అక్కడ దొరికే మట్టి రంగుల్లోనే పర్యాటకులకోసం రెస్టారెంట్లనీ, కెఫేల్నీ నిర్మించడం ఈ దీవిలో మరో విశేషం. అలాగే వివిధ జీవుల్ని పోలి ఉండే చిత్రమైన సహజ శిథిల రాతి నిర్మాణాలు చూపరుల్ని కళ్లు తిప్పుకోనీయవు. ఈ దీవిలో 70కి పైగా ఖనిజాలు ఉన్నాయనీ వాటివల్లే అక్కడి రాళ్లూ మట్టీ విభిన్న వర్ణాల్లో కనువిందు చేస్తున్నాయనేది జియాలజిస్టుల విశ్లేషణ. అందుకే ఈ దీవిని రెయిన్‌బో ఐలాండ్ అనీ పిలుస్తారు.హర్మూజ్ దీవి సుమారు 60 కోట్ల సంవత్సరాల క్రితం సముద్రం లోపలి నుంచి పొరలుపొరలుగా పైకి ఉబికిన ఉప్పు గుమ్మటం... ఓ భౌగోళిక అద్భుతం. అందుకే తెల్లని ఉప్పు కయ్యలూ గుహలూ ఇక్కడ చాలా ఉన్నాయి. రాత్రివేళల్లో రంగుల జీవజాలంతో మెరిసే సముద్రం, విదేశీ వలస పక్షుల విన్యాసాలతో నిండిన హర్మూజ్ దీవిలో ప్రతిదీ అద్భుతమే.ఇక్కడి ఎరుపు రంగు నేలని విశ్వ సంఘటనలు, పౌరాణిక జీవులకీ ముడిపెడుతూ స్థానికులు కథలూ చెబుతుంటారు. అందుకే హర్మూజ్... చమురు రవాణా మార్గం మాత్రమే కాదు, యాత్రికులనీ ఫొటోగ్రాఫర్లనీ భూవిజ్ఞాన శాస్త్రవేత్తల్నీ ఆకర్షించే చిత్రవిచిత్రమైన ప్రదేశం!





## మహిళలకు తీపికబురు

మహిళల స్వయం ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు వ్యాపార అవకాశాలు కల్పించి, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కుట్టు మిషన్లను సరఫరా చేస్తున్నట్లు వివరించారు. బలహీనవర్గాలకు చెందిన మహిళలు స్వయంగా ఎదిగేందుకు నైపుణ్య శిక్షణకు అవసరమైన చర్యలు చేపట్టినట్లుగా ఆయన వివరించారు. "తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బలహీన వర్గాల శాఖ పక్షాన రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు స్వయం ఉపాధి కలగజేయాలనే సదుద్దేశంతో ప్రతి నియోజకవర్గానికి 1000 మంది మహిళలకు కుట్టు మిషన్లు ఇవ్వనున్నాం. 100 శాతం సబ్సిడీతో వీటిని పంపిణీ చేసేందుకు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి సూచనల మేరకు నిర్ణయం తీసుకోవడం జరిగింది. అందుకు సంబంధించిన ఎంపిక ప్రక్రియ జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో జరుగుతుంది. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఉపయోగపడుతుందని భావిస్తున్నామన్నారు


## 'ఆ ఏడుగురిపై వేటు వేయండి'

ఆ తర్వాత పార్టీని వీడి భాజపా చేరాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో వారి సభ్యత్వాలను రద్దు చేయాలని రాజ్యసభ ఛైర్మన్‌ను కోరాం. ఇటువంటి ఫిరాయింపులు ప్రజాతీర్పునకు ద్రోహం చేయడమే కాకుండా.. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం" అని సంజయ్ సింగ్ వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై తాము రాజ్యాంగ నిపుణులను సంప్రదించామని.. చట్టప్రకారం ఆ ఎంపీలు అనర్హతకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు.భాజపాలోకి ఫిరాయించిన ఆప్ ఎంపీల్లో ఒకరైన హర్భజన్ సింగ్‌కు గతంలో కేటాయించిన భద్రతను పంజాబ్ పోలీసులు ఉపసంహరించుకున్నట్లు సమాచారం. 9- 10 మంది పోలీసులతో కూడిన సెక్యూరిటీని తొలగించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

# దిగుమతులపై ఆధారపడటం తగ్గేదెప్పుడో?

### 11వ ఏడాదీ దేశంలో తగ్గిన ముడిచమురు ఉత్పత్తి గ్యాస్ కూడా అదే దారిలో

**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభానికి ముందు బ్యారెల్ 70 డాలర్లలోపు ఉన్న ముడిచమురు ధర, 100 డాలర్లను మించింది. దేశీయ చమురు అవసరాల్లో 89%, గ్యాస్ అవసరాల్లో 51% దిగుమతులే తీరుస్తుండగా, ఇప్పుడు ధర ఇంతగా పెరగడం మన ఆర్థిక వ్యవస్థకు భారంగా మారుతోంది. ఇందువల్ల డాలర్ బలోపేతం అవుతూ, రూపాయి బలహీన పడుతోంది. ఫలితంగా వస్తువుల ధరలు పెరగడమే కాక, వృద్ధిరేటు క్షీణిస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో దేశీయంగా ఉత్పత్తి అవుతున్న చమురు, గ్యాస్ పరిమాణాలు తగ్గడం మరింత కలవరపెడుతోంది. వరుసగా 11వ ఆర్థిక సంవత్సరమైన 2025-26 లోనూ చమురు ఉత్పత్తి క్షీణించింది. సహజవాయువు ఉత్పత్తి వరుసగా రెండో ఏడాదీ తగ్గింది. పాత చమురు క్షేత్రాల్లో నిల్వలు తగ్గడం, కొత్త క్షేత్రాలను కనుగొనకపోవడం ఇందుకు ప్రధాన కారణాలు. పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం.. 2025-26లో ముడిచమురు ఉత్పత్తి 2.5% తగ్గి 28 మిలియన్ మెట్రిక్ టన్నులకు పరిమితమైంది. 2014-15 నుంచి ఇప్పటివరకు మొత్తం ఉత్పత్తిలో 22% క్షీణత నమోదైంది.దేశీయ గ్యాస్ ఉత్పత్తి 3.7% తగ్గి 34,776 మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల (ఎంఎంఎస్‌సీఎం)కు పరిమితమైంది. 2011-12లో ఉత్పత్తి 47,555 ఎంఎం ఎస్‌సీఎం కావడం గమనార్హం. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన కేజీ-డీ6 బ్లాక్, ఓఎన్‌జీసీ పాత క్షేత్రాల నుంచి ఆశించిన స్థాయిలో ఉత్పత్తి రాకపోవడం ఇందుకు నేపథ్యం. చమురు క్షేత్రాల అన్వేషణకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. నిబంధనలను సరళతరం చేయడం, సులభంగా పర్యావరణ అనుమతులు ఇవ్వడం, జాతీయ భౌగోళిక డేటా రిపోజిటరీని ఏర్పాటు చేయడం వంటి




సంస్కరణలు తెచ్చింది. అన్వేషణ సంస్థలకు భారీ వాటా దక్కేలా నిబంధనావళి రూపొందించింది. అయినా చమురు క్షేత్రాల అన్వేషణకు అధునాతన టెక్నాలజీ, మూలధనం కలిగిన విదేశీ చమురు కంపెనీలు ముందుకు రావడం లేదు. గత పదేళ్లలో జరిగిన చాలా లైసెన్సింగ్ రౌండ్లలో దేశీయ ప్రభుత్వ రంగ సంస్థల ఆధిపత్యమే సాగడం గమనార్హం. ఈ నేపథ్యంలో రష్యా నుంచి కొంచెం రాయితీపై లభిస్తున్న చమురు కొనుగోళ్లను కొనసాగించడంతో పాటు పునరుత్పాదక ఇంధన వనరులపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది.

## రష్యా చమురు దిగుమతులు.. ఆ డేటా వెల్లడించలేం: పీపీఏసీ

**న్యూఢిల్లీ:** రష్యా నుంచి భారత్‌కు చమురు దిగుమతులకు సంబంధించిన సమగ్ర వివరాలను ఆర్టీఐ కింద అందజేయడం కుదరదని పెట్రోలియం శాఖ ఆధ్వర్యంలోని 'పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్' తెలిపింది. ఇది వాణిజ్యపరమైన, గోప్యమైన అంశం కావడంతో సమాచార హక్కు చట్టం కింద మినహాయింపు ఉందని పేర్కొంది. దేశ వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాలను ఉటంకిస్తూ.. కేంద్ర సమాచార కమిషన్ కూడా దీనిని సమర్థించింది.2022 జూన్ నుంచి 2025 జూన్ మధ్యకాలంలో రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకున్న ముడి చమురు వివరాలను అందజేయాలని 'పీపీఏసీ'లో ఓ ఆర్టీఐ పిటిషన్ దాఖలైంది. ఐవోసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఓఎన్‌జీసీ విదేశ్, రిలయన్స్ ఇండస్ట్రీస్, నయారా ఎనర్జీ వంటి సంస్థల వారీగా కూడా డేటా కావాలని దరఖాస్తుదారు కోరారు. అయితే, ఈ సమాచారాన్ని ఇచ్చేందుకు 'సెంట్రల్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్' (సీపీఐవో) నిరాకరించారు."దేశాలు, కంపెనీల వారీగా ముడి చమురు దిగుమతులకు సంబంధించిన సమాచారం వాణిజ్యపరమైనది, గోప్యమైనది. ఆర్టీఐ చట్టం కింద ఈ డేటాను వెల్లడించడాన్ని మినహాయించారు. అయితే, ముడి చమురు మొత్తం దిగుమతి పరిమాణం, విలువను పీపీఏసీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు" అని సీపీఐవో తెలిపారు. ఫస్ట్ అప్పిలేట్ అథారిటీ సైతం ఈ సమాధానాన్ని సమర్థించింది.దీంతో దరఖాస్తుదారు.. సీఐసీని ఆశ్రయించారు. ఇంధన రంగంలో దేశం ఎలా పనిచేస్తుందో తాను తెలుసుకోవాలనుకుంటున్నట్లు చెప్పారు. అయితే.. ఈ సమాచారాన్ని వెల్లడించడం దేశ వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తుందని సీఐసీ పేర్కొంది. ఇతర దేశాలతో సంబంధాలను కూడా ప్రభావితం చేస్తుందని తెలిపింది. ఈ సమాచారం భౌగోళిక రాజకీయ సంబంధాలతో ముడిపడి ఉందని చెప్పింది. ఆర్టీఐ చట్టం కింద మినహాయింపు చెల్లుబాటు అవుతుందని స్పష్టం చేసింది.

# జనాభా లెక్కల స్వీయ గణనకు అవకాశం

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులు, మీడియాతో సమావేశం



**వరంగల్ బ్యూరో, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** వరంగల్, ఏప్రిల్ 26: భారత జనగణన 2027లో భాగంగా స్వీయ గణన ప్రక్రియపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి అధికారులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు టీపీటీ (పిపిటి) ద్వారా స్వీయ గణన విధానం, దాని ప్రాముఖ్యతపై విపులంగా వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జనాభా గణన 2027కు సంబంధించి మొదట ఇండ్ల గణన చేపడుతున్న నేపథ్యంలో ఈ నెల 26 నుంచి మే 10 వరకు స్వీయ గణనకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ స్వీయ గణన విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిం దని, దీని ద్వారా ప్రజలు స్వయంగా తమ కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ విధానం ద్వారా సమయపాలన, ఖచ్చితత్వం పెరగడమే కాకుండా పారదర్శకత కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

ఇందుకుగాను మొదట లింకును ఓపెన్ చేసి సెల్ఫ్ ఎన్యూమరేషన్ (హెచ్‌ఎల్‌ఓ) లాగిన్ వద్ద తెలంగాణ ఎంపిక చేసి, క్యాప్చా ఎంటర్ చేసి వెరిఫై, ప్రొసీడ్ క్లిక్ చేయాలన్నారు. వెల్కమ్ పేజీలో కుటుంబ పెద్ద పేరు, మొబైల్ నంబర్ నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఒక కుటుంబానికి ఒకే మొబైల్నంబర్‌ఉపయోగించాలని వచ్చిన ఓటీపీ ఎంటర్ చేసి వెరిఫై, ప్రొసీడ్ క్లిక్ చేయాలన్నారు. తరువాత వాళ్లకు నచ్చిన భాషను ఎంచుకోవచ్చన్నారు. వారి జిల్లా, పట్టణం/గ్రామం, పిన్ కోడ్ వివరాలు నమోదు చేయాలని సూచించారు. తమ మొబైల్‌లో లొకేషన్ ఆన్ చేసి, వారి ఇంటి వద్ద రెడ్ మార్క్ సెట్ చేయాల్సి ఉంటుందన్నారు. ఇళ్ల వివరాలకు సంబంధించిన 33 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి, ప్రివ్యూ ద్వారా చెక్ చేసి సబ్మిట్ చేయాలన్నారు. అనంతరం హెచ్ తో ప్రారంభమయ్యే 11 అంకెల ఎస్‌ఈ ఐడి వస్తుందని చెప్పారు. దాన్ని స్క్రీన్‌షాట్ లేదా నోట్ చేసుకుని భద్రపరచాలన్నారు. మే 11 తర్వాత మీ ఇంటికి వచ్చే గణన అధికారికి ఈ ఎస్‌ఈ ఐడి చూపిస్తే వారు అప్రూవ్ చేస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.స్వీయ గణనలో కుటుంబ సభ్యుల వివరాలు, విద్య, ఉపాధి, నివాస పరిస్థితులు వంటి అంశాలను సరిగ్గా నమోదు చేయడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ సూచించారు.తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయడం ద్వారా ప్రభుత్వ పథకాల రూపకల్పన కు ఖచ్చితమైన డేటా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. అధికారులు ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, గ్రామ, వార్డు స్థాయిలో ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. మీడియా ప్రతినిధులు కూడా స్వీయ గణనపై ప్రజల్లో చైతన్యం కల్పించడం లో కీలక పాత్ర పోషించాలని కోరారు.జిల్లాలో స్వీయ గణన ప్రక్రియను విజయవంతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. సెన్సెస్ అవేర్నెస్ లో భాగంగా క్యాప్‌లు పంపిణీ చేసి విస్తృతంగా అవేర్నెస్ తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో అతను కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, డిబిసిడి పుష్పలత, దుర్గరాజ్ సుభాష్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ స్టాఫ్ వివిధ శాఖల అధికారులు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న తోటి మిత్రులు



**తలకొండపల్లి ఏప్రిల్ 26 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-01 సంవత్సరంలో పదవతరగతి చదువుకున్న స్నేహితుల బృందం మానవత్వం చాటుకున్నారు. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన మురమోని నరసింహా అనారోగ్యంతో ఇటీవల అకాల మరణం పొందారు.దీంతో అ కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల ను గమనించిన పదవతరగతి 2000-01 బ్యాచ్ మిత్రులు ఆదివారం స్నేహితుని కుటుంబాన్ని పరామర్శించి వారికి మనోధైర్యాన్ని కల్పించారు. వారికి తక్షణ సహాయంగా రూ.1లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో పెరుమాళ్ల రాజు, సత్యం, పాష, సంఘనమోని శ్రీను, గణేష్, యాదయ్య, శ్రీను, పాండు, గిరిందర్ రెడ్డి, హరిలాల్ తదితరులు ఉన్నారు.

## కొనుగోలు కేంద్రంకై జొన్న రైతుల ఎదురుచూపులు

**పెద్ద కొడప్గల్ ఏప్రిల్ 26 (జనంసాక్షి):** జొన్న పంట చేతికొచ్చి సుమారు నెలరోజులు కావడంతో పెద్ద కొడప్గల్ మండల రైతులు కొనుగోలు కేంద్రం కోసం ఎదురుచూస్తున్నారు. సుమారు నెల రోజుల నుంచి రైతు వేదిక వద్ద జొన్న పంటను కుప్పలుగా పోసి రాత్రింబవళ్లు కాపలా కాస్తున్నారు. అకాల వర్షాలకు, గాలి దుమారానికి పంటలు కాపాడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.



# క్రమశిక్షణకు, సామూహిక కృషికి క్రీడలే నిదర్శనం





- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి
- జడ్చర్లలో ప్రారంభమైన 69వ జాతీయ పాఠశాలల క్రీడా సమాఖ్య క్రికెట్ పోటీలు

**జడ్చర్ల, ఏప్రిల్ 26 (జనంసాక్షి):** జడ్చర్ల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణం జాతీయ స్థాయి పోటీలతో సందడిగా మారింది. 69వ జాతీయ పాఠశాలల క్రీడా సమాఖ్య క్రికెట్ ఛాంపియన్‌షిప్ - 2026 వేడుకలను జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఆదివారం అధికారికంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 31 రాష్ట్రాల నుండి తరలివచ్చిన యువ క్రీడాకారులకు ఎమ్మెల్యే ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు, కళారూపాలను ఆయన తిలకించి, వారి నైపుణ్యాన్ని మనసారా అభినందించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రసంగిస్తూ క్రీడలు కేవలం ఆటలు మాత్రమే కావని, అవి విద్యార్థులలో క్రమశిక్షణను, సామూహిక కృషిని మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని, జాతీయ స్థాయి పోటీలకు జడ్చర్ల వేదిక కావడం ఈ ప్రాంతానికే దక్కిన గౌరవమని కొనియాడారు. క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్తు కు ప్రభుత్వం ఎల్లవేళలా వెన్నుదన్నుగా ఉంటుందని హామీ ఇచ్చారు.

ఈ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులందరూ తమ ప్రతిభను చాటి, క్రీడా స్ఫూర్తితో విజేతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్, స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల విద్యాధికారి మంజులా దేవి, పీడీ పీఈటి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దూమర్ల నిరంజన్, ఎస్జీఎఫ్ కార్యదర్శి శారద భాయ్, టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి మోయిన్, మీడియా ఇంచార్జ్ ఆనంద్ కుమార్, అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలు స్వయం ఉపాధి రంగాలలో రాణించాలి

**కోటగిరి, ఏప్రిల్ 26( జనం సాక్షి):** నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం కోటగిరి మండలం ఎత్తోండ గ్రామంలోని రైతు వేదికలో గత 15 రోజుల పాటు అలీప్ అసోసియేషన్ సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, మగ్గం వర్క్ శిక్షణ నిర్వహించిన కార్యక్రమం ఆదివారంతో ముగియడంతో గ్రామ సర్పంచ్ శ్వేత సూర్యకాంత్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించిన సంస్థ నిర్వాహకులతో పాటు ట్రైనర్ల కు సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అలీప్ సంస్థ నిర్వాహకులకు ట్రైనర్లకు శాల్వతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం గ్రామ పరి శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత కాబట్టి ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని పర్యావరణాన్ని కాపాడాలని అంటూ ప్రతి మహిళ ఇంటి ముందు ప్రతిరోజు శుభ్రపరిచే విధంగా శిక్షణలో పాల్గొన్న మహిళలతో ప్రార్థన చేయించారు.అలీప్ సంస్థ ఆధ్వర్యంలో 15 రోజులపాటు శిక్షణ ఇచ్చిన మగ్గం వర్క్ శిక్షకారాలు లిబియాను టైలరింగ్ శిక్షకరాలు ప్లాండినా కు గ్రామ సర్పంచ్ శ్వేత సూర్యకాంత్ అభినందించారు. ఈ సందర్భంగా ఎత్తొండ గ్రామ సర్పంచ్ శ్వేత సూర్యకాంత్ మీడియాతో మాట్లాడుతూ... అలీప్ సంస్థ ఆధ్వర్యంలో 15 రోజులు టైలరింగ్ శిక్షణతో పాటు మగ్గం వర్క్ శిక్షణ సుమారు 80 మంది మహిళలకు శిక్షణ ఇవ్వడం జరిగిందని అన్నారు.. మహిళలు ఇంటికే పరిమితం కాకుండా మహిళ తన కాళ్లపై స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా ఎదిగేందుకు ఉచిత టైలరింగ్ మగ్గం వర్క్ శిక్షణ ఇవ్వడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. అలీప్ సంస్థ శిక్షణతో పాటు మధ్యాహ్నం భోజనం సాయంత్రం టీ ఏర్పాటు చేయడం చాలా గొప్ప విషయమన్నారు. మారుమూల ప్రాంతమైన తమ గ్రామానికి వచ్చి మహిళలకు ఉచిత టైలరింగ్ మగ్గం వర్క్ శిక్షణ ఇచ్చినందుకు అలీఫ్ సంస్థ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే అలీప్ సంస్థ ఆధ్వర్యంలో తమ గ్రామ మహిళలకు టైలరింగ్ మగ్గం వర్క్ తో పాటు జ్యూట్ బ్యాగ్ తయారీ పాలిథిన్ కవర్ తయారీ లాంటి వివిధ శిక్షణాలను నిర్వహించాలని ఆమె కోరారు.అలాగే ఎం ఎస్ ఎం ఈ కౌన్సిలర్ రజిత, శ్రీలత మీడియాతో మాట్లాడుతూ... అలీప్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన టైలరింగ్, మగ్గం వర్క్ శిక్షణకు సహకరించిన గ్రామ సర్పంచ్ శ్వేత సూర్యకాంత్ కు వార్డ్ సభ్యులకు మహిళలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే శిక్షణ పొందిన ప్రతి మహిళ పొందిన శిక్షణను వృధా చేయకుండా బ్యాంకు ద్వారా రుణాలు తీసుకొని షాప్ పెట్టుకోవాలని అన్నారు. అలాగే అలీఫ్ సంస్థ ద్వారా శిక్షణ పొందిన ప్రతి మహిళ భర్తకు తోడుగా తల్లిదండ్రులకు అండగా నిలిచే విధంగా ముందుకు సాగాలని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అలీప్ సంస్థ కో ఆడినేటర్ రమేష్, కౌన్సిలర్లు శ్రీలత రజిత,ఎత్తొండ గ్రామ వార్డు సభ్యులు శ్రీనివాస్, సాయిలు, గోపాల్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా 'హిందూ సమ్మేళనం'... ఐక్యతపై పిలుపు

### ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం : ఆర్ఎస్ఎస్



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 26(జనంసాక్షి):** శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ పరిధిలోని ఎస్ఎన్ రెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించిన 'హిందూ సమ్మేళనం' కార్యక్రమం ఆద్యంతం వైభవంగా జరిగింది. పరిసర ప్రాంతాల దేవాలయాల పూజారులు, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీల ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.వి.కె ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) వందేళ్ల ప్రస్థానం, దేశ సేవలో దాని పాత్రను వివరించారు. హిందూ ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, సమాజంలో ఐక్యతను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. హిందూ జనజాగృతి సమితి రాష్ట్ర సమన్వయకర్త చైతన్య గాడి మాట్లాడుతూ దేశ సార్వభౌమత్వం కోసం ఆర్ఎస్ఎస్ చేస్తున్న సేవలను ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో జీవిస్తూ దేశం, ధర్మం పట్ల బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. హనుమాన్ చాలీసాతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో గోపూజ నిర్వహించారు. అనంతరం చిన్నారుల భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సమ్మేళన సమితి సభ్యులు, కాలనీ పెద్దలు, మహిళలు, పిల్లలు భారీగా పాల్గొన్నారు.



# ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నాం

### రాష్ట్ర రవాణా శాఖ,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్


**కడ్తాల్ ఏప్రిల్ 26(జనంసాక్షి):** ప్రజా ప్రభుత్వంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని,అలాగే ఆర్టీసీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు.ఆర్టీసీ సంస్థ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయడం చారిత్రాత్మక నిర్ణయం అన్నారు.ఆదివారం నాడు హైదరాబాద్ నుండి శ్రీశైలం వెళ్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఆమనగలు పట్టణంలో టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు.పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు.ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపజేసి,ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడాన్నీ హర్షిస్తూ మంత్రిని సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ మొదలైందని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుపోయి విపక్షాల కుట్రలను ఎండగట్టాలన్నారు.సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో పెరిగిన రద్దీకి అనుగుణంగా అన్ని రూట్లలో ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచినట్లు చెప్పారు.కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరిక మేరకు కల్వకుర్తి డిపోకు అదనంగా 20 కొత్త బస్సులు కేటాయించడం జరిగిందన్నారు.బీసీ సంక్షేమ శాఖ నుంచి కల్వకుర్తి నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని,మైసిగండి మైసమ్మ దేవాలయం వద్ద ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేయాలని శ్రీనివాస్ గౌడ్ మంత్రికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ తాలూకా ఉపాధ్యక్షుడు షాబుద్దీన్,నాయకులు శ్రీకాంత్,ఖరీద్,సురేష్,అలీమ్ ఉన్నారు.

## అడిగిన ధరకు కర్రీ ఇవ్వనందుకు కత్తితో దాడి

**అమీన్పూర్, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** అడిగిన ధరకు కర్రీ ఇవ్వనందుకు ఓ ఉన్మాది కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటన అమీన్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీరంగూడలో చోటుచేసుకుంది. కూకట్పల్లి లో ఉండే గోలే ఉదయభాను బీరంగూడలో ఓం శ్రీ సాయి ఫుడ్స్ నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి అంబేద్కర్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ జీవరత్నం పది రూపాయలకు కర్రీ ఇవ్వాలని ఉదయభానును బెదిరించాడు. పది రూపాయలకు కర్రీ రాదు అని 30 రూపాయలకు తీసుకోవాలని ఉదయభాను సూచించాడు. దాంతో ఆగ్రహంతో జీవరత్నం పెద్ద కత్తిని తీసుకొని వచ్చి దుకాణం షట్టర్ కిందకి వేసి ఉదయభానుపై కత్తితో దాడి చేశాడు. దాంతో ఉదయభాను తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి షట్టర్ పైకి ఎత్తి జీవరత్నం అక్కడి నుండి పారిపోయాడు. తీవ్ర గాయాలైన ఉదయభాను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్సై రామాంజనేయులు హత్యాయత్నం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. జీవరత్నకు కోసం పోలీసులు రెండు బృందాలుగా వెతుకుతున్నారు.

## పూలజడల తయారీకి మార్కెట్లో మంచి డిమాండ్

### 15రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం దిలీప్ చంద్ర



**జగిత్యాల ఏప్రిల్ 26 (జనంసాక్షి):** మహిళలకు పూలజడల తయారీపై శిక్షణ ఒక అద్భుతమైన స్వయం ఉపాధి అవకాశమని, పెళ్లిళ్లు,శుభకార్యాలు,పండుగలు,ఫంక్షన్ల సమయంలో సహజమైన పూలు తయారు చేసే పూలజడలకు మార్కెట్లో విపరీతమైన డిమాండ్ ఉందని నాబార్డ్ డిడిఎం దిలీప్ చంద్ర తెలిపారు.జగిత్యాల జిల్లాలోని నాబార్డ్ వారి ఆర్థిక సహకారంతో వెలుగు రేఖ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 15రోజుల శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్నారు.ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగిత్యాల జిల్లా నాబార్డు అధికారి ఎం దిలీప్ చంద్ర హాజరై మాట్లాడుతూ ఈ పూలదండలు,పూల అల్లికల ధార మహిళలకు అదనపు ఆదాయాన్ని పొందడం జరుగుతుందన్నారు.ఈ పెళ్లి పూల జడలకం, పెళ్లి పిల్లల తయారీ ఆధునీకరణతోపాటు పెళ్లికి సంబంధించిన బ్రైడల్ మేకప్ తయారీ విధానాల గురించి ఈ శిక్షణ కార్యక్రమంలో 15రోజుల్లో 30మంది మహిళలకు ఇప్పించడం జరిగింది అన్నారు.ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా స్వశక్తి మహిళలకు సర్టిఫికెట్లు,750రూపాయల స్టఫ్ అండ్ చెక్కులను వెలుగు రేఖ గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా అందించారు.ఈ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఇంటర్ ప్యునర్ గా ఎదగడానికి నాబార్డ్ ద్వారా మరిన్ని శిక్షణలు ఇవ్వడానికి సహకరిస్తామని డిడిఎమ్ తెలిపారు.దీనితోపాటు బ్యాంకు లోన్స్ కూడా అందజేస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వెలుగు రేఖ గ్రామీణ అభివృద్ధి సంస్థ సీఈవో బామండ్లపల్లి రజిత రవి అలాగే మాస్టర్ ట్రైనర్ కర్ర అనూష రెడ్డి వీరితోపాటు 30మంది స్వశక్తి మహిళలు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు



# సెలవులు వినోదం... కారాదు విషాదం

### భానుడి పట్ల నిర్లక్ష్యం వహిస్తే తప్పదు బారి మూల్యం

- సరదాగా ఈతకి వెళ్లితే లోతు తెలియక ఎన్నో కుటుంబాలలో జరిగిన విషాదాలు
- చిన్నారుల ర్యాష్ డ్రైవింగ్ వల్ల పొంచివున్న ప్రమాదాలు



**నిర్మల్ ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** పది నెలల పాటు పుస్తకాలతో యుద్ధం చేసి వార్షిక పరీక్షలు పూర్తి కావడంతో విద్యార్థులకు సెలవులు ప్రకటించారు. దీంతో పుస్తకాల భారానికి విరామం దొరికింది.. ఇక ఆటపాటలకు సమయం ఆసన్నమైంది. రోజురోజుకు భానుడి ప్రతాపం పెరుగుతున్న వేళ, వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు చిన్నారులు చెరువులు, బావులు బాట పడుతున్నారు. అయితే, ఈ సరదా కాస్తా అజాగ్రత్తగా ఉంటే విషాదంగా మారే ప్రమాదం ఉందని అధికార యంత్రాంగం హెచ్చరిస్తోంది. అయితే, ఎండ వేడి దృష్ట్యా ఈ సెలవుల్లో చిన్నారులు జలకాలాడు తూ సేద తీరాలని చూస్తుండటంతో ప్రాణాంతకం కాక ముందే తల్లిదండ్రులు, సంరక్షకులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది.

గ్రామాలకు వచ్చే పిల్లలు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేం దుకు స్థానిక చెరువులు, కుంటలు, బావుల వద్దకు వెళుతుండడం సహజం. ముఖ్యంగా పట్టణాల నుంచి వచ్చే పిల్లలకు నీటి లోతుపై అవగాహన ఉండదు. ఈత రాకపోయినా సరదా కోసం నీటిలోకి దిగి ప్రమాదాల బారిన పడుతుంటారు. ఏటా వేసవిలో ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు అనేకం నమోదవు తున్నాయి. పిల్లల చిన్న సరదా వల్ల కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపకుండా ఉండాలంటే ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి.

అలాగే వేసవి సెలవుల్లో పిల్లలు సరదా కోసం లేదా ఉత్సాహంతో బైకులు, ఇతర వాహనాలు నడపడం వల్ల ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

**చిన్నారులు వాహనాలు నడపడం: పొంచి ఉన్న ప్రమాదాలు**

వేసవి సెలవుల్లో పిల్లలు ఖాళీగా ఉండటంతో తల్లిదండ్రుల కళ్లు గప్పి లేదా వారి అనుమతితోనే వాహనాలు (ముఖ్యంగా టూ వీలర్స్) రోడ్లపైకి తీస్తున్నారు. ఇది అనేక విధాలుగా ముప్పు తెస్తుంది:

- శారీరక, మానసిక పరిపక్వత లేకపోవడం వల్ల వాహనాన్ని అదుపు చేయగలిగే శారీరక బలం పిల్లలకు తక్కువగా ఉంటుంది.
- ట్రాఫిక్ నిబంధనల మీద అవగాహన ఉండదు. వేగంపై నియంత్రణ లేకపోవడం వల్ల చిన్న పొరపాటు జరిగినా అది పెద్ద ప్రమాదానికి దారితీస్తుంది.
- అతివేగం మరియు స్టంట్లు సెలవుల్లో స్నేహితులు తోడవ్వడంతో పిల్లలు పోటీలు పడటం, అతివేగంతో వాహనాలు నడపడం చేస్తుంటారు.
- రోడ్లపై సరదా కోసం చేసే విన్యాసాలు ప్రాణాల మీదకు వస్తాయి.
- లైసెన్స్ లేకపోవడం - చట్టపరమైన ఇబ్బందులు 18 ఏళ్ల లోపు పిల్లలకు వాహనం ఇవ్వడం చట్టరీత్యా నేరం

చిన్నారుల ప్రాణం ఎంతో విలువైనది. కాబట్టి సెలవుల వినోదం విషాదంగా మారకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. పల్లెల్లోని చెరువులు, బావుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు స్థానికులు నిరంతరం నిఘా ఉంచాలి.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పిల్లలు ఈత కొట్టాలని పట్టుబడితే వారిని వెళ్లి పరిస్థితిని చూసి ఒంటరిగా నీటి వనరుల వద్దకు పంపకూడదు. కచ్చితంగా ఇంటి పెద్దలు వెంట ఉండాలి.
- చెరువులు, బావుల్లో లోతు ఎంతో తెలియకుండా నీటిలోకి దిగనివ్వకూడదు.
- పాచి పట్టిన మెట్లు, బురద ఉన్న చోట్ల జారిపడే ప్రమాదం ఉంటుంది. ఈత నేర్చుకోవాలనుకునే పిల్లలకు అనుభవజ్ఞుల పర్యవేక్షణలోనే శిక్షణ ఇప్పించాలి.
- గాలి నింపిన ట్యూబులు లేదా లైఫ్ జాకెట్లు వంటి రక్షణ కవచాలను వాడటం శ్రేయస్కరం.
- నీటిలో ప్రమాదం జరిగితే ఎలా బయటపడాలో, ఇతరులకు ఎలా సమాచారం ఇవ్వాలో పిల్లలకు వివరించాలి.
- మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా చూడాలి.
- సైకిళ్లకు ప్రాధాన్యత ఇస్తూ,కలిగే ప్రయోజనాలు చెప్పాలి
- రోడ్డు ప్రమాదాల పట్ల చిన్నారులకు అవగాహన కల్పించాలి.



జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
27 ఏప్రిల్ 2026

# 141వ మేడే వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- చిగురుమామిడి మండల కేంద్రంలో ఏఐటియుసి పోస్టర్ ఆవిష్కరణ
- కార్మికులకు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిట్టల సమ్మయ్య పిలుపు

**చిగురుమామిడి ఏప్రిల్ 26(జనంసాక్షి ):** మండల కేంద్రంలో 141వ మేడే వేడుకలను ఘనంగా నిర్వహించాలంటూ వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కార్మిక ఐక్యత,హక్కుల సాధనపై నాయకులు పలు అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిట్టల సమ్మయ్య మాట్లాడుతూ మే డే అనేది ప్రపంచ కార్మికుల ఐక్యతకు ప్రతీకగా నిలిచిన గొప్ప రోజు అని పేర్కొన్నారు.కార్మికుల హక్కుల కోసం జరిగిన పోరాటాల చరిత్రను గుర్తుచేసుకుంటూ,ప్రస్తుత కాలంలో కూడా కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఉపాధి లోపం,తక్కువ వేతనాలు,అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు, సంక్షేమ పథకాల అమలులో ఉన్న లోపాలు వంటి అంశాలపై పోరాటం అవసరమని అన్నారు.

అలాగే చిగురుమామిడి మండలంలోని ప్రతి గ్రామం నుంచి రైతులు,కూలీలు,కార్మికులు, ఆటో యూనియన్ సభ్యులు సహా అన్ని వర్గాల కార్మికులు మే 1న తమ తమ గ్రామాల్లో జెండాలు ఆవిష్కరించి కార్మిక ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.కార్మికుల మధ్య ఐక్యత పెరిగితేనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని, అందుకోసం అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని సూచించారు. మే డే అంబేద్కర్ చౌరస్తా వద్ద భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా భవనిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గందే కొమురయ్య, పొన్నం సంపత్, హామాలి కార్మికులు ఐలయ్య,రాజయ్య, మహేందర్,కొమురయ్య, రాయలింగు, తదితరులు పాల్గొన్నారు

# డంపు యార్డు సమస్యపై బండికి భాధ్యత లేదా?

- కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌ను తీసుకువచ్చి హడావిడి చేసినదంతా వట్టిదేనా ?
- సమస్యను పరిష్కరించడానికి నిర్మాణాత్మకమైన చొరవ చూపండి
- హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి డంప్ యార్డ్ పేరుతో ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారు.
- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 26 (జనంసాక్షి) :**
బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు కరీంనగర్‌లో ఎల్లప్పుడూ సహకరించుకుంటాయని ఆది నిన్నటి మున్సిపల్ కార్పోరేషన్ కో ఆప్షన్ ఎన్నికతో మరొకసారి రుజువయ్యిందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఆర్అండ్‌బి గెస్ట్ హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... డంపు యార్డు సమస్య పై కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కు భాధ్యత లేదా అని నరేందర్ రెడ్డి ప్రశ్నించారు. సంవత్సరం క్రితం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను తీసుకువచ్చి డంపు యార్డు, ఇతర సమస్యలకు సర్వరోగ నివారిణిని తీసుకువచ్చానని హడావిడి చేసి స్మార్ట్ సిటీ పనులకు అట్టహాసంగా ప్రారంభోత్సవాలు చేసి కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అన్ని పనులు జరిగిపోయినట్టు ప్రజలకు భ్రమలు కల్పించారని ఇప్పుడేమో భాధ్యత లేనట్టు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ నాయకుల ఇళ్ల ముందు జంతువుల కళేబరాలు వేస్తామని దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని నరేందర్ రెడ్డి మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అందరి క్షేమం కోరుకునేవారని డంపు యార్డు విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఒక్కటై హుజురాబాద్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వాస్తవాలు తెలుసుకోకుండా అనవసరంగా రకరకాల విన్యాసాలు ప్రదర్శిస్తున్నాడని నరేందర్ రెడ్డి మండిపడ్డారు. ఇప్పటికైనా బండి సంజయ్ కుమార్ ప్రజలను తప్పుదోవ పట్టించడం మాని కేంద్రం ద్వారా ఏవిధమైన సహకారం లభిస్తుందో చూడాలని రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో ఉందని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఎండి తాజ్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కార్పోరేటర్లు వరాల నర్సిం గం, పర్వతం మల్లేశం, కాంతాల జగన్ రెడ్డి, నాయకులు దండి రవీందర్, ఇట్టెపు వేణు, మ్యాకల నర్సయ్య, జీడి రమేష్, వంగల విద్యాసాగర్, నాగుల సతీష్, అనీఫ్, ఉప్పరి అజయ్, ఖలీల్ పాల్గొన్నారు.

# జిడికె 11వ ఇంక్లైన్‌లో మూడో చైర్ లిఫ్ట్‌ను ప్రారంభించండి

- ఎల్‌హెచ్‌డి సెక్షన్‌లో గాలి, నీరు, వెలుతురు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి
- కార్మికుల సమస్యల పై మేనేజర్ తో చర్చించిన ఏఐటియుసి నాయకులు



**గోదావరిఖని, ఏప్రిల్ 26 (జనంసాక్షి) :** సింగరేణి అర్జీ వన్ ఏరియా లోని జీడికే 11వ ఇంక్లైన్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గని మేనేజర్‌తో చర్చించడం జరిగిందని గుర్తింపు సంఘం ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీనులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గనిలో గాలి, నీరు సరఫరా సరిగా లేకపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మెరుగైన గాలి సరఫరా లేకుండా కార్మికులను విధులు నిర్వహించమని యాజమాన్యం ఒత్తిడి చేయడం సరైనది కాదని, వెంటనే తగు చర్యలు తీసుకోవాలని వారు మేనేజర్ ను కోరారు. అదేవిధంగా కార్మికులకు తగినన్ని పనిముట్లు అందించడం లేదని వాటిని పూర్తిగా సరఫరా చేయాలని కోరారు, విధులకు వెళుతున్న కార్మికులకు చైర్ కార్లు సరిపడా లేవని , వాటి సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ఎల్.హెచ్.డి సెక్షన్ లో మూడో చైర్ లిఫ్ట్ వెంటనే ఓపెన్ చేయాలని వారు మేనేజర్ ను కోరారు. ఈ సందర్భంగా గని మేనేజర్ స్పందిస్తూ వారం లోపు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని నాయకులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఏఐటియుసి అర్జీ వన్ బ్రాంచి జిఎం కమిటీ సభ్యులు సిద్ధమల్ల రాజు, ఫిట్ సెక్రటరీ నాయిని శంకర్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ గొడిశల నరేష్, మైన్స్, సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# శ్రీయుగ ఎన్‌క్లేవ్‌కు నూతన కమిటీ ఎన్నిక

**సంక్షేమం - అభివృద్ధి దిశగా కృషి**

**కాప్రా, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** కాప్రా సాకేత్ లోని శ్రీయుగ ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు రాబోయే కాలానికి నూతన గవర్నింగ్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోపిరెడ్డి మాల్యాద్రి రెడ్డి (జీఎంఆర్), ఉపాధ్యక్షుడిగా టి.ఎన్. సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా కొచెర్లకోట శ్రీకాంత్, కోశాధికారిగా పడమటి వెంకట రాంప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా అరుపుల నర్సిములు ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా వర్ధని నాగరి రజిత, సైనీ అభిలాష్, కుప్పాని సురేష్, జవల్కర్ హరిప్రసాద్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఎన్‌క్లేవ్‌లో మౌలిక సదుపాయాల మెరుగుదల, భద్రత, పారిశుద్ధ్యం, నివాసుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. అందరి సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

# ప్రమాదపు అంచున అంగన్ వాడి కేంద్రం

## ఒకే గదిలో 45 మంది విద్యార్థులు

- అసంపూర్తిగా అంగన్ వాడి భవనం
- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు



**మధ్యలోనే ఆగిపోయిన భవన నిర్మాణం**

ఈ సమస్యల పరిష్కారం కోసం కొత్త భవన నిర్మాణాన్ని ప్రారంభించినప్పటికీ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. అసంపూర్తిగా ఉన్న భవనం అంగన్‌వాడీ అవసరాలకు ఉపయోగపడకుండా పోయింది. కాంట్రాక్టర్ పనులను వదిలేయడంతో చిన్నారులకు సురక్షితమైన వాతావరణం కరువైంది. చిన్నారుల భవిష్యత్తు, గర్భిణీ స్త్రీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. నిలిచిపోయిన భవన నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించి, కేంద్రానికి స్వంత భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని వేడుకుంటున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని నూతన భవనం పనులు తొందరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



**కొందుర్గు ఏప్రిల్ 26 (జనంసాక్షి) :**
రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-1 పరిస్థితి దినదినగండంగా మారింది. అరకొర వసతులు, ఇరుకైన గదుల మధ్య చిన్నారులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇక్కడ జరిగిన ప్రమాదం స్థానికులను ఇంకా భయపెడుతూనే ఉంది. ఈ కేంద్రంలో ప్రస్తుతం 18 మంది విద్యార్థులు, 16 మంది గర్భిణీలు, మరియు 11 మంది బాలింతలు - మొత్తం 45 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇంతమందికి కనీసం కూర్చోవడానికి కూడా స్థలం సరిపోకపోవడంతో గర్భిణీ స్త్రీలు, బాలింతలు కేంద్రానికి రావడానికి వెనుకడుగు వేస్తున్నారు. చిన్న గదిలో ఇంతమంది అందులోనూ వంటగదితో పాటు స్టోర్ రూమ్ కూడా ఇందులోనే ఇరుక్కుని ఉండటం వల్ల ఉక్కపోత, అసౌకర్యంతో చిన్నారులు అల్లాడిపోతున్నారు.
గత నెలలో ఈ కేంద్రంలో ప్రమాదవశాత్తు గ్యాస్ లీకేజీ జరిగి పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. అదృష్టవశాత్తూ అంగన్‌వాడీ టీచర్ అప్రమత్తంగా వ్యవహరించి చిన్నారులను వెంటనే బయటికి పంపడంతో తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. అప్పటి నుండి ఇక్కడ ఉండాలంటేనే తల్లులు భయపడుతున్నారు.
ప్రస్తుత భవనానికి సరైన కిటికీలు లేకపోవడంతో వర్షం కురిసినప్పుడు నీరు నేరుగా లోపలికి చేరుతోంది. దీంతో చిన్నారులకు, గర్భిణులకు ఇచ్చే పౌష్టికాహారం తడిసి ముద్దవుతోంది. దీనికి తోడు కిటికీల ద్వారా ఎలుకలు లోపలికి ప్రవేశిస్తూ ఆహార పదార్థాలను పాడుచేస్తున్నాయి. ఆ కలుషిత ఆహారం వల్ల చిన్నారులు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఇరుకు గదితో ఇబ్బందులు పడుతున్నాం**

"ఒకే గదిలో 45 మందితో కార్యకలాపాలు నిర్వహించడం చాలా కష్టంగా ఉంది. వంట చేసేటప్పుడు పిల్లలు పక్కనే ఉండటం ప్రమాదకరం. వర్షం పడితే నీరు చేరి ఇబ్బందులు పెరుగుతున్నాయి. లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా వెంటనే నూతన భవనాన్ని అందుబాటులోకి తేవాలి.



శ్రీలత, అంగన్‌వాడీ టీచర్

# స్వీయ జన గణన ప్రక్రియను విజయవంతం చేయాలి

**వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**



**వేములవాడ (జనంసాక్షి):** జన గణన 2027లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వీయ గణన ప్రక్రియను పట్టణ ప్రజలందరూ విజయవంతం చేయాలనీ వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. వేముల వాడ మున్సిపల్ కార్యాలయంలో ఉపాధ్యాయులకు జన గణనపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూడిజిటల్ జన గణనలో భాగస్వాములు కావాలనీ ఆన్‌లైన్ స్వీయ గణనఇంటి నుండే మీ జనాభా వివరాల నమోదు చేసుకోవచ్చన్నారు. జన గణన 2027లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వీయ గణన ప్రక్రియను పట్టణ ప్రజలందరూ వినియోగించుకుని విజయవంతం చేయాలని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పిలుపునిచ్చారు. ఆదివారం వేములవాడ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో జన గణన ప్రక్రియపై ప్రభు త్వ ఉపాధ్యాయులకు నిర్వహించిన అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొదటి జన గణన ఇది అని, తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్న ఈ ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఏప్రిల్ 26 నుండి మే 10వ తేదీ వరకు ప్రజలు తమంతట తామే ఆన్‌లైన్ ద్వారా వివరాలు నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. వెబ్‌సైట్ ద్వారా కేవలం 5 నిమిషాల్లో స్వీయ గణన పూర్తి చేయవచ్చని, ఈ వెబ్‌సైట్ పూర్తి సురక్షితమైనదని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు ఇచ్చే సమాచారం గోప్యంగా ఉంటుందని, దీనివల్ల ప్రభుత్వ పథకాలకు ఎలాంటి ఇబ్బంది కలగదని వెల్లడించారు.ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న తర్వాత వచ్చే 11 అంకెల ఎస్ఇ, ఐడిని భద్రపరుచుకోవాలని, మే 11 తర్వాత ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్లకు దీనిని చూపించి ధృవీకరించుకోవాలని సూచించారు. జన గణన విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులు, ఎన్యూమరేటర్లు ప్రజలకు అవగాహన కల్పించి, సర్వేలో అడిగే 34 ప్రశ్నలకు సరైన సమాచారం సేకరించాలని కోరారు. వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ , ప్రైవేట్ ఉద్యోగులు తమ మొబైల్ ఫోన్ల ద్వారా స్వీయ గణన చేసుకోవాలని, ఇంటికి వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించి సమయాన్ని ఆదా చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరాల శేఖర్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# వజ్రేష్ యాదవ్ కుమారుడి వివాహానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి

**బోడుప్పల్- జనంసాక్షి :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ (జంగయ్య యాదవ్) కుమారుడి వివాహ వేడుక నగరంలో అత్యంత ఘనంగా,వైభవంగా నిర్వహించబడింది. ఈ శుభకార్యానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించడం కార్యక్రమానికి మరింత ప్రత్యేకతను చేకూర్చింది. వివాహ వేదికకు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నిర్వాహకులు, కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఆయన వధూవరులకు ఆశీస్సులు అందజేస్తూ వారి దాంపత్య జీవితం ఆనందంగా,ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో బంధువులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ వారి ఆనందాన్ని పంచుకున్నారు.ఈ వివాహ వేడుకకు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా స్థాయి అధికారులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, సామాజిక వేత్తలు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వివాహ ప్రాంగణం మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో కళకళలాడుతూ, శుభాకాంక్షల సందడితో నిండిపోయింది. అత్యంత అందంగా అలంకరించిన వేదిక, సంప్రదాయబద్ధంగా నిర్వహించిన వివాహ కార్యక్రమాలు, అతిథులకు అందించిన ఆతిథ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అతిథులతో ఈ వేడుక ఒక సామాజిక,రాజకీయ వేదికగా మారి ప్రత్యేక గుర్తింపు పొందింది.



# సుందరగిరి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొన్నం

**భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసి విజయవంతం చేసేలా కృషి చేయాలని పిలుపునిచ్చిన మంత్రి**

చిగురుమామిడి ఏప్రిల్ 26 (జనంసాక్షి):మండలంలోని సుందరగిరి శ్రీవెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆదివారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వాల్ పోస్టర్, కరపత్రాలను ఆలయ నిర్వహణాధికారి కొండపర్తి రాజ్ కుమార్,ఆలయ కమిటీ చైర్మన్ చొల్లేటి శంకరయ్య,ఆలయ సిబ్బంది సమక్షంలో ఆవిష్కరించారు.బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలే కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సూచించారు.ఈ నెల 27నుంచి మే 5వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా మే1న స్వామి వారి కళ్యాణం,3న సాంస్కృతిక కార్యక్రమాలు,4న శకటోత్సవం (బండ్లు తిరుగుట)5న రథోత్సవం,కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వహణాధికారి రాజ్ కుమార్,ఆలయ కమిటీ చైర్మన్ చొల్లేటి శంకరయ్యలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ రికార్డు అసిస్టెంట్ బూట్ల కవిత,ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం


- రైతులు దళారులను ఆశ్రయించవద్దని సూచన
- ప్రభుత్వ కేంద్రాల్లో సరైన ధర లభిస్తుందని పుండ్రా నారాయణరెడ్డి భరోసా

**కథలాపూర్, ఏప్రిల్ 26 (జనంసాక్షి) :**
రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాయితి నాగరాజుతో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ పుండ్రా నారాయణరెడ్డి ఆదివారం ఫ్యాక్స్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కలిగోట తూర్తి, ఇప్పపెల్లి, పోసానిపేట, దూలూరు, పెగ్గర్ల, ఊట్పల్లి, చింతకుంట, రాజారం తండా గ్రామాల్లో ఈ కేంద్రాలు ప్రారంభించబడ్డాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంటలను దళారులకు అమ్మి నష్టపోవద్దని సూచించారు.

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యానికి సరైన ధర లభిస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పులి శిరీష హరిప్రసాద్, సర్పంచులు, ఉపసర్పంచులు, డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఐక్య పోరాట ఫలితమే ఆర్టీసీ విలీనం, 11% పీఆర్‌సీ

- కార్మిక సంఘాల సమ్మెలతో సాధించిన విజయాలు : ఏఐటీయూసీ
- హక్కుల కోసం ఐక్యంగా పోరాటాలు కొనసాగించాలి
- శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా నిలవాలి



**గోదావరిఖని, ఏప్రిల్ 26 (జనంసాక్షి) :** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, 11 శాతం పీఆర్‌సీ ప్రకటించడం కార్మిక సంఘాల ఐక్య పోరాట ఫలితమేనని ఏఐటీయూసీ రామగుండం నగర సమితి అధ్యక్షుడు అబ్దుల్ కరీం, ప్రధాన కార్యదర్శి శనిగరపు చంద్ర శేఖర్ తెలిపారు. శనివారం నిర్వహించిన ఏఐటీయూసీ సమావేశంలో వారు ఈ విషయాన్ని వెల్లడించారు. తెలంగాణ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్, ఏఐటీయూసీ, జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన సమ్మెలు, ఉద్యమాల వల్లే ఈ నిర్ణయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. కార్మికులు భావోద్వేగా లకు లోనుకాకుండా హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటాలు కొనసాగించా లని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తమకు మార్గదర్శకత్వం అందించిన సీపీఐ జాతీయ నాయకులు చాడా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాజ్యసభ సభ్యుడు వేమ్ నరేందర్ రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.సమ్మె సమయంలో క్రియాశీలకంగా పాల్గొన్న నర్సంపేట డ్రైవర్ కోలా శంకర్ గౌడ్ మృతి దురదృష్టకరమని పేర్కొంటూ, ఆయన కుటుంబాని కి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. గత ప్రభుత్వం ఆర్టీసీలో యూనియన్లను రద్దు చేయడం తప్పిదమని, ప్రస్తుత ప్రభుత్వం యూనియన్లను అనుమతించి ఎన్నికలు నిర్వహించేందుకు ముందుకు రావడం స్వాగతించదగిన పరిణామమని అభిప్రాయపడ్డారు. కార్మిక వర్గ ఐక్యతే శక్తి అని పేర్కొంటూ, సమస్యల పరిష్కార దిశగా ముందుకు సాగుతున్న ఆర్టీసీ కార్మికులు, జేఏసీ నాయకులకు ఏఐటీయూసీ తరఫున అభినందనలు తెలిపారు. సమావేశంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# బెల్లి లలితక్క జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి

**టీఎల్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డల్లా సురేష్ మహాజన్**

**ఎడపల్లి, ఏప్రిల్ 26 (జనంసాక్షి) :** తెలంగాణ వీరనారి, విప్లవ గాన కోకిల బెల్లి లలితక్క జయంతి, వర్ధంతి లను అధికారికంగా నిర్వహించాలని టిఎల్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు డల్లా సురేష్ మహాజన్ కోరారు. ఆదివారం బెల్లి లలితక్క జయంతిని పురస్కరించుకొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏప్రిల్ 26 1971లో నల్గొండ జిల్లాలో యాదవ కుటుంబంలో జన్మించిన బెల్లి లలితక్క జయంతి సందర్భంగా తెలంగాణ లోకల్ ఫోర్స్ తరపున యావత్ తెలంగాణ ప్రజలకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బెల్లి లలితక్క నిరంతరం ప్రజల తరపున పోరాడుతూ, తన ఆటా పాటలతో ప్రజలను చైతన్యం చేసిందన్నారు. తెలంగాణ ప్రజా కళా మండలిలో చురుకుగా పని చేస్తూ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండకడుతూ నల్గొండ జిల్లాలో ఉవ్వెత్తున ఉద్యమం చేస్తూ ప్రభుత్వం కు కొరకరాని కొయ్యగా మారిందన్నారు. ప్రజా మనిషిగా ఎదుగుతున్న సమయంలో నాటి ప్రభుత్వం కుట్రలకు బలై బెల్లి లలితక్కను దుండగులు 17 ముక్కలుగా నరికి హత్య చెయ్యడం జరిగిందన్నారు. బెల్లి లలితక్క లాంటి వారి వీరోచిత పోరాట స్ఫూర్తి తోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం సజీవంగా బతికి నేడు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు.

ఈ సందర్భంగా బెల్లి లలితక్క కు ఘనమైన నివాళులు అర్పిస్తూ గత కేసీఆర్ ప్రభుత్వం మారోజు వీరన్న బెల్లి లలితక్క లాంటి నిస్వార్థ తెలంగాణ పోరాట యోధులను గుర్తించడంలో నిరంకుశంగా ప్రవర్తించిందని ఆరోపించారు. ప్రజా పాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మారోజు వీరన్న, బెల్లి లలితక్కల విగ్రహాలను ట్యాంక్ బండ్ మీద ఏర్పాటు చేయడంతో పాటు వారి జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని టిఎల్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడుగా ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నట్లు డల్లా సురేష్ మహాజన్ స్పష్టం చేశారు.

# క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రికెట్ పోటీలు

- పోటీలను ప్రారంభించిన ప్రభుత్వ విప్ విజయ రమణారావు

**సుల్తానాబాద్,ఏప్రిల్ 26(జనంసాక్షి) :** గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలనే సంకల్పంతో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. ఆదివారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కీర్తిశేషులు అల్లాడి అరవిందరావు స్మారక అర్థం సుల్తానాబాద్ మండల కేంద్రంలో ఎస్‌పిఎల్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు.అనంతరం మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలో వేసవి సమయంలో యువత పెడదోవ పట్టవద్దనే సంకల్పంతో యువతలో దాగివున్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్,మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, అబ్బయ్య గౌడ్ మున్సిపల్ కౌన్సిలర్లు,కమిషనర్ తిప్పరాజు రమేష్, జిల్లా నిర్వాహకులు సంజీవ్, క్రాంతి,వేముల అనిల్,సతీష్, సిద్ధా తిరుపతిల తోపాటు క్రీడాకారులు,తదితరులు పాల్గొన్నారు.

# స్వీయ గణనకు జిల్లా కలెక్టర్ శ్రీకారం




**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 26 (జనంసాక్షి) :**
కలెక్టర్ స్వయంగా తన వివరాల నమోదు చేసుకొని స్వీయ గణన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జనాభా గణన ఒక జాతీయ కీలక కార్యక్రమం అని పేర్కొన్నారు. ఇది దేశంలోని జనాభా వారి సామాజిక ఆర్థిక పరిస్థితులపై సమగ్ర సమాచారం అందించడం తోపాటు సమర్థవంతమైన ప్రణాళిక సుపరిపాలన వనరుల సమాన పంపిణీకి పునాదిగా నిలుస్తుం ఓదన్నారు. ప్రతి పౌరుడు ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని ఖచ్చితమైన సమాచారం అందించి జనాభా గణన సిబ్బందికి పూర్తిగా సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. కలెక్టర్ తో పాటు జిల్లా అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లాప్రణాళిక అధికారి రామ్ దత్తారెడ్డి వివరాలు నమోదు చేసుకున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
27 ఏప్రిల్ 2026

# ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి ఘటనపై విచారణ

**రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** నల్గొండ – దిల్ సుఖ్ నగర్ మధ్య నడుస్తున్న ఆర్టీసీ హైర్ బస్సు డ్రైవర్ టి.రామ్ కుమార్‌పై జరిగిన దాడిని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. దాడి ఘటనపై జిల్లా పోలీస్ అధికారులతో మాట్లాడి విచారణకు ఆదేశించారు. నల్గొండ నుండి వివిధ స్టాప్‌ల వద్ద ఆగుతూ ప్రయాణికులను తీసుకొని వస్తున్న బస్సు వెనకాల బైక్ పై వస్తున్న వ్యక్తి తన భార్యను తీసుకొని వస్తు నల్గొండ ఐటీ టవర్ వద్దకు రాగానే తనను బస్సు ఎక్కించే ఉద్దేశ్యంతో బస్సును ఓవర్ టెక్ చేసి అడ్డగించి డ్రైవర్ రామ్ కుమార్ పై దాడి చేసినట్లు పోలీసులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. విధుల్లో ఉన్న ఆర్టీసీ సిబ్బంది పై దాడి చేస్తే ఉపేక్షించేది లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. డ్రైవర్ రామ్ కుమార్ పై దాడి చేసిన వ్యక్తి పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. భవిష్యత్ లో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

# సైబర్ నేరగాళ్లపై 'ఆపరేషన్ క్రాక్‌డౌన్ 2.0' నిఘా

**డైరెక్టర్ శిఖా గోయల్**



**హైదరాబాద్, ఏప్రిల్ 26 (జనంసాక్షి):** రాష్ట్రంలో సైబర్ నేరాల కట్టడికి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసిఎస్బి) సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది. గడిచిన రెండేళ్లలో అరెస్టయిన నేరగాళ్లు మళ్లీ నేరాల బాట పట్టకుండా ఉండేలా 'ఆపరేషన్ క్రాక్‌డౌన్ 2.0' పేరిట భారీ నిఘా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ వెల్లడించారు. ఏప్రిల్ 25వ తేదీ ఉదయం 8 గంటల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రత్యేక తనిఖీలు ప్రారంభమయ్యాయని, శాంతిభద్రతల విభాగం పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ఈ ఆపరేషన్ నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు.

సైబర్ నేరాల పట్ల తమది 'జీరో టాలరెన్స్' విధానమని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ స్పష్టం చేశారు. 2024–25 కాలంలో తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 3,567 మంది సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేయగా, వారిలో రాష్ట్రానికి చెందిన 614 మంది ప్రధాన నిందితులపై ప్రస్తుతం ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఆమె తెలిపారు. ఈ తనిఖీల కోసం 300 బృందాలు క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగాయని, నిందితుల ప్రస్తుత నివాసం, వృత్తి, వారి ఆర్థిక లావాదేవీలను నిశితంగా పరిశీలిస్తున్నాయని శిఖా వివరించారు. ప్రతి నిందితుడి నివాసాన్ని జియో ట్యాగింగ్ చేయడం ద్వారా వారి కదలికలను నిరంతరం ట్రాక్ చేస్తున్నామని, వారు బెయిల్ నిబంధనలను అతిక్రమించకుండా చూస్తున్నామని ఆమె పేర్కొన్నారు.

### తెలంగాణలో 480 కేసులు

సైబర్ నేరాల కేసుల్లో అరెస్టయిన వారిలో మ్యూల్ అకౌంట్ హోల్డర్లు (269), ఏజెంట్లు (155), చైల్డ్ సెక్సువల్ అబ్యూస్ మెటీరియల్ (సి ఎస్ ఏ ఎం ) నిందితులు (36), సైబర్ స్లేవరీకి పాల్పడేవారు (8) వంటి వివిధ రకాల నేరగాళ్లు ఉన్నట్లు డైరెక్టర్ వెల్లడించారు. ఇప్పటివరకు 335 మందిని భౌతికంగా తనిఖీ చేయగా వీరికి తెలంగాణలో 480 కేసులు, దేశవ్యాప్తంగా 1,233 కేసులతో సంబంధం ఉన్నట్లు గుర్తించామని శిఖా గోయల్ తెలిపారు. వీరిలో 218 మంది ఆచూకీ లభించగా, 115 మంది పరారీలో ఉన్నారని, ముగ్గురు మరణించారని ఆమె వెల్లడించారు. ఈ క్రమంలోనే సీఎస్ఈఏఎం కేసులో నిందితుడైన ప్రసాద్ కుమార్ అనే వ్యక్తి ప్రస్తుతం నేపాల్‌లో ఉన్నట్లు గుర్తించామని, గతంలో అతడు సికింద్రాబాద్‌లోని ఒక రెస్టారెంట్‌లో పని చేసేవాడని ఆమె వివరించారు. ఒకసారి అరెస్టయిన తర్వాత కూడా నిందితులు పోలీసుల నిఘాలోనే ఉంటారని 'ఆపరేషన్ క్రాక్‌డౌన్ 2.0' ద్వారా తెలియజేస్తున్నామని శిఖా గోయల్ పునరుద్ఘాటించారు. ఎవరైనా మళ్లీ నేరాలకు పాల్పడినట్లు తెలిస్తే లేదా అనుమానాస్పదంగా ప్రవర్తిస్తే వారిపై వెంటనే 'సస్పెక్ట్ షీట్లు' తెరిచి, కఠిన నిఘా ఉంచుతామని హెచ్చరించారు. పౌరులను సైబర్ మోసాల నుండి రక్షించేందుకు తెలంగాణ పోలీసులు అన్ని దశల్లోనూ అప్రమత్తంగా ఉన్నారని డైరెక్టర్ శిఖా గోయల్ భరోసా ఇచ్చారు.

# నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు!

**హైదరాబాద్ (జనంసాక్షి) :** విధినిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై అకారణంగా దాడి చేసి, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై నల్గొండ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. డ్రైవర్ తల్లా రామ్ కుమార్‌పై దాడి చేసి గాయపరిచిన తుపాకుల వెంకటేశం అనే వ్యక్తిపై కేసు రిజిష్టరైంది. నల్గొండ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అర్జాలబావి గ్రామ సమీపంలో గల ఐటీ హబ్ వద్ద ఆదివారం ఉదయం సుమారు 08:10 గంటల సమయంలో ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు డ్రైవర్ తల్లా రామ్ కుమార్ బస్సును నిర్ణీత స్టాప్ వద్ద నిలిపారు. ఆ సమయంలో తన బైక్‌పై వచ్చిన తుపాకుల వెంకటేశం అనే వ్యక్తి, బస్సును మధ్యలో ఎందుకు ఆపలేదు? అని డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగాడు.

బస్సును కేవలం నిర్దేశించిన స్టాపుల వద్దే ఆపుతామని డ్రైవర్ రామ్ కుమార్ చెప్పినప్పటికీ నిందితుడు వెంకటేశం డ్రైవర్‌ను అసభ్య పదజాలంతో దూషించాడు. అనంతరం బస్సులోకి ప్రవేశించి డ్రైవర్‌ను సీటులో నుండి కిందకు లాగి విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో డ్రైవర్ రామ్ కుమార్ కుడి కంటిపైన, మోకాలికి గాయాలయ్యాయి. బాధితుడు రామ్ కుమార్ ఫిర్యాదు మేరకు నల్గొండ రూరల్ ఎస్ఐ సైదా బాబు నిందితుడు తుపాకుల వెంకటేశంపై బీఎన్ఎస్ సెక్షన్లు 118(1), 352 కింద కేసు ఎఫ్ఐఆర్ 90/2026) నమోదు చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల విధినిర్వహణకు ఆటంకం కలిగిస్తూ వారిపై భౌతిక దాడులకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి హెచ్చరించారు. ఆర్టీసీ సిబ్బందికి అండగా ఉండి వారి రక్షణే తమధ్యేయ మని నాగిరెడ్డి చెప్పారు.

# కూల్చివేతలన్నీ హైడ్రాకు ఆపాదించడం తగదు

**హైకోర్టు ఆదేశాల మేరకు ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్లు**

**సోషల్ మీడియా దుష్ప్రచారాన్ని ఖండించిన హైడ్రా**

**హైదరాబాద్, ఏప్రిల్ 26 (జనంసాక్షి) :** ఎక్కడ కూల్చివేతలు జరిగినా హైడ్రా చేసినట్టు చూపించి.. దుష్ప్రచారం చేయడాన్ని హైడ్రా ఖండించింది. ఈ విషయాన్ని సోషల్ మీడియా ప్రతినిధులు గుర్తించాలని హైడ్రా కోరింది. అవగాహన లేకుండా సోషల్ మీడియా ప్రసారం చేస్తున్న వార్తలు.., వీడియోలను.. కబ్జాలు, ఆక్రమణలకు పాల్పడుతున్నవారు హైడ్రాపై దుష్ప్రాచారానికి వాడుతున్నారు. పద్ధతి ప్రకారం హైడ్రాపై దుష్ప్రచారం చేస్తున్నారు. నగరంలో ఫుట్ పాత్‌ల ఆక్రమణలను హైడ్రా తొలగించడంలేదు. హైకోర్టు ఆదేశాల మేరకు నగరంలో ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపును మూడు మున్సిపల్ (జీహెచ్ ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ) కార్పొరేషన్లు పెద్దయెత్తున చేపట్టాయి. ఈ క్రమంలోనే పాతబస్తీతో పాటు.. నగరంలో అనేక ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను ఆయా మున్సిపల్ కార్పొరేషన్లు తొలగిస్తున్నాయి. ఈ విషయాన్ని అందరూ గ్రహించాలని హైడ్రా సూచించింది. హైడ్రా భారీ ఆపరేషన్లు చేస్తుంది. బడాబాబులు, కబ్జాదారుల ఆటకట్టించి వారి ఆక్రమణలను హైడ్రా తొలగిస్తుంది. ఇలా వందలు, వేల ఎకరాల ప్రభుత్వ భూముల(ప్రజల ఆస్తిని)ను హైడ్రా కాపాడింది. చెరువులు, నాలాలు, రహదారులు, పార్కుల ఆక్రమణల తొలగింపును హైడ్రా చేపడుతుంది. రెవెన్యూ అధికారుల అభ్యర్థన మేరకు ప్రభుత్వ భూముల ఆక్రమణలను హైడ్రా తొలగిస్తుంది. నగరంలో గొలుసు కట్టు చెరువులను పునరుద్ధరించే పనిలో హైడ్రా నిమగ్నమై ఉంది. వర్షాకాలం వరదల కట్టడి చేయడమే లక్ష్యంగా హైడ్రా పని చేస్తోంది. పర్యావరణహితమైన నగర నిర్మాణం ప్రభుత్వ లక్ష్యం.. ఆ దిశగా హైడ్రా పని చేస్తోంది.



# రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరతపై దృష్టి సారించండి

- తక్షణమే తగిన చర్యలు తీసుకోండి!
- రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర

**హైదరాబాద్ (జనం సాక్షి) :** తెలంగాణలో పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రంగా నెలకొనడంతో వినియో గదారులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన కొరతను వెంటనే నివారించాల్సిందిగా భారత్, హిందుస్థాన్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్స్ ఉన్నతాధికారులను పెట్రోలియం పార్లమెంటరీ స్థాయీ సంఘం సభ్యులు, ఎంపీ రవిచంద్ర కోరారు. హైదరాబాద్ నుంచి హన్మకొండకు ఆదివారం వెళ్తుండగా తాను పలు చోట్ల వాహనదారులు పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరి ఉండడాన్ని గమనించానని ఫోన్ చేసి అధికారులకు వివరించారు ఎంపీ. పెట్రోల్, డీజిల్ కొరతను వెంటనే అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాల్సిందిగా ఎంపీ వద్దిరాజు కోరడంతో సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందించారు.

# దుశ్చర్ల సత్యనారాయణపై దాడి పర్యావరణంపై దాడి

**పర్యావరణ పరిరక్షణలో మన వంతు పాత్ర పోషిద్దాం**

**నిమ్స్ ఆస్పత్రిలో మంత్రి కొండా సురేఖ పరామర్శ**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** దుశ్చర్ల సత్యనారాయణపై దాడి పర్యావరణంపై దాడి అని మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రముఖ పర్యావరణవేత్త, జలసాధన సమితి జాతీయ అధ్యక్షులు దుశ్చర్ల సత్యనారాయణ గారిపై గొర్రెల కాపర్లు చేసిన దాడిని ఖండించారు. పర్యావరణ సమతుల్యత కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రముఖ పర్యావరణవేత్త దుశ్చర్ల సత్యనారాయణ స్ఫూర్తితో ప్రతి ఒక్కరం ఒక మొక్క నాటితేనే భూమికి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ప్రకృతిని కాపాడటం మన బాధ్యత అని, మొక్క నాటడం మన కర్తవ్యమని, పర్యావరణ పరిరక్షణలో మన వంతు పాత్ర పోషిద్దామని తెలిపారు. నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రకృతిని కాపాడే వ్యక్తిపై దాడి జరగడం చాలా దురదృష్టకరమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సత్యనారాయణ త్వరగా కోలుకుని మళ్లీ పర్యావరణ సేవలో ముందుకు రావాలని ఆకాంక్షించారు. పూర్వీకుల నుంచి వచ్చిన తన 70 ఎకరాల భూమిలో వేలాది మొక్కలను నాటి కృత్రిమ అడవిని సృష్టించి, పర్యావరణ సమతుల్యత కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రముఖ పర్యావరణవేత్త, జలసాధన సమితి జాతీయ అధ్యక్షులు దుశ్చర్ల సత్యనారాయణపై జరిగిన దాడి ఎంతో బాధ కలిగించిందని, పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన 70 ఎకరాల భూమిలో వేలాది మొక్కలను నాటి కృత్రిమ అడవిని సృష్టించి, పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ ఆదర్శంగా నిలుస్తున్న వ్యక్తిపై ఇలాంటి దాడులకు పాల్పడటం అత్యంత విచారకరమని, ఇటువంటి ఘటనలు సమాజానికి హానికరమని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు దాడిలో గాయపడిన దుశ్చర్ల సత్యనారాయణకు ప్రభుత్వ ఖర్చులతో నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు.




# ప్రభుత్వ పనితీరుపై మండలి చైర్మన్ గుత్తా అసహనం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** సొంత పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులే కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహారశైలిపై మండిపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం, రైతు భరోసా ఎగవేత, సన్నాలకు బోనస్ లాంటి నిర్ణయంపై ఇప్పటికే రైతన్నల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సొంత ప్రభుత్వానికి చురకలంటించారు.

ధాన్యం కొనుగోలు, రైతు భరోసా, సన్నాలకు బోనస్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై గుత్తా సుఖేందర్ రెడ్డి మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు నత్తనడకన నడుస్తుందని, నాణ్యత లేని వరి విత్తనాలు రైతులకి ఇస్తున్నారని, రైతు భరోసా అందరికీ అందడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్నాళ్లూ లేఖలు రాసే అలవాటున్న గుత్తా సుఖేందర్ రెడ్డి.. ఈ సారి మాత్రం నేరుగా ప్రెస్ మీట్ పెట్టి మరి ప్రభుత్వాన్ని తప్పు పట్టడం సీఎం రేవంత్ సర్కార్ పనితీరు ఎలా ఉందో మరోసారి అద్దం పడుతుంది. లేఖలకు ప్రభుత్వం నుంచి రిప్లయ్ వస్తున్నా అమల్లోకి రావడం లేదని గుత్తా సుఖేందర్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు.

# కూలీలపై పోలీస్ అధికారి కాల్పులు

**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** ఒక పోలీస్ అధికారి కొందరు కూలీలపై కాల్పులు జరిపాడు. ఈ సంఘటనలో ఒక కూలీ మరణించాడు. మరో కూలీ గాయపడ్డాడు. కాల్పుల ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పారిపోయిన ఆ పోలీస్ అధికారిని అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. ద్వారకాలోని జాఫర్‌పూర్ కలాన్ ప్రాంతంలో కొన్ని కూలీల కుటుంబాలు నివసిస్తున్నాయి. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో కొందరు కూలీలు పార్టీ చేసుకున్నారు.కాగా, ఆ కూలీలు పెద్దగా శబ్దాలు చేయడంతో సమీపంలో నివసించే పోలీస్ అధికారి అక్కడకు వచ్చాడు. ఈ సందర్భంగా వారితో వాగ్వాదం జరిగింది. ఆగ్రహించిన ఆ పోలీస్ అధికారి తన వద్ద ఉన్న రివాల్వర్‌తో కూలీల గుంపుపై కాల్పులు జరిపాడు. ఇద్దరు కూలీలు గాయపడగా వారిని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఒక కూలీ మరణించాడు. మరోవైపు కాల్పుల సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కూలీలపై కాల్పులు జరిపిన తర్వాత పారిపోయిన పోలీస్ అధికారి కోసం బృందాలు వెతుకుతున్నాయని పోలీస్ అధికారి తెలిపారు.




# ఏం చిన్నది.. ఎంత బాగున్నది!

**ఆదిలాబాద్ ప్రతినిది, (జనంసాక్షి):** నల్లని రంగుతో నిఘనిఘలాడే మగ కోకిలకు బిన్నంగా ఇంకో అందమైన కోకిల ఉందని మీకు తెలుసా? ఈ చిత్రంలో కనిపించే అందమైన చిన్నదే ఆ ఆడ కోకిల ఇది గోధుమ రంగులో ఉండి శరీరం మొత్తం నలుపు, తెలుపు చారలు కల్గి, ముఖం ముదురు గోధుమ రంగులో ఉండి కళ్ళు మాత్రం పొడుస్తున్న పొద్దులో సూర్యుడు ఏవిధంగా ఎర్రగా కనిపి స్తాడో ఆవిధంగా ఈ పక్షి కళ్ళు అంత ఎరువు రంగులో ఉండి ఈ చిన్నది ఎంతో అందంగా కనిపిస్తుంది. అన్నట్టు ఈ పక్షులు తమ గూడులో గుడ్లు పెట్టకుండా కాకులు కానీ వేరే ఇతర పక్షి గూడులను వెతికి అందులో గుడ్లు పెడతాయి. ఇవి అడవిలో దొరికే పండ్లు, చిన్న చిన్న కీట కాలను తింటూ జీవిస్తాయి.ఇవి చాలా తక్కువ సంఖ్యలో కనిపిస్తాయి. ఈ పక్షిని జిల్లాకు చెందిన ప్రముఖ వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ ఆదివారం ఉట్నూ ర్ మండలం బిర్సా యిపేట కవ్వాల్ అడవుల్లో తన కెమెరాలో బంధించాడు.

# టోల్ సిబ్బందిపై ఎమ్మెల్యే అనుచరుల వీరంగం

**చంద్రబాబు తీవ్ర ఆగ్రహం..!**





**అన్నమయ్య (జనంసాక్షి) :** అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలం గండబోయినపల్లె టోల్‌గేట్ వద్ద శనివారం సాయంత్రం చోటుచేసుకున్న దాడి ఘటన రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది. కళ్యాణదుర్గం టీడీపీ ఎమ్మెల్యే( అమిలినేని సురేంద్రబాబు అనుచరులు, గన్‌మెన్ టోల్ సిబ్బందిపై విచక్షణా రహితంగా దాడికి దిగడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించారు. అధికార గర్వంతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఎంతటి వారినైనా సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

ఘటన వివరాల్లోకి వెళితే.. తిరుమల దర్శనం ముగించుకుని వెళ్తున్న ఎమ్మెల్యే వాహన శ్రేణిని టోల్ ఫీజు కోసం సిబ్బంది ఆపారు. దీంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే అనుచరులు, గన్‌మెన్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో టోల్ మేనేజర్ రవిని కొట్టడమే కాకుండా, అడ్డువచ్చిన మహిళా ఉద్యోగి శ్రీలతపై కూడా చేతులెత్తారు. మేనేజర్‌ను బలవంతంగా కారులో ఎక్కించుకుని కిడ్నాప్ తరహాలో తీసుకువెళ్లడం అక్కడ ఉన్న వారిని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డయ్యాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే సీఎం చంద్రబాబు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మహిళా ఉద్యోగిపై దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. తక్షణమే దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. ప్రజాప్రతి నిధుల అనుచరులమని చెప్పుకుంటూ సామాన్యులపై దౌర్జన్యం చేస్తే ఊరుకోమని, ఇది ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించే చర్య అని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా, గన్‌మెన్ ప్రవర్తనపై కూడా ఉన్నతాధికారులు విచారణ కు ఆదేశించారు. ఈ ఘటనపై సోషల్ మీడియాలో నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ప్రభుత్వం వేగంగా స్పందించి చర్యలకు ఆదేశించడం గమనార్హం.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370